జి. యూదిన్

కళాతపస్వి యెగోరి













మధ్య యుగాలనాటి రష్యాలో ఒక అమర చిత్రకారుడు వుండే వాడు. యిది ఆ కళా తపస్వి గొప్ప గాథ. యెంతో సంఘటనా భరితంగా వుండే గాథ. ఆ నాటి జనజీవితంలో పాత ఐతిహాసిక వృత్తాంతాలు, పాటల గాథలు, జాతీయ ఆచారాలు, వ్రతాలు, గీతాలు, సంప్రదాయాలు పుష్కలంగా వుండి, ఆ జీవితాన్ని విశిష్టం చేసేవి. అవి మిలమిల మెరుస్తూ యీ కథలో పాఠకులకి పరిచయం అవుతాయి.



జి. యూదిన్

కళాతపస్వి యెగోరి

చిత్రాలు: రచయితవి

అనువాదం: ఆర్వియార్

"రాదుగ" ప్రచురణాలయం · మాస్కో
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

Г. Юдин
БЕЛАЯ ЛЕБЕДУШКА
На языке телугу

G. Yudin
THE TALE OF MASTER EGOR
In Telugu

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

ISBN 5-05-001445-x



ఒకటవ ప్రకరణం

పూర్వం యెప్పుడో రష్యా అనేక చిన్న చిన్న చిల్లర రాజ్యాలుగా చీలివున్న రోజులు. చాలా కాలం రాజ కుటుంబాల మధ్య యుద్ధాలు, కొట్లాటలు జరిగాయి. అప్పుడు మాస్కో రాజ్యం అన్ని చిల్లర రాజ్యాలనీ కలుపుకుని అఖండ రష్యా రాజ్యంగా ఆవిర్భవించింది.

ఈ మొత్తం రాజ్యం జార్ ఇవాన్‌కి దక్కింది. అప్పట్నుంచి మాస్కో అన్ని రాజ్యాలూ కలిసిన దేశానికి రాజధాని అయింది. జార్ ఇవాన్‌ని ప్రజలు ఇవాన్ ది టెర్రిబుల్ అని

పిలిచేవాళ్ళు. ఆయన మహా క్రూరుడవడంవల్ల ఆ పేరు పెట్టారు. అయినా మన కథ ఆయన గురించి కాదు, సాదా రష్యన్ కుర్రవాడు యెగోరి గురించి.

మాస్కోకి వో మాదిరి దూరంలో ఇళ్ల ఆయకట్టు పర్రు అనే గ్రామం వుండేది. అది కళకళలాడుతూ వుండే చిన్న వూరు. అది హోసం అనే నది వొడ్డున వుండేది. ఆ వూళ్లో యెగోరి పుట్టాడు. చిన్న పిల్లాడిగా వున్నప్పుడు అతన్ని యెగోర్కా అని పిలిచేవాళ్ళు.

అతనో చిత్రమైన కుర్రాడు. ఆ వూరి కుర్రాళ్లతో కలిసి పరుగులెడుతూ ఆడుకుంటూ గడిపేవాడు. ఒంగు దూకుళ్ళ ఆటో మరోటో ఆడుకుంటూ వుంటే వున్నట్టుండి టకామని ఆగిపోయేవాడు. వీధి మధ్యలో నిశ్చేష్టుడై నిలబడిపోయేవాడు.

''యేం ఆగిపోయావ్ యెగోర్కా?'' అని యెవళ్లో అడిగేవాళ్ళు.

''చూడండి సూర్యాస్తమయం యెలా వుందో! ఆకాశం మంటల్లో దగ్ధమైపోతున్నట్టుగా వుంది. కప్పలు బెకబెక మంటున్నాయి....''

''వీడి మాటలు వినండ్రా! యేం, కప్పలు బెకబెక మనడం యెన్నడూ వినలేదురా? చాలు, రా, ఆడతావా లేకపోతే నీళ్లల్లో తలముంచెయ్యమంటావా?''

లేకపోతే వొకోసారి బారుగా పెరిగిన గడ్డిలో పడుకుని పువ్వుల్ని చూస్తూ గంటల కొద్దీ వుండేవాడు.

''వొంట్లో బాగా లేదా బాబూ? పొద్దుటినుంచీ కదలకుండా అలానే పడుకున్నావ్'' అని వాళ్ల అమ్మ అడిగేది.

''మొక్కల కాండాలలో రసం వూరడం వింటున్నానమ్మా'' అనేవాడు.

''అదెలా వినిపిస్తుంది?'' అని తల్లి గోముగా అడిగేది. తర్వాత ఆలోచిస్తూ అతని కేసి చూసి నెమ్మదిగా వెళ్లిపోయేది.

యెగోర్కాకి మరో వేడుక వుండేది. తెల్లవారేటప్పుడు నక్షత్రాలు మణిగిపోయే సమయంలో పక్షుల్ని లేపేవాడు. తోటలో గడ్డిమీద ఆపిల్ పళ్ళు రాలిపడడం ఆ సమయంలో వినిపిస్తుంది. పెరట్లో అటూ యిటూ తిరుగుతూ నిదానంగా పిల్లనగ్రోవి వాయించేవాడు — స.రి.గ.మ. వేకువ పక్షి 'కూ కూ' అని బదులు చెప్పేది. తర్వాత యింకో పక్షి, ఆ తర్వాత యింకొకటి అలా మొత్తం తోట అంతా జీవంతో తొణికిసలాడుతూ, పాటల్తో పొంగి పొర్లేదాకా ఆ రవళి సాగేది.

''అక్కడ కిచకిచలాడేవా, బుజ్జి పిచికా! నీ సాయం లేకుండా పక్షులు లేవవా యేమిటి?''

అని అమ్మమ్మ అకులీనా బొంగురుగా అరిచేది.

కాని యెగోర్కకి అన్నిటికంటే రష్యన్ పండగలంటే యెక్కువ యిష్టం. అప్పుడు పాటలు పాడుతూ, వొకళ్ల చెయ్యి వొకళ్లు పట్టుకుని ఉల్లాసంగా వలయంగా తిరుగుతూ ఆడతారు. మువ్వలు కట్టిన గుర్రాలమీద స్వారీ చేస్తారు. ప్రతీ పండగ వొకో అద్భుత కథ లాగా వుంటుంది. ఇంద్ర మహేంద్రజాలంతో నిండి వుంటుంది. పండగ సరదాలనుంచి అతన్ని భూమ్మీద యేదీ పక్కకి మళ్లించలేదు.

మాటకి 'యెగోరి పండగ' తీసుకోండి. చప్పటి శీతాకాలం తర్వాత మొట్టమొదటి సారిగా పశువుల్ని బీళ్లలో మేపడానికి తోలుకెడతారు. పూర్వం రష్యాలో వొక యోధుడు వుండేవాడు. పాత రష్యాలో ప్రతి వాళ్లకీ గియోర్గి పేరున్న ఆ యోధుడు, రక్షకుడు తెలుసు. పల్లెజనం ఆయన్ని యెగోరి అని పిలిచేవాళ్లు. ఆయన రైతులకి సాయం చేస్తాడు. రైతుల తరవున అవసరమైతే తనే వేడికోళ్లు చేసేవాడు. పశువుల్ని కాపాడేవాడు. అందుకని వొక పండగని ఆయన పేరుమీద జరిపేవాళ్లు.

యెగోరి పండగకి ముందు రోజున అకులీనా అమ్మమ్మ కూడా వూళ్లో మిగతా అందరి ఆడవాళ్లల్లాగా చేసేది. ''శంకువు''లు అని పిలిచే చిన్న రొట్టెలు కాల్చేది. వాటికి ప్రతి దానికీ అవు వెంట్రుక వొకటి పెట్టేది.

మర్నాడు పొద్దున్నే యెగోర్క, వాళ్ల అమ్మమ్మా యిద్దరూ కొట్టంలోనుంచి ఆవునీ గుర్రాన్నీ బయటికి తోలుకెళ్లేవారు. మోదుగా వుండే పేం బెత్తంతో కాకుండా విల్లో రొబ్బలతో వాటిని తోలేవాళ్లు. కొట్టం దగ్గర నేలమీద నాన్న యినప తాళం పెట్టేవాడు. ఆవూ, గుర్రం దాన్ని తాకకుండా పైనుంచి నడిచి వెళ్లిపోవాలి. అప్పుడు మాత్రం తోడేలు దవళ్లకీ, ఎలుగుబంటి దవళ్లకీ గట్టిగా తాళం పడిపోతుందట.

తర్వాత మొత్తం వూరు వూరంతా కలిసి పొలాల్లోకి వెడుతుంది. జనం అందరూ ఉత్తరానికి, దక్షిణానికి, తూర్పుకి, పడమరకి వొంగి వొంగి ముప్పై సార్లు దణ్ణాలు పెడతారు. ''సాహసంగల మా యోధుడు గియోర్గి, నిప్పునుంచీ, నీరునుంచీ, దుష్టమృగముల బారినుంచీ, పాకి వచ్చే పాములనుంచీ, సకలమాయల కట్టునుంచీ మా పశువుల్ని కాపాడుగాక. మా ఆవుల అంబారవాల్నీ, మా గొర్రెల అరుపుల్నీ వినికిడి శక్తి బాగా వున్న దుష్టమృగం వినకుండుగాక. ఆ జంతువుకి మనిషి గొంతుక పేరు చెబితే భయం కలగాలి. దుష్టమృగం దూరంగా పోవుగాక'' అని ప్రార్థనలు చేస్తారు. అప్పుడు పశువులకి ''శంకువులు'' మేతవేసి గియోర్గికి మేలుకొలుపులు పాడి, ఉత్తేజ పరుస్తారు:



పెందలకడ లే యోధుడు గియోర్గి
నేలకి తాళం తియ్యి.
వెచ్చని వేసవికాలం కోసం
పుష్కలమైన పంటల కోసం
సకల జనుల సౌభాగ్యం కోసం
మంచు బిందువుల నందించు

ఆ రాత్రి యోధుడు గియోర్గి నిద్రపోడు. తన బంగారు తాళం చెవితో మంచు బిందువుల తాళం తీసి, వాటిని భూమ్మీదకి వదులుతాడు. అప్పుడు గరికకి తాళం తీసి దాన్ని పెరగనిస్తాడు. తన బంగారు కొమ్ము బూరా వూదుతాడు. అప్పుడు అడవులు పచ్చగా అవుతాయి.

యెగోర్కా నాన్న జీవనాధారం కోసం భూమి దున్నేవాడు. సంతృప్తి కోసం చర్చి గంటలు మోగించేవాడు. యెంత బాగా మోగించేవాడని! చెవికి యింపుగా వుండేటట్టు అయిదు గంటలమీద మోగించేవాడు. స్వర మాధుర్యం ఆనందంతో పులకరింపజేసేది. మాస్కోలో వున్న గొప్ప శిఖరఘంటని మోగించేందుకు అతన్ని తీసుకెడదామని చూశారు. బోలెడు సొమ్ము యిస్తామని ఆశపెట్టేరు. కాని ఆయన వెళ్లనన్నాడు. ''యీ నా సొంత వూరే నాకీ విద్యని నేర్పింది. నేను మా వూరి కోసమే గంటలు మోగిస్తాను'' అన్నాడాయన.

యెగోర్కాకి యెంతో యిష్టమైన సమయం సాయంత్రం పూటలు. రోజంతా కష్టపడి పనిచేశాక కుటుంబం అంతా యింట్లో కూడేవాళ్లు.

మసక వెలుతురు కాగడా మెల్లిగా టపటపలాడేది. జిగురు పొగ సుళ్లు తిరుగుతూ దంతెల వేపు లేచింది. వింత నీడలు గోడలమీద నాట్యం చేశేవి. పొయ్యి దగ్గర అకులీనా అమ్మమ్మ యినప పెనంమీద చుంయ్‌మనిపించింది. కొంచెం కొంచెంగా యిల్లంతా తాజా రొట్టె వాసనా, కాచిన పాల వాసనా కమ్మేయి. బొద్దుగా వుండే పిల్లి తెరేంతీ చుంచుల సంగతే మర్చిపోయి గదిలో పరుగులు తీసింది, దాని మీసాలమీద బూజుతో. కీచుమని పించేటట్టు మ్యావ్ మ్యావ్ మ్యావ్ అని అరుస్తూనే తిరిగింది.

నాన్న కుటుంబం కోసం నారతో భేషైన చెప్పులు అల్లుతూ వుండేవాడు. అమ్మ నూలుచుడుతూ వుండేంది. అప్పుడు యెగోర్కా చడీ చప్పుడూ కాకుండా ఆమె వెనక చేరేవాడు. అతనికి వెచ్చగా వుండేది. ఆమె కథలు చెపుతూ వుంటే వింటూ మైమరచిపోయి

చీకటి కిటికీలోనుంచి అలా బయటకు చూస్తూ వుండిపోయేవాడు.

''అనగా అనగా వొక అద్భుత దేశం వుండేది. అది సప్త సముద్రాలకీ అవతల, సప్త కుల పర్వతాలకీ అవతల నేల నింగి కలిసే చోట వుండేది. అది యెంతో విశాలమైంది. యేడాదిపాటు గుర్రంమీద స్వారీ చేసుకుంటూ వెళ్లినా దాన్ని చుట్టిరాలేం. అక్కడ వుండే మనుషులు మూడు కాళ్లున్న మహా కాయులు. వాళ్లకి నాలుగు చేతులుండేవి. వాళ్లకి కళ్లూ, నోరూ ఛాతీమీద వుండేవి. అక్కడ దొంగలుగాని, దారికాసి దోచుకొనే వాళ్లుగాని, అసూయా గ్రస్తులుగాని లేరు. యేమంటే అక్కడి ఐశ్వర్యానికి అంతు లేదు. అక్కడ నేలకింద ఒక చక్కని నది పారుతోంది. యేడాదికి వొకసారి నది పైన వున్న నేల తెరుచుకుంటుంది. అది మళ్లీ మూసుకుపోయేలోగా యెవరు అందులోకి దూకినా, యేది చేతికి అందితే దాన్ని నీటిలోనుంచి తీసుకుంటారు, పైకి తీసుకు వస్తారు. అక్కడ వున్న రాళ్లు విలువైన వజ్రాలు, అక్కడి యిసక పెద్ద పెద్ద ముత్యాలు.

''ఆ రాజ్యంలో నానా రకాల పక్షులు జంతువులు వున్నాయి. కోడిపుంజులున్నాయి, మనిషి యెక్కి స్వారీ చేసేటంత పెద్దవి. ఫీనిక్స్ పక్షి ఉంది. అమావాస్యనాడు ఫీనిక్స్ పదిహేను ఓక్ చెట్లమీద తన గూడు కట్టుకుంటుంది. ఆకాశంలోనుంచి నిప్పు తెచ్చుకుం టుంది. తన గూడు అంటించుకుంటుంది. దానితోబాటు తనూ కాలిపోతుంది. కాలిన బూడిదలోనుంచి వో పురుగు పుడుతుంది. దానికి యీకలు వస్తాయి. అది మళ్లీ ఫీనిక్స్ అవుతుంది. అది అయిదు వందల యేళ్ళు బతుకుతుంది.''

యెగోర్కా కళ్లముందు చెక్కల గది చీకటి గోడలు మెల్లిగా అదృశ్యం అయిపోయాయి. అతను యెక్కడికో వెళ్లిపోయాడు. ఆ సుదూర రాజ్యం వెచ్చని, యెర్రని యిసక తిన్నె మీద పడుకున్నాడు. తలపైన ఎరుపు, తెలుపు రంగు పెద్ద పువ్వులు తేలుతున్నాయి. అవి గంట లంతేసి వున్నాయి. ఒక దానిమీద సీరిన్ పక్షి కూచుటుంది. దాని రెక్కలు మిలమిల మెరుస్తూ వుంటాయి. యేదో మెల్లిగా మధురంగా పాడుతూ వుంటుంది. దాని ముఖం అమ్మకి లాంటిది...

వేసవికాలం యెక్కువ రోజులు జరిగిపోయాయి. పంటలు పక్వానికి వొచ్చేయి. ఒక రోజున సూర్యోదయం వేళ యెగోర్కా పచ్చిక బీటిమీదనుంచి పరిగెత్తుకుంటూ వచ్చేడు. మనిషి ముఖంలో కత్తి వేటుకి నెత్తురు చుక్క లేదు. వొణికి పోతున్నాడు.

''లే, లే, నాన్నా! ఆపద ముంచుకొస్తోంది!'' అని అరిచాడు.

''యేమిటి యేమిటి యెగోర్కా? గుర్రాన్ని యెత్తుకుపోయారా?''

"శత్రువులు గుర్రాలమీద వస్తున్నారు! అప్పుడే యిక్కడికి వొచ్చేశారు."

ఆ మాట వినగానే గంట మోగించే అతని తండ్రి వున్న పళంగా ఆ చొక్కాయేనా మార్చుకోకుండా ఘంటా శిఖరం దగ్గరికి హడావుడిగా పరుగెత్తుతూ వెళ్లాడు. హెచ్చరికగా గంట మోగించాలని వెళ్లాడు. అకులీనా అమ్మమ్మ, తనూ, అమ్మా నేలమాళిగలో దాంకోవాలని గబగబా చెప్పగలిగేడంతే యెగోర్కాకి.

పిట్టలాగా ఘంటా శిఖరం పైకి యెగిరిపోయాడు. కాని అయ్యో దేవుడా! పాపిష్టి శత్రువులు అప్పుడే దగ్గరికి వొచ్చేశారు. గుర్రాల గిట్టలకింద భూమి దద్దరిల్లుతూ వుంటే, నల్లని మేఘంలా దౌడుతీసుకుంటూ వొచ్చేసేరు. గంట మోగించే వాళ్ల నాన్న బాగా పెద్దగా వున్న గంట తాడు లాగేడు. త్వరపడండి, జనులారా! ఆపద ముంచుకొస్తోంది అనే హెచ్చరిక నాదం చేసిందది.

కాని అప్పటికే మించిపోయింది.

ఆ గుర్రపు రౌతులు సుడిగాలిలా వూళ్లోకి దూసుకు వచ్చేసేరు. దాంకునే వ్యవధి లేక బయట వుండిపోయిన వాళ్లందరూ ఆ దుర్మార్గుల చేతిలో హతం అయిపోయారు. లేదా వాళ్ల పొగరుమోతు గుర్రాల కాళ్లకింద పడి నలిగిపోయారు.

యెగోర్కా తల్లి యిక వుండ బట్టలేక పోయింది. తన భర్త యెక్కడున్నాడో చూద్దామని యెగోర్కాతో కలిసి బయటికి పరిగెత్తింది. ఘంటా శిఖరం దగ్గరికి శత్రు సైనికు డొకడు వికటంగా నవ్వుతూ దౌడు తీసుకు వొచ్చేడు. ఆమె యెగోర్కాని పొదల మాటుకి విసిరేసి, శత్రువు ముందు నుంచుందో లేదో యింకా! ఆ పశువు పట్టాకత్తితో ఆమెని కొట్టేడు. ఆ దుండగీళ్ల మూక యీలలు వేసుకుంటూ, అరుచుకుంటూ జూలు బారుగా వున్న గుర్రాల పైన దౌడు తీసుకుని పచ్చిక బీళ్లమీదకి వెళ్లేదాకా యెగోర్కా యివతలకి రాలేదు. అతను భయంతో నిశ్చేష్టుడైపోయాడు. ఆ తర్వాత వీథుల్లోకి వచ్చేడు. రక్తసిక్తమైన శవాలు గుట్టలుగా పడివున్నాయి. యిళ్లన్నీ దగ్ధమైపోతున్నాయి. వాటిని దాటుకుంటూ యెగోర్కా ఘంటా శిఖరం దగ్గరికి వెళ్లేడు. అక్కడ తండ్రి శవం నేలమీద పడివుంది. ఉక్కు మొన బాణం ఆయన కంఠంలో లోతుగా దిగబడి వుంది.

యెగోర్కా ఆ రకంగా అనాథ అయిపోయాడు...

అప్పట్లో రష్యాలో యెంతమంది అనాథలు అయారు! యెంతమంది మంచివాళ్లు నాశనం అయారు! భూమి రక్తంలో మునిగిపోలేదేం? నల్లని పొగలో భూమి ఉక్కిరి బిక్కిరి అయిపోలేదేం?



యిక వూరు పేరు చెప్పి మిగిలినదల్లా పొగగొట్టాలతో కొన్ని పెద్ద పొయ్యిలు మాత్రమే. మిగిలినదంతా బూడిదైపోయింది. పొయ్యిలు నల్లగా పొగచూరిపోయాయి. వాటి పొగగొట్టాలు సన్నటి మెళ్లలా పైకి వుండేవి. రాత్రిళ్లప్పుడు గాలిలో భూతాల మాదిరీ రోదిస్తూ వుండేవి. అది వింటే రక్తం గడ్డకట్టిపోతుంది.

బతికి బట్టకట్టిన కొద్దిమంది మగాళ్లూ మిగిలిన దుంగల్ని పోగుచేశారు. వాటితో కొత్త యిళ్లు కట్టేరు. ఆ దుంగలు మంటలకి మసిబారిపోయాయి. అంచేత వాటితో కట్టిన యిళ్లు నల్లని కాకుల్లా వుండేవి. ఆ వూరికి పేరు మారిపోయింది. నల్లని ఇళ్ల ఆయ కట్టు పర్రు అయింది. హోసం నదికి దుఃఖ నదిగా పేరు వచ్చింది.

యెగోర్కకి దుఃఖభాజకంగా, అనాధగా వుండే రోజులు మొదలయాయి. ఆ కుర్రాడు తల్లిదండ్రుల కోసం యేడ్చి యేడ్చి అకాలంగానే పెద్దవాడైయ్యాడు. యెప్పుడూ ముభావంగా, చింతాక్రాంతంగా వుండేవాడు. యింట్లో వెచ్చగా వుండడానికి యిటికలతో కట్టిన యెత్తైన పొయ్యిలు వుండేవి. పొయ్యిలపైన తినెల్లాంటి వాటిని కట్టేవాళ్లు. పొయ్యిపైన తినెమీద కూర్చుని రాత్రిళ్లప్పుడు యేడ్చేవాడు. అకులీనా అమ్మమ్మ చచ్చిపోదామనుకుంది. కాని యిప్పుడు బతుకుదామనుకొంది. అలాంటి పరిస్థితిలో మనవణ్ణి యెలా వదిలిపెట్టి పోగలదు?

ఆ శీతకట్టు ఘోరంగా వుంది. యేమీ దొరకలేదు. పండిన పంటనంతట్నీ ఆ దుష్టులు తగలబెట్టేశారు కదా. తిండానికి యేమీ లేదు. చెట్టు బెరళ్లు, వూరేసిన పాత కాబేజీ మిగిలాయి. ప్రాణాలు నిలబెట్టుకోవడం దుర్ఘటంగా వుంది.

యెగోర్కకీ, అమ్మమ్మకీ కొంచెం వూరట మిగిలింది. ఆ దుష్టుల దాడినుంచి, మరి యే మహిమవల్లనో యేమో, చిన్న తెల్ల కోడిపెట్ట తప్పించుకు బయటపడింది. అది సన్నగా పుల్లలా వుంది. అయినాగానీ చలాకీగా వుంది. ఒకో అప్పుడు గుడ్డు పెట్టేది. ఆకలిగా వున్నాగానీ తినకుండా అకులీనా అమ్మమ్మ ఆ విలువైన గుడ్లని ఈస్టర్ వసంతరుతు పండగ కోసం దాచి పెట్టింది.

''రా, రా బాబూ! ఈ గుడ్లకి రంగులు వేసి జనానికి ఈస్టర్ పండగ కానుకలుగా యిద్దాం. వాళ్లకి ఉత్సాహం వస్తుంది'' అందామె.

''రంగులేవీ వెయ్యడానికి?''

''యేముంది యెప్పటిలాగానే ఉల్లిపాయ తొక్కనో లేకపోతే ఓక్ చెట్టు బెరడునో ఉడకబెట్టి గుడ్లకి జేగురు రంగు వేద్దాం.''

''జేగురు రంగు గుడ్లు యిస్తే జనానికి ఉత్సాహం రాదు అమ్మమ్మా. వేరే వేరే రంగులు బోలెడు వేద్దాం.''

''యెలా?''

''చర్చి పెద్దాయన దాచ మన్చెప్పి నాన్నకి కొన్ని రంగులు యిచ్చేడు, గుర్తుందా? వాటితో వెయ్యనా?''

''అలాగే కానీ.''

ఆవిడ మహా సంతోష పడిపోయింది. హమ్మయ్య! యిన్నాళ్లకి మనవడు యేడుపు మొహం పోయి హుషారుగా తయారయాడు.

యెగోర్కా నేలమాళిగలోకి వెళ్లాడు. అక్కడ మంటల్లో దగ్ధం అయిపోకుండా వాళ్ల వస్తువులు కొన్ని మిగిలాయి. అక్కడ వున్న కొయ్య పెట్టెని తీశాడు. రంగులు పొడి గుండలుగా చిన్న చిన్న సంచీల్లో కట్టి వున్నాయి. గుండలతో రంగు వెయ్యడం యెలాగ?

''బొమ్మలకి రంగులు వేసే వాడొకసారి యిలాంటి గుండల్ని గుడ్ల పచ్చసొనతో కలపడం చూశాన్నా అబ్బాయి, అలా చేసి చూడకూడదూ?'' అంది అమ్మమ్మ.

అతను అలానే చేశాడు. కోడిగుడ్డు పచ్చసొనతో ఆ గుండలని కలిపాడు. యెంతలా మెరిసిపోయే రంగులు వచ్చాయని!

''యెలా మొదలుపెట్టాలో భయంగా వుంది అమ్మమ్మా.''

''మరేం భయం లేదు బాబూ. నీ కళ్లకి బెదురుగా వున్నా నీ చేతులు ఆ పని చేస్తాయి.''



వెచ్చగా తెల్లగా వున్న గుడ్డుని అతను తీశాడు. దానిమీద యే రంగు వెయ్యాలా అను కున్నాడు. నాన్న చొక్కామీద అమ్మ కుట్టిన పువ్వులు గుర్తువొచ్చేయి. జాగ్రత్తగా అలాంటి పువ్వు గీశాడు. తర్వాత మరో పువ్వుని గీశాడు. వాటి చుట్టూతా పచ్చటి ఆకులని గీశాడు. కోడిగుడ్డు ఇంద్రధనుస్సులా మెరిసింది. బద్దీల గౌను సరఫాన్ తొడుక్కుని ఉల్లాస భరితంగా వున్న కన్నెపిల్లలా వుందది అతని చేతిలో.

మరో గుడ్డు తీశాడు. అద్భుతమైన తోక యీకలున్న యెర్రటి పుంజుల బొమ్మలు వేశాడు. అవి అచ్చు నిజం వాటిలాగానే వున్నాయి. మూడో గుడ్డు మంత్ర వృక్షాలతో, చలాకీగా గెంతే గుర్రాలతో వింతగా కనిపించే ప్రాణులతో సజీవంగా తయారైంది.

''అసలు నేను వూహించనే లేదే! యిన్నెప్పుడు నేర్చుకున్నావురా?'' అంది అమ్మమ్మ.

తండ్రి మోగించిన వెండి గంట నాదంలో, తల్లి చెప్పిన అద్భుత కథల్లో అతను సౌందర్యామృతాన్ని తాగేడు. ఆ సౌందర్యం యిప్పుడు మేల్కొంది.

శీతకట్టు యెముకలు కొరికేసింది. అయినా వసంతరుతువు పందెంలో నెగ్గింది. శీతకట్టుని యేడిపించింది. దాని కన్నీళ్లు పిల్ల సెలయేళ్లయి ఆరిన నేలని అభిషేకం చేశాయి. భూమాత నిట్టూర్చి వెచ్చని ఆవిర్లని వూపిరి పీల్చింది. వసంతం వచ్చింది. దాంతోబాటు వసంత పర్వదినం ఈస్టర్ పండగ వచ్చింది.

పూర్వం రోజుల్లో అకులీనా అమ్మమ్మ ఈస్టర్ కేకుల్ని యెండు ద్రాక్షపళ్లు పెట్టి తయారు చేసేది. అవి పొడుగ్గా పుట్టగొడుగుల్లా వుండేవి. వాటిపైన ఘుమ ఘుమలాడే పిండితో చక్కెర పూత పెట్టేది. అది మంచులాగా వుండేది. కేకు గనక విరక్కుండా కాలితే కుటుంబంలో అంతా బాగుంటారట. ఖర్మకాలి అది పొంగక పోయినా, వంకర తిరిగినా — అదృష్టం బాగుండి అలా జరగకూడదనుకోండి — ప్చ్, దుశ్శకునం.

''పెద్దావిడా, యెందుకు శ్రమపడి ఈస్టర్ కేకులకి షోకు చేస్తావ్? యెలా వున్నా గొంతుక దిగగానే వాతాపి జీర్ణమే కదా?'' అని పొరుగాయన వృద్ధ అఫనాసీ అనేవాడు.

''పెద్దాయనా, నీ కడుపుకి యెలా వున్నా ఫర్వాలేదేమోగాని నాకు మట్టుకు అలా కాదు. నా పొట్టకి యెప్పుడూ శాపమే మిగిలింది. అంచేత దాన్ని కూడా అందం రుచి చూడనీ'' అనేదావిడ.

కాని యీ యేడాది ఈస్టర్ కేకుల్ని చెయ్యడానికి యేమీ లేవు.

పొద్దుట అమ్మమ్మ తనకున్న మంచి రుమాలు తలకి కట్టుకుంది. రంగులు వేసిన గుడ్లని తెల్లని గుడ్డలో మూటకట్టింది. యెగోర్కాకి తల దువ్వింది. యిరుగుపొరుగు వాళ్లకి పండగ శుభాకాంక్షలు చెప్పడానికి యిద్దరూ బయల్దేరి వెళ్లారు.

మొదట అఫనాసీ తాత దగ్గరికి వెళ్లారు. ఆయన తన మనవరాలు మాషతో కలిసి వుంటున్నాడు. ఆ పిల్లకి్కాడా తల్లీ తండ్రీ లేరు. ఆ దాడి జరిగిన భయంకరమైన రోజు ఉదయాన్న ఆ దుండగీళ్లు మాష తల్లి మెళ్లో ఉచ్చు వేసి పచ్చిక బీళ్లమీదకంటా యీడ్చుకుపోయారు. ఆమెని రక్షిద్దామని మాష నాన్న గడ్డపలుగు తీసుకుని వాళ్ల వెంట బడ్డాడు. ఆ దుష్టుల్ని ఆరుగుర్ని పొడిచి చంపేశాడు. కాని వాళ్లేమో మందలాగా

వున్నారాయిరి. తను ఒక్కడు. యేం చెయ్యగలడు? వాళ్ళు అతన్ని బల్లేలతో పైకి యెత్తారు...

యెగోర్కా, అతని అమ్మమ్మ ఆచారం ప్రకారం ఆ పెద్దాయన్నీ మాషనీ మూడు సార్లు ముద్దుపెట్టుకున్నారు. రంగులు వేసిన గుడ్లని వాళ్లకి యిచ్చారు: ముసలాయన ఆశ్చర్యపోయాడు.

''బాప్‌రే! అకులీనా, యెంత అందంగా చేశావ్!''

''నేను కాదు. మా మనవడు చేశాడు.''

''యింత కుర్రాడు, వీడెలా చెయ్యగలిగాడు?''

యెగోర్కా యెర్ర పుంజుల బొమ్మలు గీసిన గుడ్డు మాషకి యిచ్చాడు. ఆ పిల్ల యెర్ర గులాబీలా సిగ్గుతో యెర్రబడింది. తత్తరపడి పొయ్యిగూడు వెనక్కి వెళ్లి పోయింది.

అమ్మమ్మ, మనవడు వెళ్లిన చోటల్లా నవ్వులు, కేరింతాలు హాస్యాలూనూ. ఒక్కరోజు మాత్రమే అయితేనేం, జనం తమ దుఃఖం మర్చిపోయేటట్టు చేశాడు యెగోర్కా.




వసంతరుతువు వచ్చింది. కాని యెగోర్కాకీ, వాళ్ల అమ్మమ్మకీ బతుకు సాఫీగా లేదు. ఆ దుండగీళ్ళు వాళ్ల గుర్రాన్నీ, ఆవునీ తీసుకుపోయారు. అంచేత వాళ్లకి పొలం దున్నుకోవడానికి లేదు, తాగడానికి పాలు లేవు.

యెగోర్కా పుల్లలా అయిపోయాడు. అతన్ని పశువుల్ని మేపడానికి పెట్టుకోవాలని వూళ్ళో వాళ్ళు అనుకున్నారు. ఆ కాస్త పని వుండబట్టే అతను మనిషి మిగిలాడు.

వూళ్ళో వున్న పశువులనన్నిట్నీ పోగుచేశారు. ఓ ఆడ గుర్రం, దాని దూడ, రెండు మేకలు, ఒక ఆవు.

తూర్పు తెలతెలవారుతూనే యెగోర్కా పెరళ్లలోకి వెళ్లి తన మందని పోగు చేసుకునేవాడు. అప్పటికి నేలమీద యింకా పొగమంచు అలుముకునే వుండేది. అతను తన మందని పచ్చిక బీళ్లమీదకి తోలుకుపోయేవాడు. ఓ కొరడా పేనేవాడు. ఆచారం ప్రకారం మరి అలా పేనాలి కదా. యేం, కుక్కకి బదులుగా పిల్లి తెరేంతీ అతని వెనకాల వెళ్లేది. తెరేంతీ అచ్చం కుక్కలాగా తన తోకని పెట్టుకునేది. పాపం ఒక్కటే లోటు, అది మొరగలేదు!



అగ్ని ప్రమాదం తర్వాత అది చాలా కాలం అదృశ్యం అయిపోయింది. మళ్లీ యెలా వచ్చిందో వో రోజున వూడిపడింది. దాని చర్మంమీద బొచ్చు అక్కడక్కడ కాలిపోయింది. దాని మీసాలు మొత్తం కాలిపోయాయి.

ఓ రోజున యెగోర్కా, అతని నానారకాల మందతోనూ, దుఃఖ నది వొడ్డుకి వెళ్లాడు. కొత్తగా మొలుస్తూ వున్న గడ్డిని ఆవూ, మేకలూ మేస్తున్నాయి. గుర్రం, దాని కూన నది లోపలికి వెళ్లి నీళ్లు తాగుతున్నాయి. గుర్రం కూన తల్లికి అంటిపెట్టుకుపోయింది. చిన్న పిల్లలు తల్లులకి అంటిపెట్టుకుపోరూ? అలాగ. తల్లి ముట్టెతో కూన వీపు నాకింది భయపడకమ్మా అన్నట్టు. నదిమీద తెల్లని పొగమంచు తేలుతోంది. మధ్య మధ్య మంచు తెర తొలగినప్పుడు వో తోకో లేకపోతే రెండు తలలున్న గుర్రమో కనిపించేది. ఓ తల పెద్దదీ, ఓ తల చిన్నదీనీ.

యెగోర్కా వాటిని చాలా సేపు పరిశీలనగా చూశాడు. తెలియకుండానే నిద్రపోయాడు. వున్నట్టుండి అతనికి వో యిరుకు పడవ చప్పుడు చెయ్యకుండా పొగమంచుగుండా రావడం కనిపించింది. ఆ పడవ పక్క భాగాలమీద లతలు చెక్కి వున్నాయి. దాని ముందు కోసుగా వున్న భాగంమీద రెండు గుర్రం తలలున్నాయి. మధ్య వొకామె నుంచుని వుంది. ఆమె సరఫాన్ తొడుక్కుంది. అది పొడుగ్గా తెల్లగా వుంది. ఆమె విచారంగా చిరునవ్వు నవ్వుతోంది.

యెగోర్కా అదేపనిగా చూశాడు. కాని యేమిటైందీ చూడలేకపోయాడు. పొగమంచు ఆమెని కమ్మేస్తోంది.

ఆ తర్వాత పడవ మెల్లిగా వెళ్లి పోతూ వుంది. ఆకాశంలో తేలిపోయే పక్షి యీకలాగా వెళ్లిపోతోంది. హఠాత్తుగా ఆమె అతనికేసి చూసింది.

''నేను గుర్తున్నానా, బాబూ?'' అని చాలా శాంతంగా అడిగింది.

యెగోర్కా ఒక్క పెట్టున అరిచి, తటక్కున లేచి నుంచున్నాడు. ఆ పడవ చెదిరి పారిపోయింది. యిప్పుడది పడవ కాదు. తెల్లటి హంస. రెక్కలు గట్టిగా కొట్టుకుంది. పొగమంచులో మాయమైపోయింది.

యెగోర్కాకి మెలుకువ వచ్చింది. అతని ముఖం కన్నీళ్లతో తడిసిపోయింది. ''అమ్మా నిజంగా నువ్వేనా'' అని గొణిగాడు.

చాలా రోజులు యెగోర్కా ఆ కల స్మృతిలో గడిపాడు. గట్టిగా వుండే బర్చ్ కొయ్యని తీసుకుని ముందు భాగంమీద రెండు గుర్రం తలలున్న మాయా పడవని దొలిచాడు. మధ్య

భాగం దొలిచాక పీచు తీసుకుని దానికి నగిషీ పెట్టాడు. అది తళతళ మెరిసింది. దాన్ని తయారు చేసిన తర్వాత అతను అకులీనా అమ్మమ్మకి తన కల గురించి చెప్పాడు. ఆ పడవని బల్లమీద పెట్టాడు. అమ్మమ్మ దాన్ని జాగ్రత్తగా యెత్తి నిమిరింది.

''మంచి దోనెలాంటి గరిటెని చేశావురా యెగోర్కా. దీంతో నువ్వెప్పుడు తాగినా నీకు మీ అమ్మ గుర్తుకొస్తుంది'' అని చెప్పింది.

ఆ రాత్రి యెగోర్కా చాలాసేపు పడక బల్లమీద యిటు తిరిగాడు. అటు తిరిగాడు. పొర్లేడు. ''తమ కిష్టమైన వాళ్లని ప్రమాదంలో పోగొట్టుకున్న ప్రతి వాళ్ల కోసం. అలాంటి దోనెలాంటి గరిటని చెయ్యడం బాగోదూ?'' అనుకున్నాడు.

అతను అలా చేశాడు. వేసవికాలం అంతా కొయ్య దొలిచి నగిషీ చెక్కాడు.

తమవాళ్లని గుర్తుచేసుకుందుకు వూళ్లోవాళ్లు కూడారు. అందరూ కలిసి బీరు తయారు చేసుకున్నారు. అది ఆచారం. అప్పుడు యెగోర్కా తలా ఒక్కరికీ వొకో దోనెలాంటి గరిటెని యిచ్చేడు. మగవాళ్లు దాన్ని మెచ్చుకున్నారు. చక్కని పనివాడితనం వుందని పొగిడేరు. ఆడవాళ్లు ఆ కానుకల్ని గుండెల కద్దుకుని వెక్కారు. వాళ్లు అతని చక్కని జుట్టుని ముద్దుపెట్టుకున్నారు. యీ నిపుణుడైన పనివాడు అదోలా సిగ్గుపడి పోయాడు.



యెగోర్కా యిప్పుడు దిగులుగా లేడు. ఉత్సాహం వచ్చింది. తను సమయాన్ని నలుగురికి ఉపయోగకరంగా వుండేటట్టు గడుపుతున్నాడు. కొయ్య దొలిచి తెడ్డుల్ని తయారు చెయ్యడం నేర్చుకున్నాడు. చిన్న పిల్లల కోసం చిన్నవి. వాటికి మెలి తిరిగిన కాడలు వుంటాయి. ఉల్లాసం కలిగించే రంగులు పూస్తాడు. మగాళ్లకి ఎలుగుబొమ్మ నగిషీచెక్కిన పెద్దవి. యిల్లాళ్లకి పెద్ద కాడలున్న గరిటెలు తయారుచేశాడు. వాటిమీద హుషారుగా వుండే నగిషీలు వుంటాయి. యిక ఉప్పు దోనెలున్నాయి. గొప్పగా దొలిచి చేసినవి. వాటికి మరమూత కూడా వుంటుంది. అవి మొత్తం కుటుంబానికి పనికొస్తాయి. రష్యాలో ఉప్పు వొక గొప్ప స్థానం ఆక్రమించింది. ఉప్పు దోనెకి భోజనాల బల్లమీద గౌరవప్రదమైన స్థానం యెప్పుడూ యిచ్చేవారు.

పక్క వూళ్లలో జనం యెగోర్కా పేరు విన్నారు. అతని గరిటెల కోసం, చెంచాల కోసం, ఉప్పు దోనెల కోసం అతని దగ్గరకి వెళ్లేరు.

అతను డబ్బేమీ పుచ్చుకొనేవాడు కాదు. వూరికే యిచ్చేసేవాడంతే. ఒకసారి పొరుగూరి ముసలాయనొకడికి అతనిమీద కోపం వచ్చింది.

''నేను తేనె యిస్తే వద్దంటావేం? నీ గరిట్లని నీ కోసమే తయారు చేసుకున్నావా? లేదు కదా? అలాగే నేనూ నా తేనె గూళ్లని నా కోసం పెట్టుకుంటానా? తేనెటీగల్ని చూడు. ఒకటేమో పువ్వుల్ని చూస్తుంది, యింకోటి దానిలోని మధువుని తీస్తుంది. మరోటి తేనె తుట్టెని పెడుతుంది. నాల్గోది తేనెగూడుని శుభ్రం చేస్తుంది. అవన్నీ వొకదాని కోసం యింకోటి పనిచేస్తాయి. మనుషులు కూడా అలానే చెయ్యాలి.''

ఒక్కొక్క యేడూ గడిచే కొద్దీ యెగోర్క దగ్గరకి యింకా యింకా యెక్కువ జనం వచ్చేవాళ్లు. యిప్పుడు వాళ్లు యెగోర్క యిచ్చిన వాటిని తీసుకోవడమే కాదు, ఫలానా ఫలానా కావాలి అని పురమాయించి చేయించుకునేవాళ్లు. ఒకళ్లేమో అప్పచ్చులు పెట్టుకోవడానికి చక్కని ప్లేటు కావాలని అడిగేవాళ్లు. యింకొకళ్లు చెట్లవేళ్లతో చేసిన పెద్ద బాల్చీ కావాలనే వాళ్లు. మరొకళ్లు ఆడపిల్ల కట్నం కానుకల కోసం చిన్న చందుకం పెట్టెలు కావాలనే వాళ్లు.

ఒకో అప్పుడు యింటినిండా యెంతమంది కాతాదార్లు వుండేవారో! కప్పుబద్దలై పోతుందా అన్నట్టు పిటపిటలాడిపోతూ వుండేది యిల్లు.

''యింకో పెద్ద యిల్లు కట్టుకోవాలేమో నేను అమ్మమ్మా'' అన్నాడు యెగోర్క వొక రోజున.

''కట్టాలి, బతికుంటే మీ నాయనా కట్టేవాడు.''

యెగోర్క బలమైన పైన్ దుంగల్ని యేరుకొచ్చాడు. అలా అయితే యిల్లు వెచ్చగా వుంటుంది. యిల్లు శీతాకాలం కోసం కట్టుకుంటారు, వేసవికాలం కోసం కాదు, కదా? వో చిన్న దిబ్బమీద చక్కని జాగా చూశాడు. పని మొదలు పెడదామనుకునే వేళకి ఆగమని వాళ్లమ్మమ్మ కేకవేసింది.

''నాలుగు గోతులు తవ్వు. నాలుగు మూలలా. దుష్ట గ్రహాలేం లేకుండా చూసుకోవాలి'' అందామె.

యెగోర్కకి ఆశ్చర్యం కలిగింది. కాని ఆవిడ చెప్పినట్టే చేశాడు. అప్పుడు అకులీనా అమ్మమ్మ వొకో గోతిలోనూ వొకో కొయ్య కూజాతో నీళ్లు పెట్టింది. దాన్ని రొట్టె పెచ్చుతో మూసింది. తెల్లవారేక చూశారు. ఒక్క కూజా కూడా బోర్లా పడలేదు. అంటే అక్కడ దుష్ట శక్తులు లేవన్నమాట. యిక వాళ్లు యిల్లు కట్టుకోవచ్చు.



యెగోర్కా వొక్కడూ కట్టగలిగేవాడా? సగం వూరు అతనికి సాయం వచ్చింది. గొడ్డళ్లు ఖంగుమని మోగాయి. పేడు ముక్కలు హుషారుగా యెగిరాయి. ఘాటైన జిగురు వాసన వేసింది. కళ్ల ముందే యిల్లు లేచింది. ముసలి అఫనాసీ తన యింటి ముందర బయట బల్లమీద కూచున్నాడు. అకులీనా అమ్మమ్మని సరదాగా యేడిపించాడు.

''పాటలు పాడి నీ గూడు కట్టుకో. శవపేటికకి ఆరు చెక్కలు జాగ్రత్త చేసుకో.''

''నువ్వు చావబోతూ వుంటే నువ్వు జాగ్రత్త చేసుకో. యిల్లు కట్టుకోవడంకంటే మహా సులభం అది. పడుకో వూరికే, ఆవులించి కాళ్లు చాపు.''

ఆఖరి వరస దుంగలు పేర్చి, దంతెల్ని అమర్చారు. యెగోర్కా గుర్రం తల చెక్కి కప్పుపైన చిటారు కొసన అతికించాడు. అది ఆచారం.

తర్వాత అమ్మమ్మ పిల్లి తెరేంతీని కొత్త యింటి లోపలికి వదిలింది. దుష్టశక్తు లేమన్నా ప్రవేశించాయేమోనని అది చూడాలన్నమాట. పిల్లి వాటి వాసన పట్టేస్తుంది. ఒకవేళ యేదన్నా వున్నట్టు వాసన పడితే గాలిలో పంజాతో కొడుతుంది. తెరేంతీ దర్జాగా లోపలికి నడిచివెళ్లింది. అన్నిట్నీ సమూలంగా పరిశీలించింది. అన్ని మూలల్లోనూ వాసన చూసింది. దానికి యేమీ కనిపించలేదు. రంపం పొట్టుమీద పడి దొర్లింది. యిప్పుడు గృహప్రవేశం చెయ్యచ్చు.

ఒక సంవత్సరం అంతా యిక అప్పట్నుంచి యెగోర్కా యింటి ప్రతి కొయ్య పలకనీ నగిషీ చెక్కుతూనే వున్నాడు. తీర్చి దిద్దుతూనే వున్నాడు. యెంతో అందంగా అలా చేశాడు. ఆఖరికి సాదా కొయ్య దుంగల యిల్లులా కాకుండా అది అద్భుత కథల్లోని మందిరంలా తయారయింది. కిటికీలపైన నగిషీ చెక్కిన నెమళ్లు వచ్చాయి. కిటికీపైన పలకకి పెద్ద తోకలున్న మత్స్యకన్యల బొమ్మలు వచ్చాయి. అవి యింటికి ఆనందం ప్రసాదిస్తాయి. ముఖ్య దూలం కింద రెండు చిరునవ్వు నవ్వే సింహాలు వచ్చాయి. అక్కడ అతిథులకి మర్యాదలు జరుగుతాయని దూరంనుంచే కనిపిస్తుంది.

నిజంగానే అక్కడ ముందటికంటే అతిథులు యెక్కువయారు. కొంతమంది కొత్త యింటిని కడుతున్నారు. కొంతమంది అప్పడే వో కొత్త యింటిని కట్టేరు. దానికి అలంకారం కావాలి. కొంతమంది యెగోరి దగ్గర చెక్కడం పని నేర్చుకున్నారు. యిప్పుడు అతన్ని యెగోరి అని మర్యాదగా పిలుస్తున్నారు.

నల్ల ఇళ్ల ఆయకట్టు ప్వ్రరు అనే పేరు బదులుగా మళ్లీ ఆ వూరిని ఇళ్ల ఆయకట్టు ప్వ్రరు అని పిలవడం ప్రారంభించారు.

మొట్టమొదటగా నిద్రలేచేది బుజ్జి కోడిపుంజు. తెల్లవారిందని మేలుకొలపడం దాని పని. అది మూడు సార్లు కూయాల్సి వుంది. మొదటి సారి గొంతుక సవరించుకోవడానికి. రెండవ సారి జనాలని నిద్రలేపడానికి. మూడవ సారి పక్కలమీదనుంచి వాళ్లు యివతల పడ్డానికి.



యెగోరి మొదటి కూతకే లేచేవాడు. తుషారంలో ముఖం కాళ్లూ చేతులూ కడుక్కోవడానికి పచ్చికబీటిమీదకి వెళ్లేవాడు.

యివాళ సూర్యుడు యింత అద్భుతంగా వున్నాడేం? ఇంద్రధనుస్సులోని అన్ని రంగుల్నీ విరజిమ్ముతూ, కేరింతాలు కొడుతూ వున్నాడు. నదిలోకి స్నానం చెయ్యడానికి ములిగి పోతూ, మళ్లీ ఇవతలికి వస్తూ వున్నాడు.

''ఆఁ, యివాళ సెయింట్ జాన్స్ యీవ్'' అని యెగోరికి గుర్తువచ్చింది. ఆ తడి మైదానంమీద పిల్లి మొగ్గలు వెయ్యడం మొదలుపెట్టాడు. ఆ రోజు చాలా ప్రత్యేకమైన రోజు.

సెయింట్ జాన్స్ యీవ్ మంచి నడి వేసవిలో వస్తుంది. పగటి పొద్దు చాలా యెక్కువ వుంటుంది. రాత్రి పొద్దు చాలా తక్కువ వుంటుంది. గడ్డీ, మొక్కలూ దట్టంగా పెరుగుతాయి. రసంతో వుంటాయి. పళ్లు పక్వానికి వస్తాయి. రైతులకి పరమానంద దాయకమైన కోత కాలం యెంతో దూరం లేదు.

కోతలకి వాళ్లు ప్రత్యేక రీతిలో తయారయారు. సెయింట్ జాన్స్ యీవ్ రాత్రి వాళ్లు పెద్ద మంటమీదనుంచి దూకి వెళ్లారు. మంటల్లో తమని తాము శుద్ధి చేసుకోవాలని, దిష్టి కళ్ల దోషం తొలగించుకోవాలని, శాసనాల పాపం వదలించుకోవాలని, కోత మొదలయే ముందు శక్తి పుంజుకుని యెక్కువ ఉత్సాహంగా వుండాలని అలా చేస్తారు.

పొద్దున్న ఆడపిల్లలు వో లేత బర్చ్ చెట్టుకి అలంకారం చేస్తారు. దాన్ని కొట్టి తీసుకు వస్తారు. దానికి బాగా మెరిసే రిబ్బన్లు చుడతారు. పువ్వులు, గరిక అలంకరిస్తారు. అబ్బాయిలు నది వొడ్డున మంట వేస్తారు. ఆ బర్చ్ చెట్టుని కాజేసి దాన్ని విరవాలని ప్రయత్నిస్తారు. అది ఆచారం మరి. కాని ఆడపిల్లలు నవ్వి పారిపోతారు. ఉడికించే పాటలు పాడతారు.

సెయింట్ జాన్స్ యీవ్ నాడు మండే మంట
మగ పిల్లల పొట్టల్లో రేగే మంట
మేలు మేలు శాస్తి జరిగి వాళ్లకి తెలియు
సెయింట్ జాన్స్ మొక్కని విరువగరాదు!

సాయంత్రం వూరు వూరంతా పోగవుతుంది, పెద్దా చిన్నా యావన్మందీ మిసమిసలాడి పోయే బట్టలు వేసుకుంటారు. యెక్కడ చూసినా నవ్వులు, పాటలు. చిన్నవాళ్లే కాదు పెద్దవాళ్లు కూడా ఒకే రీతిగా ఆ వేడుకలో పాల్గొనేవారు. ముసలి అఫనాసీ, మిఖేయ్ తాత సంప్రదాయకంగా వుండే రీతిలో మంట వెలిగించడానికి తయారయేరు. ఆంఫట్ యాంఫట్ అంటూ వాళ్లు వో కొమ్మని చేతుల మధ్య పెట్టుకు రుద్దేవాళ్లు, ఆ కొమ్మని వో యెండు కొయ్యమీద పెట్టేవాళ్లు, అదే పనిగా రుద్దడంతో ఆ కొమ్మ పొగలు చిమ్మేది. దానిమీద కొంచెం యెండు గడ్డిని వేసేవాళ్లు, రెపరెపలాడే చిన్న అరుణ జ్వాల వచ్చేది. సెయింట్ జాన్స్ యీవ్ నాడు మంటని మండించడం మరి అలాగే చెయ్యాలి.

జ్వాల రెపరెపలాడేది. అన్ని వేపులకీ టపటపమంటూ రవ్వలు రాలేవి. ఆ మాత్రం దూరం పరిగెత్తకుండా గెంతకుండా అలాగే వుంటే మీకు బాగా వాత పడుతుంది సుమా.

మంట వేడిగా నాల్కలు చాచి లేస్తుంది. ప్రతి వాళ్లకీ ఉత్సాహం, భయం కలుగుతాయి. వాళ్లు చేతులు పట్టుకుని పరిగెత్తుకొచ్చి మంటలపైన జంటలు జంటలుగా గెంతాలి. యెవళ్లతో పడితే వాళ్లతో గెంతకూడదు. తమకిష్టమైన వాళ్లతో కలిసి గెంతాలి. ఆ జంట చేతులు వదలకుండా వుంటే, రవ్వలు వాళ్ల వెనక లేస్తే వాళ్లకి ఖాయంగా పెళ్లి అవుతుంది.

మంట వెలుతురు అన్నిట్నీ ప్రకాశింపచేస్తూ వుంటుంది. పసుపుపచ్చ రంగువి, యెరుపు రంగువి, ముదురు నీలం రంగువి రిబ్బన్లు సరఫాన్లు అద్భుత కథలోల్లాగా కలిసిపోయి, నాట్యం చేస్తాయి. ఆడపిల్లలు తలకి చుట్టుకున్న పువ్వుల మాలలు రాజ కిరీటాల్లాగా వున్నాయి. వాళ్ల కళ్లు మంటల మాదిరీ ప్రకాశిస్తున్నాయి.

అందరూ ముచ్చటగా వున్నారు. కాని వొక్కళ్లు కూడా యెగోరి ప్రేమానురాగాల్ని సంపాదించలేకపోతున్నారు.

యిక అతని దగ్గరికి యెవళ్లొస్తారు మాష తప్ప. ఆమె ధగధగ మెరిసే బట్టలు వేసుకుంది. తన ధైర్యానికి తనకే సిగ్గయింది. రుమాలు చివళ్లు మెలిపెడుతూ అక్కడ నుంచుంది.

''పద గెంతుదాం యెగోరి, యేం? వెర్రి వూహలు చెయ్యకు. నాకు వొక్కత్తికీ భయంగా వుంది.''

యెగోరి నవ్వి ఆమె చేతిని పట్టుకున్నాడు. వాళ్లిద్దరూ పరిగెత్తి యెర్రగా మండే

మంటమీద పక్షుల జంటలాగా యెగిరారు. ఒకళ్ల చెయ్యి వొకళ్లు వదలలేదు. నిప్పు రవ్వలు తేనెటీగల గుంపులా వాళ్ల వెనక లేచాయి. జనం అది చూసి ''అదీ జంట అంటే'' అని అరిచారు.

మాష సిగ్గు పడి పరిగెత్తి పారిపోయింది. ఆమె వెనక్కాలే ఆ జనం పక పక నవ్వడం వినిపించింది.

మంట ఆరిపోనారంభించింది. నీలాకాశంలో నక్షత్రాలు మిణుకు మంటున్నాయి. ఆడపిల్లలు బర్చ్ చెట్టుని నదిదాకా మోసుకెళ్లి అందులో పడేశారు. ఆ చెట్టు దాహం తీర్చడానికి, వానదేవుణ్ణి ఆహ్వానించడానికీ అలా చేశారు. నల్లని నీళ్లమీద ఆ చెట్టు కొట్టుకుపోయింది. ఆడపిల్లలు చుట్టుకున్న పువ్వుల మాలలు వెన్నెలలో ఆ చెట్టు వెనక పడి పోయాయి. ఆడపిల్ల చుట్టుకున్న మాల యెక్కడ ఆగుతుందో అక్కడ ఆమె వరుడు వుంటాడు. మాల గనక మునిగిపోతే అది దుశ్శకునం. అదృష్టం బాగుండి ఆ రోజు యే మాలా మునగలేదు.

పెళ్లయిన పడుచులు తమ మాలల్ని నీళ్లల్లోకి విసరరు. భర్తలతో, తల్లిదండ్రులతో కలిసి ఆవిరి స్నానం కోసం వెడతారు. ప్రతివాళ్లూ సువాసన గడ్డిని చుట్టి, పువ్వులు కట్టిన బర్చ్ చెట్టు రెబ్బలని తీసుకుని వెడతారు.

పడుచువాళ్లు ఆ క్షణం కోసమే నిరీక్షిస్తూ వుంటారు. ముసలాళ్లు వెళ్లిపోగానే వాళ్లు బట్టలు తీసేసి పక పకా నవ్వుతూ నదిలోకి ఉరుకుతారు — ఒక్క ఉదుట్న. తృప్తిగా కేరింతాలు కొడతారు, నీళ్లు చిమ్ముకుంటారు. నీటికి ఆ రాత్రి ప్రత్యేకమైన జీవదాయక శక్తులు వస్తాయి. మరి సూర్యుడు ఆ నీటిలో స్నానం చేశాడుగా.

నదిలో ఆడపిల్లలు కలువ పువ్వుల్లా వికసిస్తారు. అంతకుముందు యెన్నడూ అంత అందంగా వుండి వుండరు.

కాని మాష యేది?

ప్రతివాళ్లూ వొడ్డుకి యెక్కి వచ్చారు. కాని ఆమె జాడలేదు. యెగోరి భయం భయంగా చుట్టూ వెతికాడు. కొంపతీసి మునిగిపోయిందా యేమిటి? పక్కనున్న వాళ్లని అడిగాడు. ఆమె అడవిలోకి వెళ్లడం వాళ్లు చూశారట.

ఆమెని వెదకడం కోసం యెగోరి పరిగెత్తి వెళ్లాడు. అలాంటి చీకటి రాత్రి పూట, యేమో, ఆమెకి యేదన్నా జరగచ్చు. తెగ వెతికాడు. ఆమె జాడ లేదు. చుట్టూతా భయం కలిగించే నిశ్శబ్దం. అడవి అంతా ఉగ్గబట్టుకుని వున్నట్టుంది.



హఠాత్తుగా పైనుంచి వో నల్ల గుడ్లగూబ అరిచింది. అడివికి జీవం వొచ్చింది. గాలి లేదు. అయినా ఆకులు అల్లాడేయి. కొమ్మలు గీమన్నాయి. చెట్లు వూగాయి. యెగోరిమీదకి వాలేయి. యెగోరికి చెడ్డ భయం కలిగింది. వెన్నెముక భయంతో వణికి పోయింది.

సెయింట్ జాన్స్ యీవ్ నాడు నానా రకాల వింతలూ జరుగుతాయని అమ్మమ్మ చెప్పేది. ఆవిడ మాటలు అతను నమ్మేడు కాడు. కాని యిప్పుడు నిదర్శనం కనిపిస్తోంది, ఆవిడ అన్న ముక్కలు నిజమే. చెట్లమీదనుంచి బొచ్చూ పొడుగాటి గోళ్ళ వున్న పంజాలు తన పీక పట్టుకోవడం కోసం తనమీదకే వస్తున్నట్టనిపించింది. భయపెట్టే గొణుగుడు వినిపించింది. చీకట్లో మసక వెలుతురు మిణుకుమంది.

యెగోరి పారిపోవాలని వెనక్కి తిరిగేడు. యేదో పొదల్లో తేలాడు. ఎదరనుంచి కీచు మని కొద్దిగా యేడుపు వినిపించింది. మళ్లీ నిశ్శబ్దం. మాష గొంతుకలాగా వుందే. తృటిలో భయం గియం మర్చిపోయి యెగోరి బంయ్న అక్కడికి దూసుకుపోయాడు. అతని గుండె ధనధన కొట్టుకుంటోంది. అతని ముఖం గీరుకు పోయింది. రక్తం చిమ్ముతోంది అడ్డం కొట్టుకున్న కొమ్మలవల్ల. అదునులో తను అక్కడికి చేరాలి.

వెన్నెలలో పరిగెట్టి వెళ్లి మాష బోర్ల పడుకుని వుండడం చూశాడు. ఆమె చేతిలో ఫెర్న్ రెమ్మ పట్టుకొంది. యెగోరి కాళ్ళు జావగారిపోయాయి. మోకాళ్లమీద వాలిపోయాడు. ఆమె ఛాతీమీద తలపెట్టి విన్నాడు. ఆమె గుండె యింకా కొట్టుకుంటోంది. ఆమె బతికే వుంది!

ఆమె ముఖంమీద పడిన జుట్టుని పక్కకి తొలగించి అతను ఆశ్చర్యంతో ఆః అన్నాడు. అతను రోజూ మాషని చూస్తూనే వున్నాడు. ఆమెలో ప్రత్యేకంగా దేన్నీ అతను గమనించ లేదు. కాని యిప్పుడు, యేదో మొట్టమొదటి సారి అయినట్టు, ఆమె యెంత అందంగా వుందో చూశాడు. ఆ మంత్ర ముగ్ధ నిశీధి ఆమెని మరింత అందంగా కనిపించేటట్టు చేసి వుంటుంది. లేదా యెగోరికి కొత్త జత కళ్లని యిచ్చి వుంటుంది.

తనని అదుపులో పెట్టుకోలేకపోయాడు యెగోరి. ఆమె వెచ్చని పెదాలమీద ముద్దు పెట్టుకున్నాడు. మాష కంటి రెప్పలు కంపించాయి. ఆమె భయంతో కళ్లని తెరిచింది.

''అబ్బ యెగోరి! యెంత భయపెట్టావు. యేం చేస్తున్నావిక్కడ?''

''నువ్వు కూడా యిక్కడ యేం చేస్తున్నావు?''

 ''నేను మంత్రపుష్పం కోసం చూస్తున్నాను. సెయింట్ జాన్స్ ఈవ్ రోజున ఒక్కగా



నొక్క ఫెర్న్ పువ్వు అడవిలో పూస్తుందని తాత చెప్పాడు. అది దొరికిన వాళ్లకి అష్ట ఐశ్వర్యాలూ వస్తాయిట. దుష్టశక్తులు ఆ ఐశ్వర్యాలని బంగారాన్ని భూమిలోనుంచి యివతలకి తెచ్చి దాని చుట్టూ కాపలా కాస్తూ నుంచుంటాయట. కానీ భయపడకూడదు మనం. వెళ్లి యీ పువ్వుని వాటిమీద విసిరెయ్యాలి. అప్పుడు అవి శిలాప్రతిమల్లా స్తంభించి పోతాయట. అప్పుడు నీకు కావలసినంత బంగారం తీసుకుని చొక్కాలో దాచేసుకో, కాని పిడుగులు పడేటట్టు వుండే గిట్టల చప్పుడు, బుసలు అడవిలో వస్తాయి విను. నిన్ను మడదొక్కెయ్యాలని వచ్చే భయంకర అశ్వం అది. నేలమీద వాలి పడిపో. ఒక్క పిసరు కూడా కదలద్దు. అది యెంతలా వెనక కాళ్లమీద లేచినా లేదా దాని శ్వాస యెంత కాల్చేసేటట్టు వేడిగా వున్నా కళ్లు తెరవకు. అది అలిసిపోయి చక్కాపోతుంది. బంగారం నీదవుతుంది.''

''నీకెందుకు బంగారం?''

''నేను బంగారం కోసం రాలేదు. అది నిజమా అబద్ధమా చూద్దామని వచ్చేను. నేను ఒక్కత్తినీ నడిచి వచ్చేను. నాకు మతి లేదు. ఆ పువ్వు కోసం వెతుకుతూ సగం ప్రాణం పోయే వచ్చేను. వున్నట్టుండి నా వెనక యేదో అరిచింది పొదల్లోనుంచి నా మీదకి రావడం మొదలెట్టింది. 'దేవీ నీదే భారం' అనుకున్నాను. నాకు పువ్వు దొరకలేదు. భయంకరమైన అశ్వం నా మీదకి వచ్చేస్తోంది. భయపడిపోయాను. మూర్ఛ వచ్చేసింది.... యెందుకు నవ్వుతావు?''



యెగోరి నేలమీద పొర్లుతున్నాడు. నవ్వుతో పొట్ట చెక్కలైపోతోంది.

''భలే దానివే! పొదల్లోనుంచి వచ్చింది నేనే. అబ్బ, కడుపు పగిలిపోతోంది నాకు నవ్వలేక.''

తర్వాత అతను స్థాయీ పడ్డాడు. కూర్చున్నాడు. కళ్లు తుడుచుకున్నాడు.

''అయితే నీకు పువ్వు దొరకలేదన్నమాట!''

''వుహుఁ.''

''వూఁ, నాకు దొరికింది.''

''నీకు? యేదీ చూపించు.''

''కళ్లు మూసుకో.''

ఆమె కళ్లు మూసుకుంది. యెగోరి చిన్న అద్దం తీసేడు. దాన్ని ఆమె ముఖం ముందు యెత్తి పట్టేడు.

''వూ, చూడు. నా పువ్వు యిదిగో.''

మాష నోరు వెళ్లబెట్టింది. చేతులతో ముఖం కప్పుకుంది. యేడవబోయింది. కొంటె మనిషి!

యెగోరి నరాల్లో రక్తం పొంగింది. చేతుల్ని మాష చుట్టూ మృదువుగా వేశాడు.

''యెందుకు యేడుస్తున్నావ్? నేనంటే నీకు యిష్టం లేదా?''

''నువ్వంటే నాకు చెప్పలేనంత యిష్టం. నాకు ఆనందం పట్టలేక యేడుపొస్తోంది. నువ్వు యిరవై నాలుగ్గంటలూ నీ రంగులు చూసుకుంటూ గడుపుతావుగాని నా కేసి చూడనే చూడవు.''

''అది నిజం కాదు మాష. రంగులు నాకు అందాన్ని గుర్తించడం నేర్పాయి. నిన్ను నిన్నులాగా చూడ్డం నేర్పాయి. నన్ను పెళ్లి చేసుకుంటావా?''

''నువ్వు కోరితే నేను సర్వం వొదిలేసి నీతో వచ్చేస్తాను. తాతయ్య వొప్పుకోడేమోనని భయంగా వుంది. నాకో జమీందార్ని చూడాలని వుంది ఆయనకి.''

''అకులీనా అమ్మమ్మని పంపిస్తా. ఆవిడ ఆయనకి బోధపరుస్తుంది.''

సూర్యోదయం వేళకి వాళ్లు వూళ్లోకి వచ్చేరు. తమకి సమకూరబోయే ఆనందం గురించి ముచ్చటించుకున్నారు. ముద్దులు కురిపించుకున్నారు. మరి, సహజమే కదా.

యెగోరి చుంచులాగా యింట్లోకి దూరేవేళకి కోళ్లు కూశాయి. కాని అమ్మమ్మ చీపురుకట్ట పట్టుకుని 'రానీ భడవ'ని అని అతని కోసం కాసుకుని వుంది.

''రాత్రంతా యెక్కడ మాయమయ్యావురా? దొంగ భడవా! చీపురుకట్ట తిప్పానంటే తెలుస్తుంది'' అంది అమ్మమ్మ.

యెగోరి ముద్దుల అమ్మమ్మని చిరునవ్వునవ్వుతూ యెలుగుబంటిలాగా కాగలించుకున్నాడు. ఆమె బక్కపల్చగా యెండిపోయి వుంది. ఆమె మెత్తబడింది.

''వూ, యెక్కడికెళ్లావ్?''

''మంత్ర పుష్పం కోసం వెతుకుతూ వుండిపోయాను.''

''దొరికిందా?''

''ఆ, అమ్మమ్మా.''

''యెక్కడుంది మరి?''

''పక్క యింట్లో, అఫనాసీ తాత దగ్గర వుంచేను. నువ్వు వచ్చి మాషని మనకిమ్మని అడుగుతావా?''

అమ్మమ్మ ''హమ్మయ్య'' అని బల్లమీద కూర్చుంది.

''దేవుడి దయవల్ల! మొత్తంమీద యిలా తేలావు! నువ్వు యతీశ్వరుడివేమోనని భయ పడుతూ వున్నాను. అస్తమానూ ఆడపిల్లలు పనిచేస్తూ వున్నా ఆడపిల్లల కేసి చూడనే చూడవాయిరి. మాష మంచి కోడలు మన యింటికి. పిల్ల కుందనం బొమ్మ. అన్ని పనులూ వచ్చు. వెళ్లి ముసలాణ్ణి అడుగుదాం.''

''మనం సాయంత్రం దాకా ఆగుదాం. ఆయన గనక కాదు పొమ్మంటే నేను అవ మానంతో తల తీసుకోవాలి.''

''కాదు పొమ్మనడమేం గొడ్డలిపెట్టు కాదు. నువ్వేం గాయపడక్కర్లేదు.''

కాని సాయంత్రమే వెళ్లాలని నిర్ణయించుకున్నారు, యేమో యెందుకేనా మంచిదని. దాపుడు బట్టలు వేసుకున్నారు. యెగోరికి బెరుకు బెరుగ్గా వుంది. వేసుకున్న తెల్లని చొక్కా లాగా కాంతి లేకుండా వున్నాడు.

అఫనాసీ యింటికి వెళ్లేటప్పటికి యెగోరికి ధైర్యం పూర్తిగా సన్నగిల్లింది. అతను విగ్రహం ముందు నుంచున్నాడు. వొణికే చేతులతో శిలువ గీసుకున్నాడు.

మాష యింట్లోంచి యెకాయెకీ పరిగెత్తిపోయింది. పొద్దుతిరుగుడు పువ్వులలో దాంకుంది. విషయం యేమిటైందీ వాళ్ల తాతకి వెంటనే అర్థమైంది. కాని తేల లేదు.

వాళ్లు బల్లమీద నిదానంగా కూర్చున్నారు. డొంక తిరుగుడు పద్ధతిలో విషయాన్ని ప్రస్తావించేరు.

''నీ దగ్గర మంచి పువ్వు వుంది అఫనాసీ. మా దగ్గర మంచి తోటమాలి వున్నాడు.''

''యేమిటి? మీరు మాట్లాడేది మాష విషయమేనా? ప్చ్, పాపం, మీరు మీ తోట మాలి కోసం వేరే తోట వెతుక్కోవాలి.''

''యేం మా వాడంత చెడిపోయాడా?''

''లేదమ్మా, వధువే మీకు తగదు. ఆమె కిటికీలోనుంచి బయటికి చూస్తే గుర్రం భయపడి వెనక కాళ్లు యెత్తుతుంది. పెరట్లోకి వెడితే కుక్క మ్యాడోజులు వరసగా మొరుగు తూనే వుంటుంది. మనలో మన మాటస్మా — ఆమె కళ్లు చికిలి కళ్లు, పొగరు పిల్ల. నోరు దాకలా వుంటుంది. రెండు కాళ్లూ కుంటి. గూని నడుం.''

''తాతా, నన్ను చంపేస్తున్నావ్'' అంది అమ్మమ్మ. ''నువ్వు నీ గురించి చెప్తుకుం టున్నావ్. మాషకేం బంగారంలాంటి పిల్ల. మరి మా కుర్రాడూ తీసిపోలేదు. మా వాడి

చేతులు బంగారం. యిలాంటి కుర్రాణ్ణి నువ్వెక్కడా చూసి వుండవు'' అంది.

''అవును మీ ఐశ్వర్యం కూడా. రెండు చీపురు కట్టలూ, గోనె పట్టాలూ.''

''ఆ మాట సర్లే. కూడు తక్కువ అయినా కులం తక్కువ వాళ్లం కాదు. మా యెగోరి యెంత పనివాడో నీకు తెలుసు. చేతిలో విద్య వున్న వాడికి డబ్బుకి లోటు యేమిటి? మీ మనవరాలు మా యింట్లో తిండికి లోటు పడదు.''

''తిండికి లోటు పడక పోవచ్చులే. కాని నోటి దాకా పెట్టుకోవడానికి చెంచా కావద్దూ?''

ఆ మాటకి అకులీనాకి కోపం వచ్చింది.

''యేమిటి నీ ఉద్దేశం? మెత్తగా మాట్లాడేకొద్దీ బిర్రెక్కుతున్నావ్ ముసలి నక్కా? మీ భోషాణం పెట్టెల్లో యేమున్నాయేమిటి? చేప పొలుసులూ, బొద్దింకలూనూ! కాస్త జాగ్రత్తగా వుండు యేమనుకుంటున్నావో. నువ్వు లేకపోతే మాకు గతిలేనట్టు. మరో చోట చూసుకుంటాం'' అని దులిపేసింది.

''అరె చూడండి! మొసల్ని నీట్లో ముంచుతుందట!''

''యీ బోసి నోటి మొసల్ని చూడరా యెగోరి! అబ్బ! రోత. రామ రామ! కాని యిదిగో వొక మాట చెప్తున్నా అఫనాసీ! నువ్వు మొసలిలా కనిపించా లనుకో వచ్చునేమో, కాని నీది జాలి గుండె. వూళ్లో అమ్మలక్కలందరికీ తెలుసా విషయం.''

ఆ మాటలకి ముసలాడు యెండలో మంచు కరిగినట్టు కరిగిపోయాడు.

''నువ్వు భలే టక్కుల మారివి ముసల్దానా! యెంత వాళ్లనేనా చిత్తు చేసేస్తావు. చాల్లే గోల. పెళ్లి విషయం చూసుకుందాంలే.''



మాషని లోపలికి రమ్మని పిలిచారు. ఆమె వచ్చి సిగ్గుపడుతూ కళ్లు నేలమీదకి వాల్చి, కొంగు మడతపెడుతూ నుంచుంది.

''యెగోరిని పెళ్లాడతావా అమ్మా?''

''నీ యిష్టం తాతా.''

''సరే అయితే. పెళ్లి ష్రోవ్ టైడ్ పండగప్పుడు జరిపిద్దాం. వూరే కొద్దీ వూరగాయ రుచి. పెళ్లికూతురికి బహుమతులు చూసుకో యెగోరి. దాన్ని యెలా మురిపిస్తావో మరి చూస్తా.''

వధువుకి యేం యివ్వాలా అని యెగోరి బుర్ర బద్దలు కొట్టుకున్నాడు. యివ్వబోయే కానుక చాలా అందంగా వుండాలి. ఉపయోగకరంగా వుండాలి. యెప్పుడూ ఆమె దాన్ని

వాడుతూ వుండాలి. అది తనని యెప్పుడూ ఆమె కళ్ల ముందు మెదుల్తూ వుండేటట్టు చెయ్యాలి.

అతనికి యేమీ తట్టలేదు.

తర్వాత వొక రోజున అతను ఆడపిల్లలు పోగయే చోటకి వెళ్లాడు. అక్కడ ఆడ పిల్లలు బల్లలమీద కూర్చున్నారు. వాళ్లు వడుకుతున్నారు. పాడుకుంటున్నారు. కేరింతలు కొడుతున్నారు. అక్కడనే మాష కూడా వుంది.

యెగోరి కూర్చుని పరీక్షగా చూశాడు. మాషమీదనుంచి కళ్లని తిప్పకోలేకపోయాడు. ఆమె చేతులు యెంతో లాఘవంగా నేర్పుగా పనిచేస్తున్నాయి. యెవళ్లూ ఆమెతో అందుకోలేకపోతున్నారు. ఆమె కదురే అందరి కదుళ్లకంటే చవకబారుగా వున్నా ఆమె అందరి కంటే బాగా పనిచేస్తోంది. అది కిర్రుకిర్రు మంటోంది. విరిగిపోతుందేమో అన్నట్టు వుంది. అది వాళ్ల మామ్మది.

''యిదీ ఆమెకి యివ్వాల్సిన కానుక. అది ఉపయోగం. మాష యెప్పుడూ దాన్ని వాడుతుంది'' అనుకున్నాడు.

మర్నాడు కదురు తయారుచెయ్యడానికి లైమ్ చెట్టు కొడదామని అడవికి వెళ్లాడు. ఆ చెట్టు మెత్తగా, మృదువుగా వుంటుంది. మీ యిష్టం వచ్చిందాన్ని దాంతో చేసుకోవచ్చు. అది విరిగిపోదు. చక్కగా అందంగా మెరుస్తుంది.

అతను నది ఒడ్డున నడుస్తూ వుంటే అతనికి తెల్లని హంస కనిపించింది. అది నదిలో యీదుతోంది. దాని మెడ గర్వంగా వొంపు తిరిగి వుంది. చక్కగా తీర్చి చెక్కినట్టు వుంది.

''యిలా తయారుచెయ్యాలి నేను కదురును. అది మామూలుది కాదు, హంసలాగా వుండాలి'' అనుకున్నాడు సంతోషంగా.

అనువుగా వుండే లైమ్ చెట్టుని అడివిలో కొట్టేడు. కాని బెరడు వొలవలేదు. వొలవకుండా వుంటే అది పెళుసుగా విరగదు. దాని అంచుల్ని మట్టితో పూత పెట్టాడు.

లైమ్ కొయ్య సరిగ్గా ఆరింది. అప్పుడు మట్టుని చెక్కడం మొదలుపెట్టాడు. దానిమీద నూలు వడికే మనిషి కూర్చుంటుంది. ఆకుని అమర్చే వెడల్పాటి చదును పలకని కోశాడు. మట్టుకి వో చివర వొక కన్నం చేశాడు. అందులో పత్తి చిక్కు తీసే దువ్వెన పెట్ట వచ్చు లేదా దారాన్ని చుట్టే పలకనేనా పెట్టవచ్చు. ఆ తర్వాత పలకని కోశాడు. దాన్ని

చిన్న తెడ్డులాగా చేశాడు. దాన్ని గట్టిగా వుండే మేపిల్ కొయ్యతో చేశాడు. బాగా అరగ దీశాడు. నున్నగా పామేడు. అది బంగారంలా మెరిసేటంత దాకా నునుపు చేశాడు. అదిప్పుడు నాజూకైన పక్షిలాగా వుంది, వొట్టి కదురు వతుగా లేదు. అలాంటిది మరెవ్వరికీ లేదు. అది అందంగా వుంది. కాని యేదో లోటు వున్నట్టు యింకా కనిపించింది.

''దీనికి నగిషీ చెక్కి, రంగులు వేసి అలంకారం చేస్తే?'' అనుకున్నాడు యెగోరి. మట్టుమీద కొన్ని సన్నని రేఖలు గీశాడు. అంచుల్లో వాటిని సుళ్ళ తిప్పాడు. అప్పుడు వింత వింత ఆకులూ, చూడ్డానికి ముచ్చటగా వుండే పువ్వులూ, చిన్న చిన్న సూర్యబింబాలూ కనిపించాయి.

అయినా యెగోరికి ముఖం విప్పారలేదు. అతనికి యింకా తృప్తికలగలేదు.

పెరట్లోకి వెళ్లాడు. పదునెక్కిన ఓక్ కలప దోనె అక్కడ వుంది. దాన్ని పల్చటి రేకుల కింద చీల్చాడు. వాటితో రెండు నల్లని గుర్రాల్ని చేశాడు. వాటికి కమాను కంఠాలు అమర్చేడు. ఆ తర్వాత ఆ గుర్రాల్ని పువ్వుల మధ్య మట్టులో బిగించాడు. అవి చక్కగా అమిరేయి. జిగురు బంక అక్కర్లేకుండానే బిగిశాయి. కాని యెందుకేనా మంచిది లెమ్మని చెప్పి అతను రెండు బెజ్జాలు చేసి పసుప్పచ్చ కొయ్య గసికలు దిగేశాడు, గుర్రాల కళ్ళూ, ముస్తీబూ వుండే చోటు. చిత్రం! గుర్రాలకి ప్రాణం వొచ్చినట్టు కనిపించాయి. ముస్తీబు మువ్వలు గణగణమన్నాయి. వాటి కళ్ళ మెరిశాయి.

అతనికి తృప్తి కలిగింది. తర్వాత ఆకుమీద పనిచెయ్యడం మొదలుపెట్టాడు. ''యిక్కడ యే బొమ్మ వెయ్యనబ్బా!'' అనుకున్నాడు. సెయింట్ జాన్స్ ఈవ్ నాటి వెన్నెల రాత్రి ఫెర్న్ పువ్వు గుర్తువచ్చింది. దాని రంగు యేమిటో, చిత్రమైన పువ్వు! యెరుపా? నీలమా? తెలుపా? బహుశా ప్రపంచంలో అలాంటి పువ్వు యేదీ లేదేమో — నల్లటిది! మాయా మంత్రాల రంగు అదే కదా.

వర్తికని నల్లని మసిలో ముంచి అద్భుతమైన పువ్వుని గీశాడు. అమావాస్య రాత్రిలాగా నల్లగా వుంది. పల్చని ఫెర్న్ ఆకులు దాని చుట్టూ ఉంగరాలు తిరిగాయి. నల్లని పత్ర దళాలు బంగారపు పలకమీద స్ఫుటంగా కనిపించాయి. మీరు గనక వెతక గలిగితే అలాంటి పువ్వు వుందిస్మా అని మీకు నమ్మకం పుట్టించేటట్టు వుంది అది.

పై అంచున యెర్రటి సూర్యుణ్ణి గీశాడు. అటూ యిటూ సీరిన్ పక్షులు కాపలా వున్నాయి, సూర్యుడు మసకబారిపోకుండా చూసేందుకు. సూర్యుడికి దిగువన మంత్ర వృక్షం వుంది. పువ్వులతో అల్లుకుని వుంది. అంటే కుటుంబం దృఢంగా వుంటుందన్నమాట.

చెట్టు కింద రెండు సింహాల్ని చెక్కేడు. వాటికి చక్కని తోకలున్నాయి మంత్రవృక్షానికి హాని కలగకుండా కాపాడతాయి.

అకులీనా అమ్మమ్మ కదురు చూసింది. ఆమె ఆశ్చర్య పోయింది.

‘‘యిలాటి కానుకని యెవరన్నా యే వధువుకన్నా కానుకగా యిచ్చార్రా? దీన్ని మాషకి యివ్వాలంటే నీకు భయం లేదుగదా? ఆమె నిన్ను మర్చిపోయి దీన్ని ప్రేమిస్తుందేమో’’ అంది.

రంగులు ఆరేక యెగోరి దాన్ని ఆడపిల్లలు పేరంటం చేసుకునే చోటకి తీసికెళ్లాడు. దాన్ని బల్లమీద పెట్టాడు. అది సూర్యుడిలా మెరిసింది. ఆడపిల్లలు తమ తమ పన్లు వదిలేసి దాని చుట్టూ మూగేరు.

‘‘చూస్తూ వుండండి. మా యువకులని కూడా యిలాంటి వాటిని చెయ్యమని అడుగుతాం. చేసి యివ్వరూ పెళ్ళీ లేదు, గిళ్ళీ లేదు.’’

వాళ్ల పడుచువాళ్ల నిట్టూర్చి బుర్రలు గోక్కున్నారు. వాళ్ళ యెగోరితో పోటీ పడగలరా? అతనికి నాలుగు జెల్లకాయలు తగిలిద్దామనుకున్నారు. కాని అతనితో హాస్యాలు కుదరవు.

అంచేత వాళ్ళ కూడా నగిషీ చెక్కిన కదురులు తయారు చెయ్యాల్సి వచ్చింది. తమకి చేతనైనట్టుగా రంగులు వెయ్యాల్సి వచ్చింది. అప్పట్నుంచీ తను పెళ్లిచేసుకోబోయే ఆడపిల్లకి కదురు యివ్వడం ఆచారం అయింది. దాన్నిబట్టి పడుచువాళ్ల ప్రేమ వెల్లడవుతుంది.



మాష తమ యింటి కోడలయే రోజు కోసం యెగోరి మహా ఆతృతగా యెదురు చూశాడు.

‘‘యెందుకురా అలా పనీ పాటూ లేకుండా కూచుంటావ్? పెళ్లి కోసం రోజులు లెక్కపెట్టుకుంటూ కూచోకపోతే మాష కోసం యేదన్నా పనికొచ్చేది చెయ్యచ్చుగా’’ అంది అకులీనా అమ్మమ్మ.

‘‘యేం చెయ్యచ్చు?’’

‘‘అగ్ని ప్రమాదానికి ముందు నాకో రంగుల పెట్టె వుండేది గుర్తుందా? మీ తాత నాకు దాన్ని కొని తెచ్చారు వెలికి ఉస్త్యుగ్‌నుంచి, అందులో నా కట్నం కానుకలు పెట్టుకోడానికి వుంటుందని ఆయన ఉద్దేశం. ప్రతివాళ్ళూ దాన్ని చూసి అసూయ పడ్డారు. దాని



మీద నానా రకాల మాయా జంతువులూ, పువ్వులూ వున్నాయి.''

''యేం జంతువులు అమ్మమ్మా?''

''పొడుగాటి జూలు వున్న సింహాలున్నా యనుకుంటాను. ఓ సీరిన్ పక్షి, గ్రిఫిన్.''

''గ్రిఫినా? అదేమిటి?''

''తెలీదా? మాంసాహారి జంతువు. అది సింహంలాగా వుంటుంది జూలూ పంజాలూ అదీ. వాడిగా వుండే ముక్కూ, పక్షి తలా, రెక్కలూ వుంటాయి. దాని తోక జూలు బిర్రుగా ఉంగరాలు తిరిగి వుంటుంది. బలంలో గాని, ధైర్యంలో గాని, దానికదే సాటి. యెక్కణ్నో యెక్కణ్నో వుంటుందది. బంగారాని కంతటికీ అది కాపలా వుంటుంది. యెవళ్లైనా కుత్సితం బుద్ధిగాళ్లు ఆ బంగారాన్ని కాజెయ్యా లనుకుంటున్నారో గ్రిఫిన్ వాళ్లని ఖండ ఖండాలుగా చీల్చేస్తుంది. అందుకనే పెట్టెల మూతలమీద దాని బొమ్మ గీస్తారు. దొంగల్ని భయపెట్టి తరిమెయ్యడానికి.''

''అబ్బ! అమ్మమ్మా! యీ గ్రిఫిన్ విషయం నువ్వు నా కింతకి ముందు యెందుకు చెప్పలేదు? మాష పెట్టెమీద కూడా దాని బొమ్మ గీస్తాను.''

''అది కాపలా కాయడానికి బంగారం యేదిరా?'' అని అమ్మమ్మ నవ్వింది.

''వూఁ, దుష్టశక్తుల బారినుండి కాపలా కాస్తుందిలే, బంగారం లేకపోతే యేంగాక!''



''ఆ పని చెయ్యడానికి యింకో జంతువు వుందిలే. దాన్ని యింద్రిక్ అంటారు. అది గుర్రంలాగా వుంటుంది. దాని నుదుటిమీద మాయామహిమల కొమ్ము వుంటుంది. ఆ కొమ్ముతో పొడిచి అది దుష్టశక్తులన్నిట్నీ తరిమేస్తుంది. వాటితో పోరాడేటప్పుడు మంచి వాళ్లు దాని చుట్టూతా వొక వలయంలా నుంచుని యిలా పాడతారు.''

రెండు జంతువులు హోరా హోరీ
పోరు సల్పుటే మాత్రం కాదిది.
సత్య మసత్యం యెల్ల వేళలా
విజయం కోసం యుద్ధం చేయుట.

యెగోరి యీ కొత్త పనికి దీక్షగా నడుం బిగించేడు. ఒక లైమ్ చెట్టుని నరికేడు. దాని బెరడుని చీల్చి వొక పల్చని పొర తీసేశాడు. తర్వాత దాన్ని పెద్ద పెట్టెలాగా చేశాడు.

మూలలు వంచేడు. వాటిని పట్టాతో కుట్టాడు. పట్టా యింకా చెమ్మగా వుండగానే లోపల ఫర్ కొయ్యని మట్టుగా పెట్టేడు. పట్టా యెండాక పెట్టె పక్క భాగాలు మట్టుకి బాగా అతుక్కుంటాయి.

మిగిలిన పట్టాతో మరో రెండు పెట్టెలు చేశాడు. చెంబులు, తప్పేలాయీ పెట్టుకోవడానికి వో మాదిరి పెట్టె, మాష చెవి కమ్మలకీ, పూసలకీ మరో చిన్న పెట్టె. అప్పుడు పల్చని ఫర్ కొయ్య మూతలు అన్ని పెట్టెలకీ బిగించేడు. వాటిని మెలి తిరిగిన యినప బందులతో బిగించేడు.

కొన్ని రోజులకి పట్టా యెండిపోయింది. పెట్టెలు నున్నగా, తెల్లగా అయ్యాయి. యెగోరి చిన్న పెట్టెమీద సన్నని నల్లని గరిక పోచలు గీశాడు. పెద్ద యెర్రటి పువ్వులు గీశాడు. దాన్ని యేడు వారాల నగలూ పెట్టుకునే భేషైన భరిణలాగా చేశాడు.

తర్వాత చెంబులూ తప్పేలాలూ పెట్టుకునే మధ్యరకం పెట్టెమీద రోజువారీ జీవితంలో కనిపించే దృశ్యాలు గీశాడు. ఓ వేపున పంచకళ్యాణీ గుర్రం వొకటి వో స్లెడ్జ్ బండిని లాగుతోంది. ఆ స్లెడ్జ్ బండి మంచి నదురైన రంగులతో గీసినటువంటిది. ఆ బండిలో మాష, యెగోరి కలిసి కూచున్నారు. యెగోరి గుర్రం కళ్లేలు పట్టుకున్నాడు. అతను కమ్చీ కోలని యెత్తి పట్టుకున్నాడు. పైకి చూస్తున్నాడు. యేమంటే పైన ధగధగ మెరిసే రంగుల ఈకల సీరిన్ పక్షి యెగురుతోంది. ఆకాశం ధగద్ధగాయమానమైన పుష్పాలతో నిండి వుంది. మంచులోనుంచి యెరుపు ఆకుపచ్చ ఆకులు గుర్రంకంటే యెత్తుగా పైకి అల్లుకున్నాయి.



పెట్టె రెండో పక్క మరో బొమ్మ వుంది. యెగోరి, మాష యింటికి వచ్చి, పెద్ద సమొవార్ పక్క కూచుని టీ తాగే దృశ్యం అది. తెరేంతీ మాష కాలికి ఆనుకుంది. నల్ల కుక్క ఝూచ్క యెగోరి పక్క కూచుంది. అన్ని దిక్కుల్లోనూ పువ్వులు వున్నాయి. గోడల్లో, బల్లమీదా పువ్వులు పూస్తున్నాయి కూడా. అది మంత్ర కవాటం తెరుచుకున్న తోటలాగా వుంది. మూతమీద బలమైన పెద్ద సింహాన్ని గీశాడు. దాని జూలు బారుగా వుంది. శత్రువుల గుండెల్లో గుభిల్లు మంటుంది దాన్ని చూస్తే, కాని స్నేహితుల్ని చూసి నవ్వుతుంది, తోక ఆడిస్తుంది. దాని తోక అంచున బాగా వికసించిన పువ్వు వుంది.

ఆ కట్నం కానుకల పెద్ద పెట్టె పక్క భాగాలలో నానా రకాల వింత జంతువుల్ని గీశాడు యెగోరి. తను విన్న వాటినన్నిట్నీ గీశాడు. ఓ పెద్ద రామ చిలకని గీశాడు. దానికి కొక్కెంలాంటి ముక్కు వుంది. యింద్రిక్‌ని గీశాడు. దాని కొమ్ము వాడిగా వుంది. అది

దాని నుదుటిమీద వుంది. అది సింహంతో యుద్ధం చేస్తోంది. గర్వంగా బలంగా వుండే డేగని గీశాడు. అది ఆకాశానికి రాజు. వో స్ట్రాటిమ్ పక్షిని గీశాడు. అది మహాసముద్రాలకి అధిపతి. ఓడలు గనక దాని కళ్ల బడ్డట్టాయినా అది రెక్కల్ని ఆడిస్తుంది. అలల్ని రేపుతుంది. సామాన్లతో సిబ్బందితో సహా ఓడ నీటిలో కృష్ణార్పణం అయి పోతుంది.

మూతమీద గొప్ప యోధుడు పాల్కాన్ నరాశ్వం విల్లంబులు పట్టుకుని మంత్ర పుష్పాల మధ్యలో, గరికల మధ్యలో దౌడు తీసే బొమ్మ వుంది. పాల్కాన్‌కి కాళ్లు, తోక, శరీరం గుర్రంలాగా వుంటాయి. ఛాతీ, తల, చేతులు మనిషివి. పాల్కాన్ బలం చాలా అధికం. వాయువేగంతో దూసుకుపోగల శక్తి వుంది. వొకవేళ పాల్కాన్ గనక శత్రువుని అందుకోలేకపోతే, దాని బాణం తప్పకుండా అందుకుంటుంది.

ఒకవేళ యెవరేనా దొంగ పెట్టె మూత తియ్యడానికి ప్రయత్నించవచ్చు కదా. అందుకని మూత లోపల భాగంలో భయంకరమైన, రెక్కలున్న గ్రిఫిన్ బొమ్మ వుంది. దాని ముక్కు ఉక్కుది. దాన్ని చూడగానే దొంగ ఠకామని మూత మూసేసి పలాయనం చిత్తగిస్తాడు. లేకపోతే గ్రిఫిన్ తన వాడి గోళ్లతో అతన్ని ఖండ ఖండాలుగా చీల్చేస్తుందని భయం.

యెగోరి పనిలో మునిగిపోయాడు. రోజులు యెలా గడిచాయో తెలీనే లేదు. యెగోరి అఫనాసీ తాతకి కూడా వో కానుక తయారు చేశాడు. ఓకు కొయ్య దిండు పెట్టె, చిన్న పెట్టె అది. యినప బద్దీలు బిగించినటువంటిది. మూత దిండు మాదిరీ చేసినటువంటిది. అంచేత దిండుమీదలాగా దానిమీద తల పెట్టుకోవచ్చు. యెగోరి దానిమీద జంతువుల బొమ్మలని వేటినీ గియ్యలేదు. మరి అఫనాసీ తాత తలే అతని ''సంపదల్ని'' యే గ్రిఫిన్ కూడా కాపాడలేనంత భద్రంగా కాపాడుతుంది.



యెగోరి యిలా తన పనులు చేస్తూ వుంటే, మాషా అన్ని రోజులూ తన కట్నం కానుకల్ని తయారు చేసుకుంటోంది. భర్తకి, బిడ్డలకి చొక్కాలు కుట్టడానికి గాను తెల్లని వస్త్రాన్ని అల్లింది. లేసులు కుట్టిన బోలెడు తువ్వాళ్లని నేసింది. రోజు వారీ వాడకానికీ వుంటాయి, అలంకారం గానూ వుంటాయి అవి. పెద్ద టేబిల్ క్లాత్‌ని పువ్వుల బొమ్మల తోనూ, కోడిపుంజు బొమ్మలతోనూ అల్లింది. వాటిని వొక దానిమీద వొకటి పెళ్లి అప్పుడు భోజనాల బల్లమీద పరుస్తారు. వొకొక్క వడ్డన అయ్యే కొద్దీ వొక్కొక్క దాన్ని తీసేస్తారు. వచ్చిన చుట్టాలు పెళ్లికూతురు యేం బాగా అల్లిక పని చేసిందీ అని మెచ్చుకుంటారు.

యిప్పుడు ఆమె చెయ్యవలసినదల్లా యెగోరి పెళ్లి చొక్కాకి మెరుగులు దిద్దడమే. అది అలాంటి యిలాంటిదా! చక్రవర్తులకి దీటైంది! ఆ మెడ పట్టీలకి, అంచులకి, ఛాతీకి వున్న అద్భుతమైన అల్లిక పనివాడితనంతో అది యెలా వుంటుందనుకున్నారు పెళ్లికొడుక్కి? యెందుకూ పనికి రాని బుద్ధావతారం కూడా అది తొడుక్కుంటే మహారాజులాగా వుంటాడు. యిక యెగోరి సంగతి చెప్పాల్నా?

అకులీనా అమ్మమ్మ, యిరుగుపొరుగు అమ్మలక్కలు పెళ్లి విందు తయారు చెయ్యడం పనిలో తీరికలేకుండా వున్నారు. నవకాయ పిండివంటలూ వుండాలని వాళ్లు తాపత్రయ పడుతున్నారు. అఫనాసీ తాత గోళ్లు గిల్లుకుంటూ కూర్చున్నాడా యేమిటి? లేదు గాక లేదు. తన సాహసవంతుడైన నేస్తం మిహయీల్ తాతని పెళ్లి పెద్దగా వుండమని ఒప్పించే పని ఆయనకి పడింది. ఆ ముసలాయనకి దివ్యశక్తులేవో వున్నాయని అందరి నమ్మకమూనూ. దుష్ట శక్తులూ గిష్టశక్తులూ యేవీ దాపులకి రావట. అలాంటివేమీ రాకుండా వుండేం దుకు పెళ్లికి అలాంటి మనిషి ఒకడు అవసరమే మరి.

యెట్టకేలకి పెళ్లి రోజు దగ్గర పడింది. ఫిబ్రవరి నెలలో యెముకలు కొరికే చలి రోజు. ఆఖరి శనివారం. పెళ్లికి ముందు రోజు. ఆ వేళ మాష ప్రాణ స్నేహితురాళ్లు 'కన్యాన్విత సౌందర్యం' వేడి వేడి ఆవిరిలో కడిగి శుద్ధిచెయ్యాలని వచ్చేరు. విచారకరమైన పాటలు పాడాలని వచ్చేరు. యెగోరి కూడా ఉల్లాసంగా వుండే తన మిత్రులతో అక్కడికి వచ్చేడు. తనకి కాబోయే భార్యకి అభివాదం చేశాడు. తను సొగసుగా తయారు చేసిన కాను కల్ని ఆమెకి అందించేడు. ఆమె స్నేహితురాళ్లకి తినుబండారాల్ని, తీపి మిఠాయిల్నీ యిచ్చేడు.

ఆ ఆడపిల్లలు ముచ్చటైన ఆ పెట్టెల్ని చూసేరు. తీపి మిఠాయిల్నీ తినుబండారాల్నీ సొంతం మరిచే పోయారు. సంతోషంతో అరుస్తూ యెగోరిని ఆకాశానికి యెత్తేశారు. మాష అతనంటే గర్వపడింది. తను తన వంతు కానుకగా అతనికి చొక్కా యిచ్చింది. అప్పుడు అబ్బాయిలందరూ మూగేరు. యేం కానుక అన్చెప్పి కళ్లు ఓహో అంటూ తిప్పేరు. యెగోరి సంతోషంతో సిగ్గు పడిపోయేడు.

నడవలో తలుపు ధనామని తెరుచుకుంది. అఫనాసీ తాత చలిలోనుంచి లోపలికి వచ్చేడు.

''రండి రండి అమ్మాయిలూ, తెల్లని చేతులు పుచ్చుకుని పెళ్లికూతుర్ని నడిపించుకు రండి. స్నానాల గదిలోకి తీసికెళ్లండి. వేడిగా వుండేటట్టు మంట యెగసన దోశాను.''

అమ్మాయిలు మాష చుట్టూ గుమికూడేరు. ఆమెని నడిపించుకెడుతూ భోరుమ

న్నారు. ఆమె వొక విచారకరమైన పాట పాడింది. అది ఆచారం.

సబ్బు నీటి స్నానం కోసం తీసికెళ్లారు నన్ను
వున్న మూడు సన్నని దారులగుండా, అయ్యో!

అబ్బాయిలు హుషారుగా వీధిలోకి పరిగెత్తారు. మోకాలి లోతు మంచులో పొలోమంటూ కేకలు వేస్తూ స్నానాల గది దగ్గరికి వెళ్లేరు. వాళ్లూ స్నానాలు చేస్తారు. కాని చాలా ఉత్సాహంగా, విచారంగా కాదు.

స్నానం అయాక పెళ్లికూతుర్ని యెత్తైన దిండ్లమీద కూచోబెట్టి ఆమె తల దువ్వారు.

"యేం? నువ్వు యేడవడం లేదేం?" అని ఆమె ప్రాణస్నేహితురాలు దున్యాష అడిగింది.

"యేడవాలని లేదు. ప్రయత్నించినా కళ్లమ్మట నీళ్లు తిరగడం లేదు" అని మాష గొణిగింది.

"వుహుఁ లాభం లేదు. నువ్వు పెళ్లికి ముందు యేడవాలి. నీ కళ్లల్లో ఉల్లిపాయ పిండుతానుండు."



మాట అనడం యేమిటి అలా చెయ్యడం యేమిటి పెళ్లికూతురు ఉల్లిపాయ కన్నీళ్లు కారుస్తూ దిండ్లమీద కూచుంది. కాని అవేం కన్నీళ్లు? తల్లి కన్నీళ్లయితే వరదలా పారతాయి. పెళ్లాం కన్నీళ్లయితే గలగల జారతాయి. పెళ్లికూతురి కన్నీళ్లయితే మంచులా కురుస్తాయి. యెండ కాస్తే యీ మంచు నీళ్లు యెండిపోతాయి.

కాని ఆ రోజు పొద్దుట వాళ్ల నాన్న సమాధి దగ్గర ఆమె నిజంగా యేడ్చింది.

పెళ్లి తంతుకి తయారవుతూ ఆడపిల్లలు విచారకరమైన పాటలు పాడేరు. మాషకి పొడుగాటి తెల్లని పెళ్లి కమీజు తొడిగారు. దాని ముందు భాగంమీద చేతులమీదా బుటేదారి అల్లిక వున్నాయి. దానిపైన యెర్రటి నిండైన సరఫాన్ వేశారు. సరఫాన్లని నదురైన రంగుల పువ్వుల గుడ్డతో చేశారు. సరఫాన్ లోపల కనిపించకుండా వున్న జేబుల్లో వాళ్లు కేక్ ముక్క, పత్తి పెట్టారు, అది ఆరోగ్యం కోసం, ఐశ్వర్యం కోసం, ఆనందం కోసం ఉద్దేశించినటువంటిది.

వీధిలో ఉత్సాహంగా చిరుగంటలు గణగణ మోగడం వినిపించింది. పెళ్లి వూరేగింపు అందంగా అలంకరించిన అయిదు స్లెడ్జి బళ్లల్లో ముంగిట కనిపించింది. రాగి ముస్తీబు ధగధగ మెరిసింది. యేడికోళ్లకి రంగుల రిబ్బన్లు కట్టేరు. చిన్న మువ్వలు కట్టేరు.

హుషారుగా వున్న జనం బళ్ళు దిగి, యింట్లోకి వచ్చేరు. వాళ్ళని పెళ్లి పెద్ద మిహయీల్ తాత యధావిధిగా లోపలికి తీసికెళ్ళాడు. మిహయీల్ తాత నడుముకి బుటేదారి అల్లిన తువ్వాలు కట్టుకున్నాడు. ఆయన్ని అనుసరించి పెళ్లికొడుకూ, చుట్టాలూ వెళ్లేరు. అందరూ వొంగి పెళ్లికూతురికి వందనం చేశారు. అప్పుడు యెగోరి అఫనాసీ తాతకి దిండు పెట్టెని యిచ్చేడు. అఫనాసీ తాత అతనికి పవిత్ర కన్య బొమ్మ యిచ్చేడు. అప్పుడు బల్ల దగ్గర చేరి కాసేపు మాట్లాడుకున్నారు. తర్వాత అకులీనా అమ్మమ్మ నుంచుని ''చుట్టాల్లారా, పెళ్లికూతురి తల దువ్వనివ్వండి'' అంది.


అమ్మాయిలందరూ పెళ్లికూతురి చుట్టూ మూగేరు. పెళ్లికొడుక్కి ఆమె కనిపించకుండా వుండేటట్టు మూగేరు. పెళ్లికూతురి జుట్టు విరబోశారు. రెండు జడలుగా అల్లేరు. పెళ్లయిన వాళ్ళు అలా అల్లుకుంటారు. పెళ్లి పెద్ద రెండు పెద్ద మెలి తిరిగిన కొవ్వొత్తుల్ని వెలిగించమన్నాడు. స్లెడ్జి బళ్ళు యెక్కమన్నాడు. యెగోరి అతని మిత్రులూ గుర్రాలమీద చర్చికి వెళ్లాలి.

బోలెడు కోలాహలం కలకలం తర్వాత అందరూ యెవరి చోటుల్లో వాళ్ళు సర్దుకున్నాక సద్దు మణిగింది. పెళ్లి పెద్ద యధావిధిగా మూడుసార్లు వూరేగింపు చుట్టూతా ప్రదక్షిణం చేశాడు. పెళ్లి నిర్విఘ్నంగా జరగాలని మంత్రాలు చదివేడు.

''జయం, సాహసుడైన గియోర్గి! శ్వేతాశ్వం అధిరోహించు. బారైన బల్లెం అందుకో. నన్నూ, నా మొత్తం పరివారాన్నీ పరివేష్టించిరా. నింగిని నేలని కలుపుతూ శిలా శ్వేత కుడ్యం నిర్మించు. మోహ పిశాచం, క్రోధ పిశాచం, శాప పిశాచం, త్రిదంష్ట్ర పిశాచం, ఏకాక్షి పిశాచం — వీటన్నిటి బారినుంచీ మమ్మల్ని కాపాడు. అవి మా మీదకి లంఘించకుండా కాపాడు. అవి నోళ్ళు తెరవకుండా, అపనిందలు వెయ్యకుండా, పెళ్లిని చెడగొట్టకుండా మమ్మల్ని కాపాడు.''

ఆ తర్వాత సంతోషంగా వూరేగింపు నిర్భయంగా సాగింది. సాహసుడైన గియోర్గి రక్షణతో సాగింది. చిన్న కొయ్య చర్చికి వెళ్లింది. అలంకరించిన పెట్టెల్లో బుటాలు వేసిన టేబిల్ క్లాత్ అంచులు గాలికి రెపరెపలాడుతూ వుంటే సాగింది. పెళ్లికూతురు యెలాంటి చక్కటి కట్నం కానుకలు తయారు చేసిందో అందరూ చూశారు.

పెళ్లయాక మూడుగుర్రాల స్లెడ్జిలు యెగోరి యింటికి వెళ్లాయి. అక్కడ విందు జరుగుతుంది. అందరూ హుషారైన పాటలు పాడేరు. చీకూ చింతా వదిలి బీరూ సారా తాగే సమయమది.



విందుభోజనాల బల్లదగ్గర కోలాహలంగా వుంది. యెగోరి, మాష సిగ్గుపడుతూ నేలకేసి చూస్తూ బల్లదగ్గర కూర్చున్నారు. యేమీ తినడంలేదు, యేమీ తాగడం లేదు. అలా వుండడం ఆచారం. విందులో మూడవసారి వడ్డన జరిగే సమయానికి పెళ్లి పెద్ద పడుచు జంటని పడక కోసం గడ్డి అటక దగ్గరికి తీసుకెళ్లమని పురమాయించేడు. విందు రాత్రి బాగా పొద్దుపోయే దాకా జరిగింది. కొవ్వొత్తులు తెల్లవార్లూ కాలుతూనే వున్నాయి.

పసిడి రెక్కలు విసిరి కాలం గడిచింది. యేళ్లు గడిచాయి. ఆ దంపతులకి యిద్దరు కూతుళ్లు పుట్టేరు. యెగోరికీ, మాషకీ మంచి వాళ్లందరికీ లభించే సుఖశాంతులు కలిగాయి.





రెండవ ప్రకరణం

మంచి నడి వేసవికాలం. బార్లీ చేలు సూదుల్లాంటి కాడలతో వున్నాయి. రై కంకులు తాలు కాకుండా గట్టి గింజలతో నిండుగా వున్నాయి. పొలాలన్నీ కరిగించిన బంగారం పోత పోసినట్టు వున్నాయి. ఆ రై ధాన్యం పొలాల మధ్య నీలం రంగు పువ్వులు తమ కళ్లని గీటుతున్నాయి. తాజాగా చేలు పక్వానికి వొచ్చిన వాసన పొలాలమీద కమ్ముకుంది. యీ సౌందర్యాన్ని కోసెయ్యడం సిగ్గుచేటు. కాని పంట కోతకాలం అయింది. లేకపోతే వానో వంగడో మొత్తం దీన్ని ధ్వంసం చెయ్యవచ్చు.

ఓ రోజున తెల్లవారుతూనే ఆడవాళ్లు తలలకి తెల్లని రుమాళ్లు కట్టుకున్నారు. కొడవళ్లు చేత పట్టుకున్నారు. పొలాల్లో కోత మొదలుపెట్టారు. మొదటి పనలు చిన్న గుడారాల్లా కనిపించేయి. కోతలు అయిన తర్వాత పిల్లలు వెళ్లి నేలమీద పడ్డ కంకుల్ని యేరారు.

యెండ తాపంతో చెమటలు కారిపోతున్నాయి, కళ్లల్లోకి జారిపోతున్నాయి. వాళ్ల వెన్నెముకలు కర్రల్లాగా బిగిసాయి. నడుం వాల్చే వ్యవధి లేదు. సాయంత్రానికల్లా కోతలు పూర్తవాలి. తమ మళ్లల్లో పనులు పూర్తి చేసుకున్నవాళ్లు పొరుగు వాళ్లకి సాయం చేశారు. సాయంత్రం వేళకి పొలాలన్నీ పనలతో నిండిపోయాయి.

ఆడవాళ్లు నడుములు విరుచుకున్నారు. కొడవళ్లు గడ్డితో తుడుచుకున్నారు. కోతలు పూర్తయిన చేలో పరమానందంగా యెగిరి గెంతేరు.

''నాప చేనూ! నాప చేనూ! నాకు శక్తిని తిరిగి యివ్వు. నార తీసి, పంట మార్చి, యేడు మూరలు బారునేయగ'' అంటూ పాడతారు.

అకులీనా అమ్మమ్మ మొదటి పనని యింట్లోకి తీసికెళ్లింది. ''పంట తొలి పన యింటి కొచ్చెను; నల్లులూ, బొద్దింకలూ తొలగిపొండిహ'' అంటూ కటువుగా అరిచింది.

మర్నాడు యెగోరికి బయట నవ్వులూ, కేకలూ వినిపించాయి. అతను దిడ్డి తలుపు తీశాడు. అక్కడ గుంపుగా వున్న జనం వొక వలయంగా యేర్పడ్డారు. వొక పరాయి మనిషి చుట్టూ కూడేరు. అతను యెర్ర చొక్కా తొడుక్కున్నాడు. నాట్యం చేస్తున్నాడు. తంబూరా మీటుతూ గట్టిగా అరుస్తున్నాడు.



''రండి రండి చూడండి! మొహమాటం వద్దులెండి! యేమేం కావాలి మీకు? జనులారా రండి, రండి! పూసలున్నవి, జడ కుచ్చులున్నవి! నాకు మిక్కిలి యెక్కువ'' అని అరుస్తున్నాడు.

''యేవో అమ్మకానికి వచ్చేయి!'' అని మాష కేకపెట్టి దిడ్డి తలుపు దాటి దూసుకు వెళ్లింది. ఆమె వెనకాలే అమ్మమ్మా, వాళ్ల పిల్లలూ వెళ్లారు. యెగోరి కూడా వో సారి చూద్దామనుకున్నాడు. ఆ ప్రాంతానికి యెప్పుడో గాని సరుకులమ్మేవాళ్లు రారు.

జేగురు రంగు జుట్టు వున్న ఆ అమ్మే మనిషి తన దగ్గరున్న నానా రకాల వస్తువుల్నీ బయటికి తీసి పేర్చాడు. జనాన్ని వచ్చి కొనమని పురిపెడుతున్నాడు.

''చేపా, మాంసం మొహం మొత్తిస్తే యివిగో పంచదార చిలకలు! ఒక్కటి కొరికి తియ్యండి కునుకు. యింకా తినండి నిద్రయ్యాక!''

జనం నవ్వి అతను పరిచిన వస్తువుల్ని చూసేరు. ఆడపిల్లలు పూసలు, ఉంగరాలు, రుమాళ్ళు చూశేరు. మగాళ్లు బూట్లు చూశారు.

కొంతమంది వస్తువుల్ని డబ్బు పెట్టికొన్నారు. కొందరు వరకో యెన్నో యెండిన పుట్టగొడుగులు చెల్లించేరు. యేమిచ్చినా ఆ అమ్మేమనిషి తీసుకున్నాడు. ఉల్లిపాయలు కూడా. అవి దూర ప్రయాణంలో పనికొస్తాయి.

''బొబ్బలకీ, దెబ్బలకీ సూదులు. దారం బండి పెట్టిన కండి. చెవి పోగుల గొర్రె. ముసలాయనపుర్రె.''

''పనివాడితనంగా వుండే మయ్యెరలున్నాయా నీ దగ్గర?'' అని యెగోరి మెల్లిగా అడిగాడు.

''యెందుకవి నీకు? బొమ్మలకి రంగులు వేస్తావా? యేవీ చూపించు. బాగుంటే కొన్నింటిని సంతకి తీసుకెడతాం.''

యెగోరి అతన్ని యింట్లోకి తీసికెళ్లాడు. అన్నిట్నీ చూపించేడు. రంగులతో షోకు చేసిన కదురుల్నీ, చెక్కిన పాత్రల్నీ, చందుకం పెట్టెల్నీ, రంగులు పూసిన కొయ్య పెట్టెల్నీ చూపించేడు. ఆ మనిషి అన్నిట్నీ చెయ్యి తిరిగిన పనివాడిలా పరీక్షించి ఆశ్చర్యపోయేడు.

''యింతటి పనివాడితనం నేను యెన్నడూ చూడలేదు నాయనా! యిలా వూరూ పేరూ లేని చోట నువ్వు దాంకోవడం పాపం. నువ్వు రాజధానీ నగరానికి వెళ్లి చక్రవర్తికోసం పని చెయ్యాలి. మాస్కోలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం గురించి విన్నావు కదా? జ్వాలలు ఆకాశాన్ని తాకేయి. శిఖరంమీద వున్న గంటలు నేలకూలాయి. దేశం నలుమూలలనుంచీ నిపుణుల్ని పిలిపిస్తున్నారు. మళ్లీ నగరాన్ని పునర్ నిర్మించడానికి, యింతకుముందున్న దానికంటే శోభాయమానంగా నిర్మిస్తారట'' అని చెప్పాడు.

''ఆఁ, బస్తీ పనివాళ్లతో పోలిస్తే నేనెంత నా పనెంత? తుక్కు, ఉఫ్మని యెగిరిపోతా'' అన్నాడు యెగోరి. మనిషి యిబ్బంది పడిపోయాడు.

''మాస్కోలో కొంతమంది సిద్ధహస్తులు వున్న మాట నిజమే ననుకో. అలాంటి వాళ్ళు మరి యెక్కడా దొరకరు. వాళ్ల దగ్గర శిష్యరికం చేసి నేర్చుకో యేడాదో రెండేళ్లో. అప్పుడు నీ తుక్కు అంతా వొదిలిపోతుంది. నిన్ను వో చక్కని పనివాడి దగ్గరికి తీసికెడతా. ఆయన పేరు పెద్ద నికొదీమ్. ఆయన ఘనుడైన డయోనీసియస్ శిష్యుడు. దేవుడు దయతలిస్తే ఆయన నీకూ బోధిస్తాడు.''

 అతను యెగోరిని బలవంతం చేస్తూనే వున్నాడు. ఆఖరికి అకులీనా అమ్మమ్మ భరించ

లేకపోయింది. పిల్లలకోడి యీకలు ఝాడించినట్టుగా రేగిపోయింది. ఆ అమ్మేమనిషిమీద విరుచుకు పడిపోయింది.

''యేమిటి నాయనా మూర్ఖంగా నువ్వు చేస్తున్న పని? మాకేదో నాలుగు వేళ్ళా లోపలికి వెడుతున్నాయంటే వీడివల్లే. అది కాస్తా వూడపీకేద్దామనా? వాడెక్కడికీ రాడు. యెందుకు రావాలి? వాడికో కొంపా గోడూ పిల్లా జెల్లా అంతా వుంటే? నీకు మల్లే అనుకున్నావా? గాలిగుడ్డులా కొట్టుకుపోవడానికి?''

యిలా బాగా చీవాట్లు పెట్టింది. కాని ఆ రాత్రి వుండడానికి మాత్రం చోటు యిచ్చింది. ఆ పూటంతా మాష వొక్క ముక్క కూడా అనలేదు. యెగోరి కేసి దిగాలుగా చూసింది అంతే.



యెగోరి రాత్రంతా గడ్డి పరుపుమీద దొర్లాడు; అటు తిరిగాడు, యిటు తిరిగాడు. అతను మాస్కోలో తయారైన దేవతల బొమ్మల్ని చర్చిలో చూశేడు. తను అంత బాగా చెయ్యలేకపోయానే అని బాధపడేవాడు.

మర్నాడు పొద్దుట రొట్టె, పాలూ నాస్తా అయాక యెగోరి నుంచుని మాట్లాడేడు.

''అమ్మమ్మా, మాష, నా పాపలూ! మరేం అనుకోకండి. నేను మాస్కోకి వెళ్లాలని నిర్ణయించుకున్నాను. యీ చెంచాలూ, పెట్టెలూ తయారుచెయ్యడం నాకు తృప్తిగా లేదు. నాలో యేదో వేరే శక్తి వుంది. దేవతా చిత్రాల్ని యెలా రంగులు పూసి తయారు చెయ్యాలో నేర్చుకోవాలని వుంది.''

పాపం ఆ ఆడవాళ్ళు హుస్సురని యేడ్చారు. కాని లాభం లేకపోయింది. యెగోరి నిర్ణయంచేసుకున్నాడు.

ఆ అమ్మే మనిషి నవ్వేడు. గబగబా తయారవమని యెగోరిని తొందరపెట్టాడు.

''బాధపడకు నాయనా, ఆడాళ్లతో యెప్పుడూ యింతే. వాళ్ల కళ్లమ్మట నీళ్లు రాల కుండా వొక్క పనీ జరగదులే.''

అతని నాపసాలో కొత్త చొక్కానీ, రొట్టెనీ, కొన్ని దోసకాయల్నీ, ఉడకేసిన కోడి గుడ్లనీ పెట్టారు. యెగోరి వాళ్ల దగ్గర సెలవు తీసుకున్నాడు.

వాళ్ళు దుమ్ముకొట్టుకుపోయిన బాటలమీద నడిచారు. కొయ్య కాళ్ల పొలాలు దాటు కుంటూ వెళ్లేరు. యెత్తుగా పెరిగిన నీలం గడ్డిమీద నడిచి వెళ్లేరు. స్ఫటికంలాంటి నదుల్ని దాటి వెళ్లేరు.

మాస్కో దగ్గర పడే కొద్దీ జనం యింకా యెక్కువగా వాళ్లకి తగిలేరు. కొంతమంది



తమ వస్తువుల్ని అమ్ముకోవడానికి వెడుతున్నారు. కొంతమంది కొనడానికి వెడుతున్నారు. కొంతమంది తమ భాగ్య రేఖని వెతుక్కుంటూ వెడుతున్నారు.

సరిగ్గా మాస్కో శివారులో వాళ్లు ఆగేరు. ఆ రాత్రి నదీ తీరంలో గడపాలని అనుకు న్నారు. గస్తీ మనుషులు రాత్రి పూట మనుషుల్ని నగరంలోకి వెళ్లనివ్వరు. ఆ అమ్మే మనిషీ, యెగోరి నెగడు వేసుకున్నారు. యెగోరి పడుకుని, మౌనంగా నల్లని ఆకాశం కేసి చూస్తూ వున్నాడు. ఆ మహా నగరం అతనికి భయం భయంగా వుంది. తెల్లవారకట్ల మాస్కో నగరం వున్న కొండకేసి చూశేడు. అతని హృదయం సంతోషంతో రెపరెలాడింది. అంద మైన నగరం. రాజసం వుట్టిపడే నగరం. అరుణోదయ కాంతిలో ఆ మహా నగరపు బంగారు బురుజులు మెరిసిపోతున్నాయి. తెల్లటి చర్చి గోపురాలు అరుణ మేఘ పంక్తిని తాకుతున్నాయి. ఆ నగరం చుట్టూతా యెత్తైన కోటగోడ వుంది. కూచి శిఖరాలు ఆ గోడమీద వున్నాయి.

మాస్కో నదిమీద పెద్దకొయ్య వంతెన వుంది. అది బళ్ల చక్రాల చప్పుడుకి ధనధన మంటోంది. వాళ్లు ఆ వంతెన దాటి వెళ్లారు. తీరంలో వందలాది చిన్న పడవలున్నాయి. బస్తాలూ, పీపాలూ ఆ పడవలకి యెత్తివున్నాయి. నది వొడ్డున యెంతమంది జనం గుమికూడి వున్నారో లెక్కలేదు. కాలినడకన వెళ్లేవాళ్లు, గుర్రాలమీద స్వారీ చేసేవాళ్లు, బళ్లల్లో ప్రయాణించేవాళ్లు — లెక్కలేదు. అంత సమూహాన్ని యెగోరి చూసి యెరగడు. అరుపులతో, కేకలలో, యీలలతో కొరడాకోలల శబ్దాలతో, గుర్రాల సకిలింపులతో నానా రభసగానూ వుంది. చేపల్ని కాల్చే పాకల్లోనుంచి ఘాటు వాసన వస్తోంది. తమ తమ వస్తువుల్ని అమ్ము కుందుకు వర్తకులు పోటాపోటీలమీద అరుస్తున్నారు. వాళ్ల దగ్గర అమ్మకాలకి యెన్ని వస్తువులున్నాయో చెప్పలేం.

''యిక్కడే వుండు వో క్షణం. ధర యెంతో కనుక్కుంటూ'' అన్నాడా అమ్మేమనిషి. గుంపులో మాయమైపోయాడు.

యెగోరి పక్కకి వెళ్లి నగర శిలాకుడ్యం వార నుంచున్నాడు. దగ్గర్లోనే ఓ కుర్రాడు ఉన్నాడు. అతనికి గడ్డం లేదు. బాగా పుష్టిగా వున్నాడు. హుషారుగా వున్నాడు. అతని చుట్టూ దేవతా బొమ్మలు పరిచి వున్నాయి. ''వో సారి చూద్దాం'' అనుకున్నాడు యెగోరి. యెక్క ణ్ణుంచి వూడిపడ్డాడో యింతట్లోనే వో ముసలాడు ప్రత్యక్ష మయ్యేడు. అతని జుట్టు ముగ్గు బుట్టలా వుంది. అతను చిన్నగా వున్నాడు. ముడతలు పడిపోయి వున్నాడు. చాలా శుష్కించి పోయి వున్నాడు. అతను వో దేవతా బొమ్మని తీసి చూశేడు. తర్వాత యింకోదాన్ని, మూడో

దాన్ని, తీసి చూశేడు. ఆ బొమ్మలకి రంగులు వేసిన కుర్రాణ్ణి తిట్టిపొయ్యడం మొదలు పెట్టాడు.

''నువ్వు పాషండుడా! తుచ్ఛుడా! ఏసు ప్రభువునీ, మేరీ మాతనీ యిలానేనా తయారు చెయ్యడం? కాళ్లూ, చేతులూ లేకుండా? మొండెం తలా మాత్రమే వున్నాయి? కళ్లేవి, నోరేది? వాటి బదులు చుక్కలు పెట్టావ్? అలాంటి మనిషి నెవణ్ణేనా చూస్తే భయంతో బిగిసి చస్తావు!''

''మీకిష్టం లేకపోతే మానెయ్యండి. వేరేవాళ్లు తీసుకుంటారు'' అని ఆ కుర్రాడు నవ్వేడు.

''ఆc, తీసుకుంటారు. యిలాంటి చెత్త బొమ్మలతో యిళ్లు అపవిత్రం చేసుకుంటారు'' అన్నాడా ముసలాయన కోపంగా.

''చేసుకోనివ్వండి! మా జీవనాధారం జరిగిపోతుంది. మా కడుపులకింత తిండి దొరుకుతుంది'' అన్నాడా కుర్రాడు.

''మీ పొట్టకి తిండి కావాలంటే వేరే వృత్తులు వున్నాయి. అడ్డమైన వాడూ దేవుళ్ల బొమ్మల్ని తయారు చెయ్యలేడు. నీ సామాన్లు మూటగట్టి నీ దారిన నువ్వు పో.''

దాంతోటి ఆ కుర్రాడికి రేగింది. నుంచుని ముసలాయన నెరిసిన గడ్డం దొరక పుచ్చుకుని కోపంతో గుంజడం మొదలుపెట్టాడు.

యెగోరికి కోపం వచ్చింది. ముసలాయనమీద చెయ్యి చేసుకోవడమా? ఆ నీచుణ్ణి గట్టిగా కుదిపేశాడు. అతని పళ్లు వజవజ వొణికాయి. ''వదులా ముసలాయన్ని లేకపోతే తడాఖా చూపిస్తాను. నీ తల తిరిగిపోవాలంతే'' అన్నాడు.

''యిదో కుట్ర. యిద్దరు కలిసి నామీద పడడం'' అని ఆ కుర్రాడు లబోదిబోమన్నాడు. కాని గబగబా సామాను సర్దుకుని బిచాణా యెత్తేశాడు.

ముసలాయన నవ్వి, గడ్డం నిమురుకున్నాడు.

''నన్ను వూపేశాడు, వెధవ! మనిషి దిట్టంగా వున్నాడు. బుర్ర తక్కువ, పోన్లే. చెట్లు కొట్టుకోవాలి అలాంటివాడు దేవుళ్ల బొమ్మలకి రంగు వెయ్యకూడదు. పోన్లే నాయనా వాడి పీడా వదిలించావు. యింతకీ యెవరు నువ్వు?''

''మాది పల్లెటూరు, తాతా. నన్ను యెగోరి అంటారు.''

 ''మాస్కో యెందుకు వచ్చావ్? పనిమీదా? సరదా కోసమా?''

''దేవుళ్ల బొమ్మలకి రంగులు వెయ్యడం నేర్చుకోవాలనుకుంటున్నాను. పెద్ద నికొదీమ్ కోసం చూస్తున్నాను. ఆయన గురించి విన్నావా నువ్వు?''

''విన్నాననే చెప్పాలి మరి! పరమ భయంకరమైన ముసలాడు. నాలిక ఆకురాయి. కఠిన హృదయుడు. మనసు రాయి. తన దగ్గర పని నేర్చుకొనేవాళ్లని ముప్పతిప్పలు పెడతాడు. సరిగా పని చెయ్యకపోతే సింహంలాగా గర్జిస్తాడు. చెవులు మెలిపెడతాడు.''

''దెయ్యం!'' అన్నాడు యెగోరి.

''ఆఁ, అంతే మరి! యెవరేనా అన్నవేళకి పనిచెయ్యకపోతే ఆ ముసలాయన వాణ్ణి రెండుగా విరిచేస్తాడు. ముళ్లు వేసేస్తాడు. ఉంగుచుట్టి నదిలో పారేస్తాడు. అలాంటి వాడి దగ్గరికి వెడతావా?''

''వూఁ వెడతాను. నరకంలో మనుషులుండడం లేదా? యేదో నెట్టుకొచ్చేస్తాను. నన్ను పనిలోకి తీసుకోవాలంతే'' అన్నాడు యెగోరి.

''వూఁ, సరే అయితే, నేనే ఆ నికొదీమ్‌ని. మెరుపు మెరిస్తే పిట్టలు నోళ్లు తెరిచినట్టుగా నాకేసి అలా చూస్తున్నావేం? నన్ను చూస్తేనే నీకు వొణుకు పుడుతోంది యేం?'' అని ఆ ముసలాడు నవ్వడం మొదలుపెట్టాడు.

''సోమరిపోతు చవట పనివాళ్లంటే యేం చెప్పానో జాగ్రత్తగా గుర్తుపెట్టుకో. అలాంటి వాళ్లంటే నాకు యిష్టం వుండదు. నువ్వు గనక గట్టిగా కృషి చేస్తే నీకు మెలకువలన్నీ నేర్పుతాను. నేనేం నా రహస్యాలని నాతోబాటు సమాధిలోకి తీసుకుపోవాలనుకోవడం లేదు.''

గణగణమని మాస్కో శిఖరఘంట గట్టిగా మోగింది. ప్రతిధ్వనించింది. నగరంమీద అలల్లాగా జారింది. అనేక చిరుగంటల మోత ఉల్లాసంగా అన్నివేపులా బదులు పల్కింది. నగరం నాదంతో పులకరించింది. ఆఁ అని ఆశ్చర్యపోయేటట్టు వుందది.

ఆ ముసలాయన కళ్లు సంతోషంతో ముడిచాడు. యెగోరి మైమర్చిపోయి పైకి చూశాడు, శబ్దాలని చూడ ప్రయత్నిస్తున్నాడా అన్నట్టు.

''బాగుంది, రా, యెగోరి. యీ స్వర్గ సంగీతాన్ని రోజంతా వింటూనే వుండవచ్చు నువ్వు. మధుర కంఠస్వరం వున్న సీరిన్ పక్షి పాటని విన్నట్టుగా. గురువుగారు డయోనీసియస్ చేసిన దేవతా బొమ్మని చూపిస్తాను. అది చూస్తూ వుంటే కనులవిందుగా వుంటుంది. నా హృదయం ఉత్తేజితమవుతుంది. మాస్కో అగ్నిప్రమాదానికి ఆహుతి అయినప్పుడు ఆ దుఃఖంతో నేను చచ్చిపోతానేమో అనుకున్నాను. యెంత సౌందర్యం బుగ్గి

పాలైంది! అసలు అంత సౌందర్యం అనేది వుందని కూడా మాస్కోలో యెవడూ నమ్మడు. యీ నలుసు బయట పడడమే ఆశ్చర్యం!''

వాళ్ళు ఎస్సంప్షన్ కాథెడ్రల్ దగ్గరికి నడిచి వెళ్ళారు. పాత రష్యన్ జానపద గాథల్లోని రష్యన్ యోధుల్లాగా గర్వంగా దర్పంగా వుంది అది. సింహద్వారం దగ్గర నల్లని ఉడుపు వేసుకుని ఒక యువసన్యాసి నుంచుని వున్నాడు.

''మరీ పెందరాళే వచ్చారు, కొంచెం ఆగి రండి'' అన్నాడు.

''నేను జార్‌గారి కొలువులో వుండే చిత్రకారుణ్ణి. యితను నా ఉమేదువారు'' అన్నాడు నికొదీమ్ కటువుగా.

ఆ సన్యాసి నమస్కారం చేసి పక్కకి తొలిగాడు.

నిశ్శబ్దంగా వుందా కాథెడ్రల్. చాలా పెద్దది. హుందాగా గంభీరంగా వుంది. యెగోరి పరవశించిపోయాడు. ''భగవంతుడా! నిజంగా యీ సౌందర్యాన్ని మానవ హస్తాలే తయారు చేశాయా? దేవతలు కాదా?'' అనుకున్నాడు.

లోకప్పదాకా గోడలకీ, స్తంభాలకీ గచ్చు వుంది. దానిమీద దేవుళ్ల బొమ్మలు చిత్రించి వున్నాయి. ప్రతిమాస్థానం బంగారు పూతతో, విలువైన చిత్రాలతో శోభాయమానంగా వుంది.

''యిక్కడ వుంది డయోనీసియస్ బొమ్మ'' అని నికొదీమ్ మెల్లిగా అన్నాడు. ''దీన్ని బాగా చూడు. ప్రజలపట్ల ఆయనకి గల మహత్తర ప్రేమనుంచీ, దయా స్వభావం నుంచీ నేర్చుకో. లేకపోతే ఆ సున్నితమైన రంగుల పొహణింపు ఆయనకెలా పట్టుబడు తుంది? రేఖలు యెంత స్ఫుటంగా స్వచ్ఛంగా వున్నాయో మధురగీతం మాదిరీ.... యేం మాట్లాడవ్?'' అతను యెగోరి కేసి చూశాడు. అతను పారవశ్యం అధికమై మాట్లాడ లేకుండా వున్నాడు.

''నువ్వు యేం చెయ్యగలవ్?'' అని ఆ ముసలాయన హెచ్చరికగా అడిగాడు.

''వుహు. యిప్పుడు చూస్తే నాకసలు యేమీ రాదనిపిస్తోంది....''

''బాగుంది నాయనా. యేమీ తెలియని అజ్ఞానులే అన్నీ చెయ్యగలం అనుకుంటారు. సిద్ధహస్తుడైన పనివాడు సరిగా చెయ్యలేనేమోనని యెప్పుడూ భయపడుతూనే వుంటాడు. నేను డయోనీసియస్ గురువుల కోసం పదేళ్లపాటు రంగులు తయారుచేసి యిచ్చాను. వర్తికని చేత్తో తాకలేదు. ముసలితనం వచ్చాకనే చిత్రాలు గీయడం మొదలుపెట్టాను. వూఁ, వెళ్లే వేళ అయింది. బృందం నిరీక్షిస్తోంది'' అంటూ ముసలాయన చిరునవ్వు నవ్వేడు.

వాళ్లు చౌకులోకి వెళ్లేరు. ప్రశాంతంగా వున్న కాథెడ్రల్ చూసి యివతలకి రావడం వల్ల ఆ చౌకు మరింత గోలగా, అల్లరిగా కనిపించింది. యిద్దరు గడ్డం మనుషులు జనాన్ని వినోదింపచెయ్యడం కోసం గొలుసులు కట్టి రెండు యెలుగుబంట్లని తీసుకు వొచ్చేరు. ఎలుగులు అరుస్తున్నాయి, గింజుకుంటున్నాయి. కాని వాటి శిక్షకులు గిలక తప్పెట్లు వాయిస్తూనే వున్నారు. బూరాలు వూదుతూనే వున్నారు. రండి చూడండని జనంకేసి చూసి అరుస్తూనే వున్నారు.

ఎలుగుల వాసనబట్టి గుర్రాలు సకిలిస్తూ వెనకడుగు వేశాయి. వూరేసిన ఆపిల్‌పళ్ల పీపాలని బోర్లపడదోస్తాయి. వర్తకులు బండివాళ్లమీద బండివాళ్లు గుర్రాలమీద కేకలు వేస్తున్నారు. అప్పుడు చక్రవర్తి రక్షక భటులు గుర్రాలమీద వొచ్చేరు. కమ్చీ కోలలతో దూసుకుంటూ జనంలోనుంచి దారిచేసుకువెళ్లారు.

''పల్లెటూరి బతుకు గడిపిన మీదట నీకిదంతా భయం కలిగిస్తోందేమోనే'' అని నికొదీమ్ నవ్వేడు.

వాళ్లు వో పక్క వీధిలోకి తిరిగారు. అక్కడ జనం తక్కువగా వున్నారు. అది గుంటలుగా, యెగుడు దిగుడుగా వుంది. అక్కడా అక్కడా బురద కుంటలమీద కొయ్య పలకల్ని వేశారు. యేమీ లేని చోట బళ్లు బురదలో కూరుకుపోతూ వున్నాయి. అటూ యిటూ కొయ్య గుంజల దళ్లు వున్నాయి. వాటికి మధ్య మధ్య కొయ్య ద్వారాలున్నాయి. అవి గట్టిగా బిడాయించి వున్నాయి. ప్రతి యిల్లూ పొరుగు యింటినుంచి కంచె కట్టి యెడంగా వుంది. ఆ కంచెలు దుర్గాల్లా వున్నాయి. ఉమ్మడిగా వుండే కంచెలు లేవు. సన్నని దారులు మురికి కాలవలు పారేందు కోసం వున్నాయి. అవి ఆ యింటి పెరడుకీ యీ యింటి పెరడుకీ మధ్య వుండడంవల్ల ఉమ్మడి కంచెలు లేకపోయాయి.

''ఆ యిళ్లు చూడండి'' అని యెగోరి అనుకున్నాడు. ''యెంత పొడుగ్గా యిరుగ్గా వున్నాయో. ఆ యిళ్లల్లో చాలినంత చోటు వుండదని పందెం కడతాను. వీటితో పోల్చి చూస్తే మా యిల్లు ఇంద్రభవనమే'' అనుకున్నాడు. అవి కిటికీలు కావు. కప్పు దిగువన మైకాతో కప్పిన చిన్న కంతలు. కంచె దడి లోపల వున్న జాగా గట్టిగా కాస్త గోంగూర పండించుకోవడానికి చాలదు.

''మా ఇంటి ఆయకట్టు పర్రులో మేం యిలా యిరుగుపొరుగువాళ్లనుంచి వేర్పాటుగా కంచెలు కట్టుకోం. యిక్కడ యెంత యిరుగ్గా వుందో'' అన్నాడు యెగోరి సందేహిస్తూ.

''కావచ్చు, జనం యెక్కువే వున్నారు మరి. యిక్కడ యెంతమంది వుంటున్నారో



తెలుసా? రెండు లక్షల పైబడి'' అన్నాడు నికొదీమ్ గొప్పగా.

''ఆఁ, నిజమా! యెంతమందో?'' అన్నాడు యెగోరి.

వాళ్ళు యింకొన్ని మలుపులు తిరిగారు. ఆఖరికి వో కొత్త చర్చి దగ్గర ఆగేరు. దాన్ని కొత్తగా కట్టేరు. అద్భుత కథల్లోని ప్రాసాదంలాగా దాన్ని శోభాయమానంగా చేశారు. గోడలకి తెల్లని రాతి చెక్కడాలున్నాయి. స్తంభాలు వొంపు తిరిగి వున్నాయి. ధగధగలాడి పోతూ వున్న అయిదు నీలం గోపురాలకీ బంగారు నక్షత్రాలున్నాయి.

''మనం దానికి రంగులు వెయ్యబోతున్నాం, అదీ అందం'' అన్నాడు నికొదీమ్ ఆప్యాయంగా.

''ముసలాయన భలేవాడే. భయపెట్టే మనిషి అన్నాడు, అదంతా వొట్టిది'' అనుకున్నాడు యెగోరి.

వాళ్ళు చర్చి ద్వారం దాటి లోపలికి అడుగుపెట్టారో లేదో సాత్వికంగా వున్న ఆ ముసలాయన మారిపోయాడు. అక్కడ బల్లమీద కూచుని నిదానంగా యేదో తింటూ వున్న వాళ్ళని చూసీ చూడగానే గుబురుగా వున్న ఆయన కనుబొమలు ముడుచుకున్నాయి. ఆయన కళ్ళు కోపంగా జ్వలించాయి.

''యేమిటి మీరు చేస్తున్న పని? తుంటరులారా? చర్చిని మీ విందుభోజనాలతో అపవిత్రం చేస్తున్నారా? యిదేమన్నా పూటకూళ్ల యిల్లనుకున్నారా? ప్రభువు మిమ్మల్ని దండిస్తాడు, చూస్తూ వుండండి'' అని తిట్టేడు.

''అదృష్టం బాగుంటే దండన తప్పించుకుంటాం'' అని మిరోన్ యికిలించాడు. అతను కొంటె మనిషి. ''మనిషి పొట్టకి అంతా పరగడుపే, దీన్తగలెయ్య! నింపేదాకా పనిచెయ్యనివ్వదు'' అన్నాడు.

''శరీరానికి ప్రియం అయింది ఆత్మకి చెడ్డది. అంద్రేయ్ రుబ్ల్యోవ్ మయ్యెరలు చేత్తో పట్టుకునే శిలువ గీసుకునేవాడు. నువ్వు మాంసం ముక్కలతో అలా చేస్తున్నావ్. నేనివాళ చౌకులో దేవుళ్ల బొమ్మలు అమ్మేవాణ్ణి వొకణ్ణి చూశాను. స్వర్గదేవతలని తయారు చెయ్యడానికి మారుగా తిండిపోతురాయుళ్ల బొమ్మలు గీశాడు, తనకిలాగా. వాడిమీద పడ్డాను. యెగోరి పుణ్యమా అని వాణ్ణి తరిమేశాం. విను, లుకా. యెగోరిని పుస్తకంలో పూటకూలిగా రాసుకో తర్వాత చూద్దాం'' అన్నాడు.

''పూటకూలి అంటే యేమిటి?'' అని యెగోరి అడిగాడు.

''అంటే నీకు తిండానికింత దొరుకుతుందన్నమాట'' అని బట్టతల లుకా గంభీరంగా

జవాబు చెప్పేడు. ''అదేనా పని వున్నంత కాలం. పని లేదూ తిండీ లేదు. యితన్ని యే పనికని అప్పగించను, నికొదీమ్ బాబా?''

''వూఁ... పల్లెటూరివాడు కాబట్టి చెట్లంటే యిష్టపడతాడు. బొమ్మల చెక్కలు తయారుచేస్తాడు. ఆ వద్దుకింద అతన్ని చేర్చు. మిరోన్, నువ్వతనికి నేర్పు. రండబ్బాయిలూ పని మొదలెడదాం. బాడిస తీసుకో యెగోరి, మూల కొన్ని పలకలు వున్నాయి తీసుకో. సుళ్లులేని వాటిని చూడుస్మా. తెల్లని తెలుపు వొచ్చేదాకా చెక్కు.''

యెగోరి చొక్కా చేతులు మడిచాడు. రెండు చేతులతోనూ బాడిస తీసుకున్నాడు. పైన్ పలకమీద బెరడు మొదటి పార చెక్కాడు. జిగురు వాసన, అడివి వాసన, యింటి వాసన వొచ్చేయి. హాయి అనిపించింది. గొలుసుల ఎలుగులు, జార్‌గారి రక్షక భటులు, జనం, గోల అన్నీ మనసులోనుంచి జారిపోయాయి.

చులకన అయిపోతానేమోననే భయంతో యెగోరి శాయశక్తులా పనిచేశాడు. సాయంత్రం అయేటప్పటికి కొయ్యనంతట్నీ చెక్కేడు.

''యేమిటా తొందర? లోకంలో వున్న పనినంతట్నీ ఒక్కసారే చేసేస్తావా యేమిటి? యేం మేడలు కట్టలేవులే. కడుపు కాలుతుందంతే. కులాసాగా చెయ్యి, బాబూ. పనిని గబ గబా చేసేస్తే మనల్ని త్వరగా బయటికి గెంటేస్తారు. అప్పుడు యెక్కడికి పోతావ్?'' అని మిరోన్ గొణిగాడు.

''కష్టపడి పనిచెయ్యకుండా వుండలేను. యింకా యేముందో చెప్పు.''

''యేయ్, వెర్రి నాగన్నా. సరంజామా కట్టి పక్కన పెట్టు. కాస్త కునుకుతీద్దాం. అంతలా పని చెయ్యాలనిపిస్తే యీ కోసిన కలప పొట్టుని వూడ్చు'' అన్నాడు మిరోన్ నిట్టూరుస్తూ.



యెగోరి చర్చిలో వూడుస్తూ వుంటే మిగిలిన వాళ్లందరూ యిళ్లకి వెళ్లిపోయారు. ఖాళీగా చీకటిగా వున్న చర్చిలో నికొదీమ్ బాబా మాత్రమే మిగిలిపోయాడు. యెగోరి యెవళ్లకంటా పడకుండా వో మూల కూలబడ్డాడు. అతనికి యెక్కడికి వెళ్లడానికీ చోటు లేదు.

ఆ పెద్దాయన వో కొవ్వొత్తిని వెలిగించాడు. ఓ రాతి గోడ వార ఆలోచిస్తూ నిలబడ్డాడు. అలా చాలా సేపు చూస్తూ నిలబడిపోయాడు. వేడి కొవ్వు కరిగి అతని చేతిమీద పడింది. అయినా అతను పట్టించుకోలేదు. వున్నట్టుండి అతను కొవ్వొత్తిని యెత్తి గోడ ముందు వూపేడు, వొక మండే మయ్యెరని వూపినట్టు. యేదో బొమ్మ గీస్తున్నట్టు వూపేడు.

గోడమీద కొవ్వొత్తి అలా వూగినప్పుడు వో చిన్న మంట రెపరెపలాడింది. వో మంత్రకర్మ జరుగుతోంది. యేదో అదృశ్య చిత్రం చీకటిలోనుంచి ఉద్భూతమౌతోంది. ఆ గోడ కొన్ని భాగాలమీద ఆ ముసలాయన శాంతంగా, సాలోచనగా గీశాడు. కొన్నిటిమీద సంతోషంగా మందహాసంతో గీశాడు. అతి పెద్ద భాగం దగ్గరికి వెళ్లేటప్పటికి ఆయనలో మహత్తరమైన మార్పు వొచ్చింది. ఆయన అక్కడ గంభీరంగా, దృఢ మనస్కుడై నుంచున్నాడు. కొవ్వొత్తితో యెవళ్లనో నిర్దాక్షిణ్యంగా కొట్టేడు, అది మెరుపు తీగ అయినట్టుగా.

ఆ రకంగా నికొదీమ్ అన్ని గోడల్నీ చుట్టబెట్టాడు, అగ్నితో గీతలు గీసినట్టు యెక్కువ కొవ్వొత్తులనే వాడేడు. తెల్లవారకట్ల సమయంలో చూసుకోకుండా మసక చీకట్లో యెగోరిని తగిలాడు. పాపం ఆ ముసలాయనికి వొక్క సారి భయం వేసేసింది. కొవ్వొత్తిని జార విడిచేడు.

''భయపడకండి నికొదీమ్ బాబా, నేను'' అన్నాడు యెగోరి బిత్తరపోయి. ''నేనిక్కడ వున్నట్టు మీకు చెప్పలేదు. మరేం అనుకోకండి. మీ పనికి అడ్డం రాకూడదనుకున్నాను'' అన్నాడు.

''అమ్మనాయనోయ్!'' అని ఆ ముసలాయన కోపంగా అరిచాడు. ''నాకెంత భయం వేసిందో, కాళ్లు కుప్పకూలిపోయి వుండేవి. గుడ్లగూబలా దాంకున్నావ్ రాత్రంతా?'' అన్నాడు.

ముసలాళ్లలాగా గొణిగేడు. తర్వాత శాంతించేడు.

''రాత్రంతా ఆ రాతిమీద అలానే కూర్చున్నావా యేమిటి?''

''కాని నాకు అది ఆసక్తిగా వుంది'' అని యెగోరి సంతోషభరితంగా చెప్పాడు.

''నువ్వు నిజంగా కూర్చున్నావా? యీ వార్ధక్యంలో నాకు శిష్యుడు దొరికినట్టుగా వుంది'' అని అలిసిన గొంతుకతో నికొదీమ్ గొణిగాడు. అప్పుడు గోడవార చేరి గాఢంగా నిద్ర పోయాడు. యెగోరి తన రైతు అంగరఖాని విప్పి జాగ్రత్తగా ఆయనమీద కప్పేడు.

యెగోరి తనతోబాటు వుండేందుకుగాను అతన్ని నికొదీమ్ తన యింటికి తీసుకు పోయాడు. అది చిన్న కొయ్య యిల్లు, వొంటరి యిల్లు. ఆయన ఆస్తి అల్లా వో పెట్టె మాత్రమే. దానికి యినప బద్దీలు కట్టి వున్నాయి. అందులో కొన్ని పాత కాగితాలు వున్నాయి. మాస్కో, ప్స్కొవ్, నోవ్‌గొరొద్ నగరాల్లోని ప్రఖ్యాత దేవుళ్ల బొమ్మల

 నకళ్లు ఆ కాగితాలమీద తీసి వున్నాయి. అక్కడనే సరిగ్గా అట్టడుగున యింకో అమూల్య



మైన వస్తువు వుంది. కొయ్య, తోలు అట్టవేసి గట్టిగా బిగించిన పెద్ద రాత గ్రంథం.

ప్రతిరోజూ సాయంత్రం నికొదీమ్ పని పూర్తయాక చేతులు కడుక్కునేవాడు. వో కొవ్వొత్తిని వెలిగించేవాడు. ఆ పుస్తకాన్ని జాగ్రత్తగా యువతలికి తీసి శ్రద్ధగా చదివి యెగోరికి బోధించేవాడు. ఆ పుస్తకం చాలా ఆసక్తికరంగా వుండేది. సాహసవంతుడైన యువరాజు బొవా గురించిన పుస్తకం అది. ఆ యువరాజు బలం, ధైర్యం అనుపమానమైనవి. ముప్పై వేలమంది యోధుల్ని మట్టు పెట్టగల అసహాయ శూరుడు అతను! అతనికి జరిగిన వింత విషయాలని గురించీ ఆ పుస్తకంలో వుంది.

నికొదీమ్ బాబా వెచ్చగా వుండే పొయ్యి తీనె పైన గాఢంగా నిద్రపోయేవాడు. కాని యెగోరి పుస్తకాన్ని విడిచిపెట్టేవాడు కాదు.



"నలభై వేలమంది యోధుల సైన్యాన్ని సమకూర్చుకుని బొవాని చంపెయ్యమని రాజు మార్కొబ్రున్ ఆజ్ఞ యిచ్చేడు. కాని వాళ్ళ భయపడ్డారు. 'మహాప్రభూ! మార్కొబ్రున్ రాజా! మేం బొవాని పట్టుకోలేం. మా ప్రాణాలు పోతాయి అంతే. మీ దగ్గర వొక మహా యోధుడున్నాడు, ప్రభూ, అతని పేరు పొల్కాన్. అతనివి శునక పాదాలు. కాని నడుం పైభాగం మనిషి ఆకారం. అతని ఒక్కొక్క అంగ మూడు కోసులు వుంటుంది. అతను బొవాని యిట్టే అందుకుని పట్టుకుంటాడు. కాని పొల్కాన్ కటకటాల వెనక వో చీకటి కొట్లో బంధితుడై వున్నాడు' అని జవాబు చెప్పారు.

"పొల్కాన్‌ని చీకటి కొట్లోనుంచి బయటకి విడవమని మార్కొబ్రున్ రాజా ఆజ్ఞ యిచ్చేడు. అతన్ని బొవామీదకి పంపేడు. దీర్ఘ అంగల పరుగుతో పోల్కాన్ దౌడు తీశాడు."

యెగోరి కళ్ళ మూతలు పడుతున్నాయి. అతని తల వాలుతోంది. ఒక్క కుదుపుతో తల పుస్తకాన్ని తాకింది. నికొదీమ్ గిరుక్కున లేచాడు.

"యింత అర్ధరాత్రి యేం చదువుతున్నావ్? నిద్రపో. లేకపోతే రేపు పనిలో జోగుతూ వుంటావ్. అప్పుడు నేను క్రూరుణ్ణనిపిస్తుంది మరి?"

"ఓ క్షణం నికొదీమ్ బాబా. కొంచెం మిగిలిపోయింది." అతను గుమ్మందాటి బయటికి వెళ్ళాడు. ఆకురాలు కాలపు చల్లని వాన అతని ముఖంమీద పడింది. అప్పుడు మళ్ళీ వొణుకుతూ యింట్లోకి పరిగెత్తి వెళ్ళేడు. తిరిగి చదవడం మొదలుపెట్టాడు.

"బొవా కత్తి తీసుకున్నాడు. నమ్మకమైన గుర్రం యెక్కాడు. మహాయోధుడు పొల్కాన్‌తో తల పడడానికి స్వారీచేసుకుంటూ పోయాడు. ఆ మహావీరులిద్దరూ ఢీ కొన్నారు. బొవా కత్తి ఝుళిపిస్తూ పొల్కాన్‌మీదకి లంఘించేడు. బొవా కత్తి అతని చేతిలోనుంచి యెగిరి

నేలలో సగం కప్పడిపోయింది. పాల్కాన్ తన దుడ్డుకర్ర యెత్తి బౌవాని మోదేడు. బౌవా గుర్రంమీదనుంచి కిందకి హతుడైనట్టు పడిపోయేడు. పాల్కాన్ తర్వాత బౌవా గుర్రం యెక్కాడు. కాని బౌవా నమ్మిన గుర్రం పాల్కాన్‌ని చూసింది. కళ్లెం పటపట కొరికింది. పొదల మీదనుంచి, దుబ్బుల మీదనుంచి, అడివిలోనుంచి యేక దౌడు తీసుకుంటూ పరిగెత్తింది. పాల్కాన్ శునక పాదాలు చిట్లిపోయేదాకా యేకటాకీన పరిగెత్తించింది. బౌవా చనిపోయినట్టు మూడు గంటలు అలా పడిపోయే వున్నాడు. తర్వాత మామూలుగా, యేమీ జరగనట్టే లేచాడు. తన భార్య ద్రుషేవ్న దగ్గరికి గుడారంలోకి వెళ్లాడు. పక్కమీదకి చేరేడు.''

అప్పుడు యెగోరి బౌవాలాగా మూడు గంటలు మొద్దులాగా నిద్రపోయేవాడు. తెల్లవారే లేచేవాడు. పువ్వులా వుండేవాడు. నికొదీమ్‌కంటే ముందుగానే చర్చికి వెళ్లేవాడు. అంచేత ''రెండుగా వంచే'' అవసరం నికొదీమ్‌కి రాలేదు. పైపెచ్చు, అతన్ని పొగిడి యెన్నో మెలుకువలు నేర్పేడు.



ఓ రోజున పల్చని అట్టలు అతికించే జిగురు వాళ్ల దగ్గర అయిపోయింది. యెగోరి దాంతో అతికిస్తూ వుండేవాడు. పని సాగలేదు. యేం చెయ్యాలి? ''మరేం కొంపలంటుకు పోలేదు. కసాయివాడి దగ్గరికెళ్లు. పెనం నిండా పెనం తాజా రక్తం తెచ్చి సున్నంతో కలుపు. చక్కటి జిగురు అవుతుంది'' అన్నాడు నికొదీమ్.

అతికించిన అట్టలకి జిగురు ఆరింది. కాని వాళ్లు వెంటనే రంగులు వెయ్యడం మొదలు పెట్టలేదు. మొదట కొన్ని పొరలుగా సీమ సుద్దని పేర్చారు. సీమ సుద్దని యిందుగ్గాను తయారు చేసేందుకు యెగోరి మూడు బస్తాల సున్నాన్ని పొడుం కొట్టాడు. అప్పుడు దాన్ని పారదర్శకంగా వుండే జిగురుతో కలిపాడు. కొయ్య తాపీ తీసుకుని దాన్ని అన్ని అట్టలమీదా పల్చగా పూశాడు. ఒక పొర పూత ఆరిపోగానే మరో పొర పూశాడు. తర్వాత యింకొకటి. అలా అయిదు సార్లు పూశాడు. తర్వాత బిర్రుగా వుండే పట్కా తీసుకుని అట్టల్ని పామేడు. తళతళ మెరిసే తెలుపు వచ్చేదాకా పామేడు.

తళతళ మెరిసే తెల్లని పలకలు గోడవారే నిలబెట్టి వున్నాయి. వాటికి యేం కావాల్నో యిక పైన మరి. అది తెలిసిన వాడొక్క నికొదీమ్ బాబాయే. ఆయన వాటిమీద రేఖలు గీస్తాడు.

''బాగుందబ్బాయిలూ'' అని వొక రోజున ఆయన అన్నాడు. రేపు రంగులు వెయ్యడం మొదలెడదాం. అంచేత యివాళ అందరూ ఆవిరి స్నానాలు చెయ్యండి. మీ పాపాలు క్షాళన అయిపోవాలి. శుభ్రంగా మల్లెపువ్వుల్లా తయారయి రేపు యిక్కడికి రండి'' అని చెప్పాడు.

నికొదీమ్ స్నానాల గది యెప్పుడనగానో శిథిలం అయిపోయింది. అందుకని ఆయనా,

యెగోరి కలిసి లుకా యింటికి వెళ్లారు. లుకా భార్య స్నానాల గదిలో నేలనీ, బల్లల్నీ చాకుతో పాకుడు పోయేటట్టు గీకింది. నదినుంచి మంచినీళ్లు తెచ్చింది. పెద్ద కాగులో పోసింది. మంట రాజేసింది. పొయ్యిపైన పొగ గొట్టం లేదు. అంచేత పొగ తెరిచిన గుమ్మంలోనుంచి పెరట్లోకి పోయింది. గోడలూ, లోకప్పూ పొగ చూరిపోయాయి. కాని స్నానాల గది త్వరగా వేడి యెక్కింది. యెక్కువ సేపు వేడి నిలబడింది.

మొదట మగాళ్లు లోపలికి వెళ్లారు. ఆవిరి బాగా వేడిగా వుంది. నడవలో యెగోరి, లుకా బట్టలు విప్పుకుంటూ వుంటే నికొదీమ్ తకామని తన బట్టలు విప్పేసి సలసల మరిగే నీటి ఆవిర్లోకి వెళ్లాడు. గది అంతా ఆవిరికమ్మింది. కిందభాగంలో కంటే పైభాగంలో వేడి యెక్కువగా వుంది. అక్కడ వున్న బల్లల్లో దిగువ వాటి కంటే పై వాటి దగ్గర వేడి యెక్కువ. గది యింకా వేడిగా వుండేందుకన్నెప్పి కాసిని వేణ్నీళ్లని వేడిగా వున్న రాళ్ల మీదకి వొలకపోశాడు. వేడి బర్చ్ రొట్టల ఘాటైన వాసన కొట్టింది. శ్వాసకోశాలు దాన్ని వదలవు.

''రా, యెగోరి. దూకు 'రొట్టలతో కొట్టు' '' అని నికొదీమ్ వేళాకోళాలు ఆడేడు. పై బల్ల దాకా యెగిరాడు. అక్కడ మరీ వేడిగా వుంది. బంగాళాదుంపలాగా ఉడికిపోతాం అక్కడ.

''రా! భయపడద్దు. నన్ను గట్టిగా కొట్టు. నేనేం యీగనుకాను'' అని ఆయన ఉడికిస్తూనే వున్నాడు.

''నాకు తెలుసు. యీగలకి అంతమందం చర్మం వుండదు'' అని యెగోరి యికిలించేడు. నికొదీమ్‌మీద బాగా రెమ్మలతో కొట్టేడు. ఆ ముసలాయన సరిగ్గా కదలలేకపోయాడు. చెమటలు కక్కేడు. ఆయాసపడి రొప్పేడు. కులాసాగా నవ్వేడు, తృప్తిగా విందుభోజనం చేసినట్టు.

''డచ్ ఆయన జాకబ్ కిందటి శీతకట్టులో యిక్కడ యెలాంటి ఆవిరిస్నానం చేశాడో గుర్తుందా లుకా? రంగులు యెలా వెయ్యాలో మనకి చెప్పాలని వచ్చినాయన? నువ్వివాళ చేసినట్టు చేశానప్పుడతనికి, యెగోరి. రొబ్బలతో కొట్టేను. పందిపిల్లలా అరిచి బల్లమీద నుంచి దూకేశాడు. నన్ను పిచ్చ తిట్లు తిట్టేడు. 'నేను పరాయి దేశంవాణ్ణి. నా మీదకి చేతులు యెత్తద్దు. నన్నెందుకు రొబ్బలతో కొడతావు ముసలాయనా' అని వొకటే అరుపు. 'నేను బాగా రంగులు వెయ్యనా? అంటాడు. 'తప్పు చేస్తే నువ్వే నిన్ను బాదుకో, మిమ్మల్ని తగలెయ్య' అని వొకటే తిట్లు.''



''అదుగో చూడండి ఆ మూల వో కప్ప వుంది'' అన్నాడు యెగోరి వున్నట్టుండి.

''అది అక్కడే వేసవికాలం అంతా వుంది. దాని తస్సాగొయ్య స్నానాల గదిని వెచ్చజేస్తే చాలు వచ్చేస్తుంది. గెంతుకుంటూ వొచ్చి సంబరంగా అరుస్తుంది. వేడి అంటే భయమే లేదు'' అని లుకా నవ్వేడు.

''రా, యెగోరి. మరింత ఆవిరి పడదాం. నా చెవులు చల్లబడుతున్నాయి'' అన్నాడు నికొదీమ్.

యెగోరి వో మగ్గు క్వాస్ పానీయం యెఱ్ఱగా మండే బొగ్గులమీద పోశాడు. మత్తెక్కించే బార్లీ వాసన గది అంతా నిండిపోయింది. రుచికూడా తెలుస్తోంది. వాళ్లు ఒకళ్లనొకళ్లు మరికొన్ని సార్లు మోదుకున్నారు. తర్వాత శుభ్రమైన చొక్కాలు తొడుక్కుని తోటలోనుంచి నడుచుకుంటూ యింట్లోకి వెళ్లారు. యిప్పుడు ''మోదుకోవడం'' ఆడవాళ్ల వొంతు అయింది.

మర్నాడు మొత్తం బృందం అంతా చర్చికి వెళ్లింది. అందరూ శుభ్రంగా వున్నారు. యథావిధిగా తయారై వున్నారు. ఓ యుద్ధానికో లేదా వో ముఖ్యమైన పనికో పాతకాలం రష్యాలో అలా సమాయత్తం అయేవాళ్లు.

''దేవుడు శుభం కలుగ చేయుగాక'' అని నికొదీమ్ అట్టహాసంగా శిలువ గీసుకున్నాడు. ''సెయింట్ నికలస్ బొమ్మబాహ్య రేఖలు గీస్తాను. లుకా, యెగోరిలు కలిసి యీ నకళ్లతో అచ్చులు కొడతారు. మిగిలిన వాళ్లకి తెలుసుకదా యేం చెయ్యాలో.''

నికొదీమ్ ముందు వాళ్లు పెద్ద పలకని పెట్టారు. ఆయన వొత్తుగా వున్న వర్తికని యెరుపు రంగులో ముంచి దాన్ని గాలిలో వూపి మానసికంగా పనికి తయారయేడు. తర్వాత ధైర్యంగా సెయింట్ నికలస్ ఒక నాజూకు గీతతో బాహ్య రేఖలు గీయడం మొదలుపెట్టేడు. మొదటగా నికలసే యెందుకని? యెందుకంటే చర్చి ఆ సెయింట్ కే అంకితం అయింది.

రంగులు వేస్తూ నికొదీమ్ వో కథ చెప్పాడు.

''ఓ రోజున వో రైతు బండి బురదలో కూరుకుపోయింది. అతను దాన్ని తోశాడు, లాగేడు, తంటాలు పడ్డాడు. కాని యేమీ ఫలితం లేకపోయింది. అంతట్లోకీ సెయింట్ కాసియన్ అటు వస్తున్నాడు. ఆ రైతు ఆయన్ని గుర్తుపట్టలేదు. 'నాకు సాయం చెయ్యండి సోదరా' అన్నాడు రైతు. 'నన్నొదిలిపెట్టు. నీతో కలిసి కులాసాగా గడిపేటంత వ్యవధి నాకు లేదు' అన్నాడాయన. ఆ తర్వాత సెయింట్ నికలస్ అటు వచ్చేడు. మోకాలిలోతు బురదలో

దిగి బండిని యివతలకి సాయం పట్టేడు. ఆ యిద్దరు సెయింట్లూ స్వర్గానికి వెళ్లేరు. 'యెక్కడికి వెళ్లేరు?' అని ప్రభువు వాళ్లని అడిగేడు. 'నేను భూమ్మీదకి వెళ్లాను. ఓ రైతు బండి బురదలో కూరుకుపోయింది. నన్ను సాయం చెయ్యమన్నాడు. కాని నా పవిత్ర మైన ఉడుపులు మకిలి కావడం నాకు యిష్టం లేకపోయింది' అని కాసియన్ జవాబు చెప్పాడు. 'మరి నీ బట్టలకి బురద యెక్కడ అంటుకుంది?' అని ప్రభువు నికలస్‌ని అడిగేడు. 'నేనా మనిషికి సాయం చేశాను' అని ఆయన జవాబు చెప్పాడు. 'నిన్ను ప్రజలు సాలుకి రెండుసార్లు స్మరిస్తారు నికలస్, నిన్ను నాలుగేళ్ల కొకసారి తలుస్తారు, కాసియన్' అని ప్రభువు చెప్పాడు.''

''అంచేత నికలస్ అలాంటివాడు. ప్రజలకి యెల్లవేళలా సాయం చెయ్యడానికి సిద్ధంగా వుంటాడు. కాని కాసియన్ నామ దినం నాలుగేళ్లకొక సారి. ఆ యేడాదిలో కాసియన్ కసి వల్ల జనం మామూలు కంటే యెక్కువ చనిపోతున్నారు.''

నకళ్లతో యెలా అచ్చు కొట్టాలో లుకా చూపిస్తూ వుంటే యెగోరి పరికించాడు. రెక్కలున్న మిహయీల్ దేవుని పెద్ద నకలు తీశారు. దాన్ని నికొదీమ్ తన చందుకం పెట్టె నుంచి తీసి పట్టుకొచ్చాడు. దాన్ని సీమసుద్ద అట్టమీద పెట్టి అంచులు జాగ్రత్తగా అతి కించేరు.



అసలు నకలు యిలా చేస్తారు. నకలు తీయవలసిన బొమ్మ స్థూల రేఖలమీద మొదట అంతటా వెల్లుల్లిరసం పూస్తారు. ఆ రసం ఆరిపోయేలోగా వో కాగితాన్ని దానిమీద అదు ముతారు, వెచ్చని చేత్తో చాలా సేపు మెల్లిగా దాన్ని రుద్దుతారు. వెల్లుల్లిరసం కాగితం మీద రేఖల్ని తీసేదాకా అలా రుద్దుతారు. తర్వాత ఆ కాగితాన్ని వో వూలు అట్టమీద పెడ తారు. ఆ రేఖల బారునా సూదితో చుక్కలు పెడతారు. అప్పుడు ఆ కాగితాన్ని తీసి వెలు తురుకి అడ్డంగా పెట్టి చూస్తే చిన్న చిన్న సూది బెజ్జాలతో ఆకృతి మొత్తం యేర్పడి వుంటుంది.

లుకా యెగోరి వో నల్లని బొగ్గుమసి వున్న చిన్న గుడ్డ సంచీలు తీసుకుని వాటితో నకలుని మెల్లిగా తట్టడం మొదలెట్టారు. బొగ్గు మసి ఆ బెజ్జాలగుండా సీమసుద్ద జిగురు పూసిన కొయ్యమీదకి దిగింది. నకలుని జాగ్రత్తగా తీసినప్పుడు అట్టమీద రెక్కల దేవుని స్థూల రేఖలు చక్కగా చుక్కలు పడి కవిపిస్తాయి.

''యిప్పుడు వో సూదిని తీసుకుని స్థూల రేఖల బారునా గీత గియ్యి. జాగ్రత్త సుమా, బొగ్గుమసి నీ చొక్కా చేతులు తగిలి పులుముకుపోయేను'' అన్నాడు లుకా.

యెగోరి అలానే చేశాడు. గట్టిగా వూపిరి పీలిస్తే బొగ్గుమసి పులుముకుపోతుందేమోనని భయపడుతూ చేశాడు.

నికొదీమ్ వీళ్ల పని యెలా వుందో చూద్దామని వచ్చేడు.

''జాగ్రత్త, రేఖ పలకకి అంటుకునేటట్టు చేశావ్. స్థూలరేఖాకృతి బాగానే తీశారు. చక్కగా స్ఫుటంగా అచ్చం దేవుని మాతృకలాగానే వుంది. ఆయనకి అసలు ప్రభువన్నా జంకు లేదు తెలుసా?'' అన్నాడు.

''అంటే?'' అని యెగోరి ఆశ్చర్యంగా అడిగాడు.

''అంటే, యిలా. ప్రభువు మిహయీల్ దేవుని పిలిపించేడు. 'భూమ్మీదకి వెళ్లి ఫలానా ఫలానా పాపాత్ముని ఆత్మని తీసుకురా' అని చెప్పాడు. మిహయీల్ భూమ్మీదకి దిగివచ్చేడు. ఆ మనిషికి యెనమండుగురు పిల్లలు. అతనంటే జాలి కలిగింది. 'యీ మనిషిని యెలా తీసుకురాను ప్రభూ! అతని పిల్లలంతా నామా నత్తానూ! ఆకలితో మాడి చచ్చిపోతారు' అని చెప్పాడు. 'నా మాట జవదాటితే నువ్వు భూమ్మీద మానవుడిగా పుడతావు' అన్నాడు ప్రభువు. అని మిహయీల్ బంగారు కత్తినీ, రెక్కల్నీ తీసేసుకుని మూడేళ్లు భూమ్మీద బతకమని శపించేడు.''

''ఓఁ, అలాగే జరుగుతుంది. సెయింట్స్ బీదలకి సాయం చేస్తారు. కాని భూమ్మీద ధనవంతులకి కులాసాగానే గడుస్తుంది'' అనుకున్నాడు యెగోరి.

యిప్పుడు బొమ్మకి బంగారు పూత పెట్టే పని. పూత పెట్టవలసిన తావుల్లో మొదట యెర్ర లత్తుక పూస్తారు. అలా అయితే అది బంగారం కిందనుంచి మెరుస్తూ వుంటుంది. అప్పుడు ఆ తడి రంగుమీద పల్చని బంగారు రేకుల్ని జాగ్రత్తగా అతుకుతారు. కుందేలు పంజాతో అలా చేస్తారు లేకపోతే బంగారం చేతి వేళ్లకి అంటుకుపోతుంది.

అది చాలా మెల్లిగా, ఓపిగ్గా చెయ్యాల్సిన పని. హడావుడిగా వుండేది కాదు. డిసెంబరు నెలదాకా వాళ్లకి తీరిక లేకపోయింది. సెయింట్ బార్బరా రోజున విపరీతమైన మంచు కురిసింది. ఆ సాయంత్రం నికొదీమ్ యింటికి పెద్ద మూట మోసుకువచ్చేడు. ఆయన ముక్కు కందిపోయింది. మీసంమీద మంచు పడింది. చలికి వొణికి పోతున్నాడు.

''బార్బరా గడ్డకట్టించేటప్పుడు మీ ముక్కూ చెవులూ జాగ్రత్త. నీకోసం గొర్రె బొచ్చుల కోటు తెచ్చాను యెగోరి. నువ్వు గడ్డకట్టిపోకూడదు. అలా అయితే నాకు నష్టం. చూడు నీకు సరిపోతుందో లేదో'' అన్నాడు.

''నికొదీమ్ బాబా మీ జాలిగుండె యేమని చెప్పను? నా జన్మలో మీ రుణం తీర్చుకోలేను. యీ కోటు యెక్కడ సంపాదించారు?'' అని అడిగాడు. ఆ ముసలాయన దయాంతఃకరణ అతన్ని కదిలించివేసింది.

''దగ్గర్లోనే వో వితంతువు వుంది. ఆవిడ దగ్గర్నుంచి తీసుకువచ్చేను. కిందటి వారంలో ఆమె భర్తని కొరడాతో కొట్టిచంపేరు.''

''దేనికి?''

''వాళ్ల చిన్న పిల్లాడు వాకిలిదాటి వీథులోకి వెళ్లాడట. ఆ సమయంలో చక్రవర్తి రక్షక భటుడొకడు తాగి స్లెడ్జి బండిలో వస్తున్నాట్ట. బండిని పక్కకి తోలకుండా వాడు సరాసరి పిల్లవాడిమీదకి తోలేడు. వూరికే సరదాకి, కుర్రాడు కుక్క పిల్ల అయినట్టు. కుర్రాడి తండ్రి పెరట్లో కట్టెలు కొడుతూ యిదంతా చూశేడు. గొడ్డలి తీసుకుని కంచెపై నుంచి ఆ మనిషిమీదకి విసిరాడు. గొడ్డలి అతని మెడకి తగిలింది.''

''చచ్చిపోయాడా?''

''లేదు, వూరికే గీరుకుని గాయం అయింది. కాని ఆ నేరానికి గాను కుర్రాడి తండ్రిని చావ చితకగొట్టేరు... అతను మంచివాడు. ముగ్గురు చిన్న పిల్లల్ని పెట్టుకుని ఆ వితంతువు యెలా నెట్టుకురాగలదు? ఆవిడకోసం కొంచెం డబ్బు, రొట్టెల పిండీ పట్టుకెళ్లి యిచ్చాను. ఆమె యీ కోటుని నీకోసం యిచ్చింది, పాపం. తొడుక్కో. ముక్కి మూల గద్దు.''



బంగారు రేకుల పనివాళ్లు వాళ్ల పని పూర్తిచేశారు. తర్వాత రంగులు వేసే పని. రంగులు కలిపేవాళ్లు కొయ్య తెడ్లలో వేళ్లు పెట్టి రంగులు చిదుముతున్నారు. ఆ తెడ్లకి కాడలు లేవు. రంగుల్ని వాళ్లు గుడ్డు పచ్చసొనతో, క్వాస్ పానీయంతో కలుపుతున్నారు.

రంగులు వేస్తూ వుంటే యెగోరికి ఆశ్చర్యం కలిగింది. అట్టమీద రంగుకేసి చూసే కొద్దీ లోపలినుంచి వింత తేజస్సుతో అది ప్రకాశిస్తూ వున్నట్టుంది.

''బాగుంది నాయనా, యెగోరి'' అని నికొదీమ్ బాబా అతన్ని పొగిడేడు. ''దీనికేసి బాగా చూడు, మిరోన్, నువ్వైతే యేదో పులిమేస్తావ్'' అన్నాడు.

''అయితే యేమిటట?'' అని మిరోన్ యికిలించేడు. ''యెలాగైనా వొకటే, వంకర

గీతలమీద రంగుపూసి దాన్ని లక్కతో కప్పెయ్యొచ్చు'' అన్నాడు.

''నాకర్థం కాదు మిరోన్. నువ్వు దేన్ని గురించీ పట్టించుకోవు. నీకు సంతోషమూ కలగదు, యితరులకి ఆనందమూ వుండదు. చర్చికి వొచ్చే మామూలు జనం చదవలేరు, రాయలేరు. చూడగలరంతే. ముఖాలు వంకరగా వుంటే చూస్తారా? నువ్వు కష్టపడి పని చెయ్యాలి. చేసిన పని గొప్పగా వుండాలి'' అన్నాడు.

యెగోరి చాలా కష్టపడి పనిచేశాడు. కొత్త కళని నేర్చుకుంటూ మనిషి చిక్కిపోయాడు.

ఒకో అప్పుడు నికొదీమ్ అతన్ని బలవంతంగా బయటికి లాక్కెళ్లాల్సి వచ్చేది. ''కాస్త కులాసాగా తిరిగిరా. ష్రోవ్‌టైడ్ పండగ. జనం హుషారుగా వున్నారు'' అన్నాడు.

''వుహుం తిరగలేను. నాకోసం మా ఆవిడా పిల్లలూ యింటి దగ్గర బెంగపెట్టుకున్నారు. చుంటే నేను హుషారుగా యెలా వుండగలను? నేను లేకుండా యెలా గడుపుకుంటున్నారో యేమిటో, తిండానికి యేమన్నా దొరుకుతోందో లేదో. వాళ్లనెవడేనా భయపెడుతున్నాడేమో. యేదేన్నా పంపిద్దామన్నా వెళ్లే వాళ్లెవరూ లేరు....''

''త్వరలోనే 'మంచు మండించు' ఏప్రిల్ వస్తుందిగా. అప్పుడు మీ అమ్మేమనిషి వున్నాడుగా, అతనితో యేదన్నా పంపిద్దాం. దేవుడు చల్లగా చూసి వేసవినాటికి పని పూర్తి చేస్తే నువ్వే వెళ్లిపోదువుగాని.''

''నేనే?'' అని యెగోరి సంతోషంతో అరిచాడు.

''అవును నువ్వే'' అని నికొదీమ్ విచారంగా అన్నాడు. ''కాని నాయనా మళ్లీ వెనక్కి వస్తావా? నువ్వు లేకుండా నేను పని చెయ్యలేను. నా కన్నకొడుకు వ్లదీమిర్‌ని జార్ రక్షక భటులు గ్రామ చర్చిలో యేడేళ్లనాడు శిరఃఖండనం చేశారు. వాళ్లు చర్చిని కొల్లగొడుతూ వుంటే మావాడు వాళ్లని అడ్డగించేడు. వాడూ బొమ్మలకి రంగులు వేసేవాడు. వాడి బదులు దేవుడు నిన్ను పంపేడు... యెందుకలా వెర్రిమొహం వేసుకు చూస్తావ్? పొయ్యి దగ్గరికి వెళ్లి చూడు. అది ఆరిపోతోంది. సరే, నిన్నిక్కడ వుంచడం దేనికి కాస్త వంట చెరకు తేలేకపోతే?''

ఆ ముసలాయన చాలా ఆవేశ పడిపోయి, పొయ్యిపైన పడకమీద సగం రాత్రంతా యేదేదో గొణుగుతూ మూలుగుతూనే వున్నాడు. తన వొంటరి జీవితం గురించిన చింత ఆయనకి కోపం తెప్పించింది. తను మనసు విప్పి వెళ్లబోసుకున్న యీ సందర్భంవల్ల మరీ కోపం వొచ్చింది.

చర్చిలో ఆకృతుల ముఖాలకి రంగులు వేసేవాళ్లు అప్పుడే తమ పని ప్రారంభించారు. ముఖాలకీ చేతులకీ రంగులు వెయ్యడమే చాలా కష్టమైన పని. యెంతో నేర్పు కావాలి. నిశితమైన పరిశీలన కావాలి. స్థిరమైన హస్తం వుండాలి. వదనాలు అందంగా తెలివి తేటలు ఉట్టిపడుతూ వుండాలి. పరిశుద్ధాత్ముడైన సిద్ధహస్తుడే ఆ పని నిర్వర్తించాలి. మేరి మాత యెంత ప్రేమ తొణికిసలాడుతూ, కరుణామూర్తిగా వుండాలి మరి! మానవాళి పట్ల యెంత సానుభూతి దయ ఉట్టిపడుతూ వుండాలి! ఆమె దగ్గరికి యెవళ్లు వెళ్లినా సరే ఆమెని కన్న తల్లిగా చూసేటట్టు వుండాలి. ఆ వెళ్లేవాడు దుర్మార్గుడు గానీ, తుంటరి గానీ, క్షుధార్తుడైన భిక్షుకుడు గానీ, కుంటివాడు గానీ, దుఃఖంలో వున్న అమాయకుడు గానీ, ఆమె అందర్నీ ఆదరించి, క్షమించి, జాలి చూపించి, వూరట కలిగించేటట్టు వుండాలి.

సెయింట్ పరస్కేవా వదనం రంగులతో చిత్రిస్తూ నికొదీమ్ శాంతంగా మాట్లాడేడు.

''ఆడది అబల. కాని ఆమె ప్రేమ శక్తివంతమైనది. యేదీ దాన్ని ఛిన్నం చెయ్య లేదు. ఓ సారి పరస్కేవా అస్థికలు వున్న వూరిని సారసెన్ దుండగులు చుట్టుముట్టేరు. వాళ్లు చూస్తే బోలెడు మంది, వూరివాళ్లు చూస్తే చాలా తక్కువ మంది. యిక అంతా ముగిసినట్టే కనిపించింది.

''అప్పుడు వొక రోజు రాత్రి పరస్కేవా అస్థికలున్న చర్చిలో కొవ్వొత్తులు స్వయం ప్రకాశ మానమైనాయి. తేజోవంతంగా వున్న యిద్దరు దేవతలు ప్రత్యక్షమయ్యారు. ఆ వూరు ఆ మర్నాడు ధ్వంసం అయిపోతుందనీ, ఆమె తక్షణం ఆ వూరు వదిలి వెళ్లిపోవాలనీ చెప్పమని క్రీస్తు పంపేడా దూతల్ని. పరస్కేవా శవపేటికలోనుంచి లేచింది. వాళ్ల మాటలు వింది. హృదయ విదారకంగా విలపించింది. 'క్రీస్తు యీ అమాయక పట్టణాన్ని ధ్వంసం చేస్తే నేనూ దీంతోబాటు నాశనం అయిపోతానని ఆయనకి చెప్పండి' అని వాళ్లతో అంది.

''ఆ దేవతలు విజ్ఞప్తుల్ని, బెదిరింపుల్ని ఆమె ఖాతరు చెయ్యకుండా శవపేటికలో పడు కుంది. కొవ్వొత్తులు ఆరిపోయాయి.

''క్రీస్తు పరస్కేవా పట్ల జాలిపడ్డాడు. ఆ శాపగ్రస్త సారసెన్లమీద మర్నాడు ఉదయం పిడుగులతో కూడిన కుంభవృష్టి కురిసింది. కణకణమండే యిటికలు కురిశాయి. అయినా క్రీస్తు అందర్నీ మట్టుపెట్టలేకపోయాడు ఎక్కువ మంది వుండడం వల్ల. సారసెన్ రాజు వూళ్లోకి విరుచుకు పడి పరస్కేవా పవిత్రాస్థికల్ని తనతో తీసుకుపోదామని అనుకు న్నాడు. అదుగో, అప్పుడూ ఆవిడ విశ్వాసం ద్యోతకమైంది.

''ఆమె శవపేటికని ముప్పై గుర్రాలు లాగ ప్రయత్నించాయి. కాని అది కదలందే.

యిక లాభం లేదని రాజు గమనించాడు. 'మీ సెయింట్ యెంత బరువు తూగుతుందో అంత బంగారం పట్టుకొచ్చి యివ్వండి వదిలేస్తాను' అని వూరి వాళ్లకి చెప్పాడు.

''వూరివాళ్లు తమ దగ్గరున్న బంగారం అంతా తెచ్చి తాసులో వేశారు. ఒక సిబ్బిలో అస్థికలు, మరో సిబ్బిలో బంగారం. కాని బంగారం తాసుని కిందికి లాగేసింది. కొంత తీసేశారు. అయినా మొగ్గు యిటే వుంది. దాంతోటి వాళ్లు కాస్త కాస్తే బంగారాన్ని తీసేస్తూ వచ్చారు. ఆఖరికి పదిహేను బంగారు నాణేలు మిగిలాయి. వినాశనం తప్పించుకుందుకు వాళ్లు చెల్లించిన మూల్యం అదీ.

''యేమి అద్భుతమైన కథ! పరస్కేవా జీవిత గాథా దృశ్యాన్ని యీ బొమ్మ చుట్టుతా గియ్యి యెగోరీ. యెవళ్లు చూసినా ఆమె చరిత్ర పుస్తకం చదివినట్టు తెలియాలి.''

యెగోరి ఆలోచించాడు. యెంత కష్టమైన పని చెప్పాడు నికొదీమ్. అయినాగానీ తనే సమర్థుడని ఆయన అనుకున్నట్టుంది.

బొమ్మ అంచుల్ని అతను మొదట పదహారు గళ్లుగా విభజించేడు. తర్వాత యెడమ భాగం పై అంచులో మొదలుపెట్టి ఆ గళ్లలో పరస్కేవా జీవిత కథని చిత్రించడం ప్రారంభించాడు. తన దగ్గరున్న అతి చక్కని కుంచె వాడేడు. మరి చాలా చిన్నగా రంగులు వెయ్యాలి కదా. సారసెన్‌లు పట్టణాన్ని నాశనం చేసే దృశ్యం దగ్గరికి వొచ్చేటప్పటికి అతనికి ఇళ్లు ఆయకట్టు పర్రులో వున్న యిళ్లు యెలా దగ్ధం అయాయో గుర్తువొచ్చింది. ఆ మంటల్లో, పొగలో భీతాంగం యెత్తిన జనం యెలా పారిపోయిందీ గుర్తువొచ్చింది. ఆ ద్రిమ్మరులు గుర్రాలతో జనాన్ని యెలా మడతొక్కిందీ గుర్తువొచ్చింది. యెలా కత్తులతో ఛిద్రం చేసిందీ గుర్తువొచ్చింది. అదంతా జరిగింది జరిగినట్టు గుర్తువొచ్చింది. సరిగ్గా అలానే చిత్రించాడు.

నిపుణులు పక్కన నుంచున్నారు. నికొదీమ్ సాలోచనగా గడ్డం నిమురుకున్నాడు.

''దాన్ని నువ్వు కల్పించావ్ యెగోరి. సెయింట్ల జీవిత కథల్లో అలాంటిదేమీ లేదు'' అన్నాడు.

''కాని నిజంగా అది యిలాగే వుంటుంది'' అని యెగోరి నిదానంగా, దృఢంగా జవాబు చెప్పాడు.

''నిజమే, నేను చూడగలను యిలాగే వుంటుందని. యేమంటే అది జరుగుతూ వుండగా నువ్వు చూశావు కాబట్టి. అయినా చిత్తం వొచ్చినట్టు చెయ్యడానికి చర్చి వొప్పుకోదు. ధర్మసూత్రాలకనుగుణంగా చెయ్యాలని చర్చి అంటుంది. మనం జాగ్రత్తగా వుండాలి, అబ్బాయిలూ. అయినా కొత్తగా వుండేదాన్ని చిత్రించకపోతే, అంతసేపూ నకళ్లనుంచి

ప్రతిరూపాలు గీస్తూ వుంటే మన గొప్పదనం యేమిటి? యింతా చేసి చర్చీలు వైవిధ్యంతో వుంటాయి కదా. యే రెండూ వొక్కలాగా వుండవు. ఒకే రకం బొమ్మలు అన్ని చోట్లా వుంచడం పాపం.''

''మీకు భయం లేదా? చర్చి మాటకి యెదురు చెప్పినవాళ్లని యెంత మందిని కాల్చెయ్యడం జరిగిందో తెలీదా?'' అని హెచ్చరికగా వుండే లుకా అన్నాడు.

''తెలుసు. దేవుళ్ల బొమ్మలపట్ల గౌరవం ప్రదర్శించనందుకు పూజారి నౌమ్‌ని కాల్చెయ్యడం నేను చూశాను కూడా. కాని మొదటిసారి పుస్తకాలని అచ్చు వేసిన ఇవాన్ ఫ్యోదొరొవ్‌ని తాకను కూడా తాకలేదు వాళ్లు. అదృష్టం వుంటే తల కాస్తుంది'' అన్నాడు.

సరిగ్గా ఆ సమయంలో తలుపు తెరుచుకుంది. ఓ మనిషి లోపలికి దూసుకు వచ్చేడు. అతని చొక్కా చిరిగిపోయి వుంది. అతని తలమీద రక్తం కనిపిస్తోంది. కళ్లల్లో భయం తాండవిస్తోంది. తెల్లగా పాలిపోయి వున్నాడు.

''నన్ను కాపాడండి నాయనలారా, నన్ను దాచండి మీకు పుణ్యం వుంటుంది'' అని బొంగురు కంఠంతో అరుస్తూ ఆయాసపడ్డాడు.

''యెవరు నువ్వు? దొంగవి కాదు కదా?'' అని నికొదీమ్ కటువుగా అడిగాడు.

''నేనేం దొంగను కాదు. జార్ సైనికులు నన్ను తరుముకొస్తున్నారు.''

గుర్రాలు దౌడు తీసుకుంటూ రావడం, మనుషులు అరుస్తూ వుండడం బయటనుంచి వినిపించింది.

''యెక్కడ దాచను నిన్ను? జాగా లేదు'' అని నికొదీమ్ భయపడుతూ అన్నాడు.

యెగోరీ ఆ మనిషిని అంది పుచ్చుకుని గబగబా వో మూలకి లాక్కుపోయాడు. అక్కడ పని చేసుకునే వస్తువులు పోగుగా వున్నాయి.

''కళ్లు మూసుకో, వూ'' అని అరిచి, వెల్ల వేసే తెల్ల సున్నం తీసుకుని ఆ ముఖంమీద, బట్టలమీద కుమ్మరించేడు. ఆ మనిషి గుర్తుపట్టలేనట్టుగా మారిపోయాడు.

''యిదిగో యిది తీసుకుని గోడకి వెల్లవేస్తున్నట్టు వుండు'' అన్నాడు యెగోరీ.

అప్పటికే జార్ సైనికులు లోపలికి తోసుకువచ్చేరు.

''ఆగండి, పాషండులారా!'' అని నికొదీమ్ గట్టిగా అరిచాడు. ఆ కేకకి కప్పు అదిరింది. ''ఆయుధాలతో యీ పవిత్ర స్థలంలోకి రావడానికి మీకెన్ని గుండెలు? శపిస్తాను'' అన్నాడు.

''ఛప్, నోర్మూయ్, ముసలాయనా.'' అని వాళ్లు యెదురు తిరిగారు. కాని ముందు

జాగ్రత్తకోసం ఒకటి రెండు అడుగులు వెనక్కి వేశారు. ''యెక్కడ దాచేవా పారిపోయి వచ్చిన దొంగని?''

''పారిపోయి వొచ్చిన వాణ్ణెవణ్ణీ నేను చూడలేదు. యిక్కడ యెక్కడ దాంకుంటాడు? యిక్కడ రహస్యంగా వుండే గదులున్నాయా? నేలమాళిగలున్నాయా?''

''యేడీ?'' యువ దళవాయి నమ్మలేదు.

''నాకు తెలీదు, నే చెప్పలేను. అది మీ ఉద్యోగం నాయనలారా! మేమేం కాళీగా లేమి క్కడ.''

''ఆఁ, యెంత తీరికలేకుండా వున్నదీ తెలుస్తూనే వుంది. గోడలు బోసిగానే వున్నాయి. మనుషులు మాత్రం రంగులు పులుముకుపోయి వున్నారు'' అని దళవాయి వెక్కిరించాడు, రంగు పులుముకుపోయిన పారిపోయివచ్చిన మనిషికేసి చూపించి.

''ఆ చవటాయన్ని వదిలించుకోవాలని బోలెడు యేళ్లుగా చూస్తున్నాను. కాని యెవళ్లకి కావాలతను? మీరు తీసికెళతారా?'' అని నికొదీమ్ కోపంగా అడిగాడు.

''మాకిప్పటికే సరిపడా వున్నారు'' అంటూ సైనికులు చర్చి బయటికి వెళ్లిపోయారు.

నికోదీమ్ నీరసంగా బల్లమీద కూలబడ్డాడు.

''వాళ్లని వదిలించుకున్నట్టే వుంది. భలేవాడివే యెగోరి నేనెన్నడూ అనుకోలేదే! హేయ్, యిలా రా. భయం లేదులే. వాళ్లెందుకు నీవెంట పడ్డారు? యేం చేశావ్?''



''నేను చేసిందల్లా పెద్ద నోవ్‌గొరొద్‌లో బోయర్లకి ఉగ్రాణం మనిషిగా పని చెయ్యడమే'' అన్నాడతను గజగజ వొణికిపోతూ. వెర్రి చూపులు చూశేడు. ఎపిఫనీ విందులో జార్ స్వయంగా తన సైనికులతో, రాకుమారులతో మమ్మల్ని చూడవచ్చేడు. ఆర్చిబిషప్ పీమెన్ శిలువలూ, మంత్రమహిమగల దేవతా చిత్రాలూ తీసుకుని ఆయనకి యెదురువెళ్లాడు. జార్ శిలువని భక్తిపూర్వకంగా చుంబించలేదు. సరికదా మహోద్రగుడై పీమెన్‌ని దూషించడం మొదలుపెట్టేడు. 'నీచుడైన పాషండుడా నువ్వు శిలువని ధరించడం లేదు. పదునైన కరవాలాన్ని పట్టుకున్నావు. నువ్వు దాన్ని నా గుండెలో దించబోతున్నావు. మన రాజ్యాన్ని లిథువేనియా రాజు జీగ్‌మంత్ అగస్ట్‌కి అందజేస్తున్నావు. యికనుంచి నువ్వు బిషప్‌వి కాదు, తోడేలువి, దోపిడీగాడివి, ధ్వంసకుడివి' అని తిట్టిపోశాడు.

''చర్చిలన్నింటినీ కొల్లగొట్టమని, వాటి ఖజానాలు ఖాళీ చెయ్యమనీ, ప్రాచీన మహిమాన్విత చిత్రాలన్నీ సంగ్రహించమనీ, బంగారు ఉడుపుల్నీ గంటల్నీ కూడా తీసుకొమ్మనీ

 తన మనుషులకి అక్కడికక్కడ ఆజ్ఞ యిచ్చేడు. అప్పుడు ధర్మాసనం అధిష్ఠించి భార్యా

బిడ్డలతో సహా నోవ్‌గొరొద్ బోయర్లని తీసుకురమ్మని ఆజ్ఞాపించి వాళ్లని చిత్రహింసలు పెట్టించాడు.''

''అయ్యో! అయ్యో! యెంత దురంతం!'' అని నికొదీమ్ భయంతో శిలువ గీసుకున్నాడు.

''అంతేనా!'' అని ఆ మనిషి వెర్రి చూపులు చూస్తూ గట్టిగా అన్నాడు. ''మిగిలిన వాళ్లని వోలఖొవ్‌మీద వంతెనకి తీసుకువెళ్లారు. అందర్నీ యెంతో యెత్తుమీదనుంచి నదిలోకి తోయించేడు. యివాళ్టికీ వాళ్ల హృదయ విదారకమైన అరుపులు నా చెవుల్లో గింగుర్లె త్తుతున్నాయి. పశువులు! నీచ పశువులు!'' అని చెప్పాడు. ఆ వ్యక్తి కంఠం కీచుమంది. ఒకటే వెక్కడం మొదలుపెట్టాడు. నేలమీద పడి లుంగలు చుట్టుకుపోయి దొర్లేడు. పని వాళ్లు భయంతో యెక్కడి వాళ్లక్కడ బిగిసిపోయి చూశారు.

''యీ నీళ్లు తాగు నాయనా. యెందుకంతలా చిత్రహింసలు పడతావు బాబూ'' అని నికొదీమ్ విలపించాడు.

అతనికి నీళ్లు అందించారు. కాని అతని చేతులు యెంతగానో వొణికేయి. నోటిదాకా పెట్టుకోలేకపోయాడు. చొక్కామీద వొలకబోసుకున్నాడు.

''ఆ తర్వాత మిగిలిన వాళ్లందర్నీ చక్రవర్తి ముందుకు తీసుకురమ్మన్నాడు. వాళ్లకేసి అణకువగా చూశాడు. 'యిప్పుడు చిందించిన రక్తం అంతా ద్రోహి పీమెన్ తలదే. విచారించ కండి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తూ జీవించండి.' అతను వాళ్లని వదిలిపెట్టాడు. కాని పీమెన్నీ, పురోహితుల్నీ, నాలాగా అపఖ్యాతి పాలైన వాళ్లందర్నీ మాస్కోకి తీసుకుపొమ్మనీ, మిగిలినవాళ్లకి గుణపాఠంగా వుండేందుగ్గాను తలలు తీసెయ్యమనీ ఆజ్ఞాపించేడు. కాని నేను యే పూర్వ పుణ్యం వల్లనో తప్పించుకు పారిపోయాను....'' అని చెప్పాడు.

పాపం ఆ నిర్భాగ్యుడు ఆ భయంకరమైన కథ పూర్తి చేసి, తల చేత్తో పట్టుకుని, మౌనంగా వుండిపోయాడు.

''అయితే యిప్పుడెక్కడికి వెడతావు నాయనా'' అంటూ నికొదీమ్ అతన్ని కౌగలించుకున్నాడు.

''నేను వోల్గా నది దాటి పచ్చికబీళ్లమీదకి పోతాను. రష్యా నలుమూలలనుంచీ వచ్చిన వాళ్లకి అక్కడ ఆశ్రయం దొరుకుతుందని విన్నాను'' అని అతను విచారంగా చెప్పాడు.

పనివాళ్లు అతనికి భోజనం పెట్టి బట్టలు యిచ్చేరు. యెవళ్లు యివ్వగలిగింది వాళ్ళు యిచ్చేరు. తర్వాత అతను వాళ్లకి నమస్కారం చేసి చీకట్లోకి వెళ్లిపోయాడు.



దేవుళ్ల బొమ్మల ముఖాలకి రంగులు వెయ్యడం పూర్తిచేశారు. యిప్పుడు వాటిని సజీవంగా వున్నట్టు చెయ్యాలి. ముందుకు చొచ్చుకు వొచ్చిన భాగాలన్నిటికీ, చుబుకాలకి, గడ్డాలకి, నుదుళ్లకి, చేతివేళ్ల కొనలకి, ఉడుపుల కుచ్చెళ్లకి సన్నని తెల్లని గీతలు భాసింప చేశారు. ఆ పలకలకి మూర్తిత్వం వొచ్చింది. నికొదీమ్ అన్నిటినీ జాగ్రత్తగా కడసారి పరీక్షించేడు. అవసరమైన మార్పులు చేశాడు. అప్పుడు శిలువ గీసుకున్నాడు. ''అంతే నాయనలారా! దేవుడి దయవల్ల యీ బొమ్మలన్నిటినీ పూర్తిచేశాం. మనం సిగ్గు పడవలసిందేమీ లేదు, యేం? యిప్పుడు బొమ్మలకి మెరుగు నూనె పూత పెట్టాలి. నువ్వు నాతో రా, యెగోరి'' అన్నాడు.

ఆయన యెగోరిని పెరట్లో వున్న గడిసెలోకి తీసికెళ్లాడు, తలుపు గడియ వేసి, తన అంగరఖాలోనుంచి వో నార సంచీ తీశాడు.

''యేమిటిది, బాబా?''

''యీ రహస్యం నీ వొక్కడికే చెప్తాను, నా భేష్పైన శిష్యుడివి'' అని ముసలాయన గొణిగాడు. ''కాని శిలువమీద వొట్టు పెట్టుకో. యీ రహస్యాన్ని నీతో కూడా మట్టిలో కలపక మరో నిపుణుడికి అందిస్తావని ప్రమాణం చెయ్యి'' అన్నాడు.

''ప్రమాణం చేస్తున్నాను'' అని యధావిధిగా శిలువని ముద్దు పెట్టుకుంటూ అన్నాడు యెగోరి.

నికొదీమ్ సంచీ విప్పేడు. కొన్ని చిన్న పసుప్పచ్చ రాళ్లని బల్లమీదకి విసిరాడు.

''యిది తృణమణి రాయి. చాలా విలువైంది. దీన్ని కల్వంలో నూరి, మెరుగు నూనెలో కలుపు. మెరుగు నూనె దీనివల్ల మెరుస్తుంది'' అన్నాడు.

యెగోరి అలాగే చేశాడు. ఆ రాళ్లని నూరి, తళతళ మెరిసే గుండని మెరుగు నూనెలో కలిపాడు. కాంతి పుంజం సోకే భాగాలన్నీ మిలమిలలాడిపోయాయి.

తిరిగి చర్చికి వెళ్లారు. బల్లమీద వున్న బొమ్మలన్నిటికీ యీ రహస్యమైన మెరుగు నూనెని మందంగా పూశారు. మెరుగుపూత కింద రంగులు, యేదో అంతస్తేజంతో దీప్తం అయినట్లు వందలరెట్లు మరింత కాంతివంతంగా శోభించాయి.

నిపుణులైన ఆ పనివాళ్లందరూ చుట్టూతా నుంచున్నారు. నిశ్శబ్దంగా ఆ బొమ్మలని చూస్తూ కనుల విందు చేసుకున్నారు.

''యేం అలా మూగగా వున్నారు? వాటికి వీడ్కోలు చెప్తున్నారా? బాగుంది. యిప్పుడా బొమ్మలకి సొంత బతుకు వచ్చింది. అవి నా పిల్లలైనట్టుగా నేను వాటికి యెప్పుడూ

వీడ్కోలు చెబుతూనే వుంటాను. వున్న వొక్క వూరటా యేమంటే యీ అందం ప్రజలకి ఆనందాన్నిస్తుంది. వూ, లుకా, మన పనివాళ్లందరికీ కొంత సంతోషం కలిగించే వేళ యిది. యెవళ్లెవళ్లకి యెంత ముట్టాలో అంతా ఆర్నెల్ల జీతం యిచ్చెయ్యి."

లుకా ప్రతివాళ్లనీ కొట్టు గదిలోకి తీసికెళ్లాడు. దళసరిపాటి చిఠ్ఠా తీశాడు. యెవళ్లు యే పని చేసిందీ అందులో రాసివుంది. వాళ్లకివ్వాల్సింది యిచ్చేడు. ఉమేదువార్లకి తలా ఆరు తూములు రై పిండినీ, ఓట్ ధాన్యాన్నీ యిచ్చేరు. పనివాళ్లకి పది తూముల పిండినీ, రెండేసి పీపాల బీరునీ, ఒకో పీపా తేనెనీ యిచ్చేరు. బాగా నిపుణులైన వాళ్లకి అదనంగా మరో మూడు తూములు ఉప్పు యిచ్చేడు. వాళ్లలో యెగోరి కూడా వున్నాడు.

నికొదీమ్ అందరికీ మూడ్రోజులు సెలవు యిచ్చేడు. యిళ్ల దగ్గర పనులు చక్క బెట్టుకు రావడానికి వెళ్లమన్నాడు. కాయగూరల మళ్లు దున్నుకోవచ్చు, యింటి మరమ్మతు చేసుకోవచ్చు, లేదా వూరికే యింట్లో తమ వాళ్లతో కలిసి గడిపిరావచ్చు. తను మాత్రం పడుకున్నాడు, విశ్రాంతి తీసుకున్నాడు. తను అప్పుడే పూర్తి చేసిన పని తన యావచ్ఛక్తినీ హరించి వేసినట్టూ, వొక్క హృదయం మాత్రమే మిగిలినట్టూ వున్నాడు.



చెయ్యడానికి యేమీ లేక యెగోరి వూరికే తిరిగాడు. నది దగ్గరికి వెళ్లేడు. చక్కటి గాలినీ, అడివి వాసనలనీ ఆఘ్రాణించడానికి వెళ్లేడు.

మాస్కో నది అవతల యెంత హరితంగా, ప్రశాంతంగా వుంది! భూమిమీదనుంచి ఆకాశకర్పరం దాకా మహా ప్రశాంతత ఆవరించుకుంది. తనవెనక యెక్కణ్నో దూరంగా మహానగరం విస్తరించుకుంది. మహాకుడ్యాలు, ఆవరణలు, దృఢమైన ద్వారాలు అక్కడ వున్నాయి. మదించిన రక్త పిపాసి జార్ యెన్నడూ లేనట్టే వుంది యిక్కడి ప్రశాంతత. ఆ ఆందోళనకర చింతలూ పోయాయి.

నీలి ఆకాశ నేపథ్యంలో యెగోరి యేకాంతంగా నుంచున్నాడు. హృదయం తేలిగ్గా వుంది. సంతోషంతో నిండిపోయింది. అలాంటిది బాల్యంలోనే అనుభూతం అవుతుంది.

అక్కడక్కడ చిన్న పసుపుపచ్చ పువ్వులు యెండలో మెరుస్తూ కనిపిస్తున్నాయి. దూరంలో బర్చ్ చెట్ల లేత ఆకుపచ్చ పత్రాలు చిన్న పిల్లల ఉంగరాల ముంగురుల్లా కనిపిస్తున్నాయి.

హఠాత్తుగా యెగోరికి యెక్కణ్నో ఆకాశంలో యెత్తులో సెలయేటి గలగలలాంటి స్వరం వినవచ్చింది. అతను ఖాళీ జాగాలోకి పరిగెత్తి వెళ్లి చూశాడు. వినీలాకాశంలో, తెల్లని మేఘ పంక్తికింద హంసల దండు శ్రేణులు గట్టి మాస్కో వదిలి యెగిరిపోతోంది. అవి

పెద్ద తెల్ల రెక్కలు ఆడించడం పైనుంచి వినిపిస్తోంది. ఆఖర్న వెళ్ళే హంస తల తిప్పి యెగోరిని చూసింది. అతన్ని మిత్రుడిలాగా పిలిచింది.

తన ప్రియమైన ఇళ్ల ఆయకట్టు ప్రరుకి వాటి రెక్కలమీద పోవాలని యెగోరి యెంత ఆత్రపడ్డాడు! అమ్మమ్మ, భార్య బిడ్డలు తన కోసం చూస్తూ వుంటారు. పిల్లి తెరేంతీ కూడా! అక్కడ తన బాల్యంనాటి నీలఘంటం పువ్వులు, మృదువైన పారిజాతాలు పూస్తూ వుంటాయి. వెచ్చని రాత్రిళ్లప్పుడు అందమైన మత్స్య కన్యలు హోసం నదిలో నీళ్ళ చిమ్ముతూ వుంటారు. పైన తోపులో వో కుంటి అడివిదెయ్యం తొర్ర చెట్టులోనుంచి కూస్తూ వుంటుంది. యింటి దగ్గర పొయ్యి వెనక్కాల వో చిన్న యింటి దెయ్యం వుంది. తెడ్లనీ, కదుళ్లనీ దాచేస్తూ రాత్రిళ్లప్పుడు తన కుచేష్టలు మొదలెడుతుంది. దాన్ని పట్టుకుని గడ్డం మెలిపెట్టక పోతే యిక చచ్చినా వాటిని తిరిగి యివ్వదు.

కోడిపుంజు పేత్కా వుంది. కంచెమీదనుంచి యెప్పుడూ కొక్కొరోకో అనదు. కప్పు మీదనుంచి మాత్రమే కూస్తుంది. సరిగ్గా అడ్డ దూలంపైన కూర్చుని చెవులు చిల్లులు పడేటట్టు కూస్తుంది. అప్పుడు రెక్కలు బార్లా చాపి డేగలాగా కిందికి యెగురుతూ దిగుతుంది. దాని రెక్కలు ఆకుపచ్చగా, ఎర్రగా వుంటాయిగా, అవి యెండలో మెరుస్తాయి – పురాణ గాధల్లోని సీరిన్ పక్షిలాగా. లేకపోతే అది నిజంగా సీరిన్ పక్షేనేమో, యేదో మంత్రకట్టు వల్ల కోడిపుంజుగా మారిందేమో.

ఇళ్ల ఆయకట్టు ప్రరూ! ప్రియమైన ఇళ్ల ఆయకట్టు ప్రరూ!



తెల్లని హంసలు మాస్కో వదిలిపెట్టి వెళ్లిపోతూ వుండడం చూసిన ఆ రోజున యెగోరి తనూ వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాడు. కాని మొదట కుడ్య చిత్రాలకి రంగులు వెయ్యాలి. పని మధ్యలో యెగ్గొట్టి నికొదీవ్‌నీ యితరులనీ దగా చెయ్యలేదు తను.

లుకా ఉమేదువారులతో కలిసి అవసరమైన వాటన్నిట్నీ బజార్లో కొనేసి బళ్లకి యెత్తి పెరట్లోకి తీసుకువచ్చాడు. దూరప్రాంతం రొస్తోవ్‌నుంచి వచ్చిన వర్తకులు పదేళ్లనాటి వందాయాభై పీపాల పాత సున్నాన్ని అమ్మేరు.

వాళ్ల అదునులోనే నారని నానబెట్టి చక్కగా చితగ్గొట్టేరు, అయిదు వారాల క్రితం. యిప్పుడు మోపులుకట్టి ముక్కలు కోశారు. సున్నం, జిగురు కలిపి గోడలకి పెట్టే సీమసుద్ద పీచులేకుండా తరకలు అవుతుంది.

పెరట్లో ఆ సున్నాన్ని యిసక, నార, నీరూ పోసి పెద్ద కయ్యల్లో కలిపారు. కొయ్య తెడ్డుతో ప్రతిరోజూ దాన్ని బాగా కలిపారు.

నికొదీమ్ పనివాళ్ల మధ్య పని విభజించేడు.

''మిరోన్, గ్రీష్కానీ అంద్రూష్కానీ తీసికెళ్లి కప్పుదాకా పరంజాకట్టు. జాగ్రత్త సుమా పిసరు బెసికి యెవళ్లన్నా పడ్డారో, — దేవుడు దయచూసి అలా జరగకూడదనుకో — చూస్కో నా తడాఖా.''

''చూడండయ్యా! నేనిప్పటికే యిద్దరి పని చేస్తున్నాను. అయినా నామీద యెప్పుడూ గుర్రుగుర్రుమంటూ వుంటాడు'' అని గొణిగాడు మిరోన్.

''యెగోరి, నువ్వూ ఇస్త్రోమ, నికీఫర్ కొయ్య మేకులు తీసుకుని ఇటికల మధ్య దిగెయ్యండి. బాగా యెడంగా వుండేట్టు చూడండి. మరీ లోపలి కంటా దిగ్గొట్టక గోడ యివతలకి రెండు వేళ్లు వుండేటట్టే కొట్టండి.''

''యెందుకది ఇస్త్రోమా?'' అని యెగోరి నిదానంగా అడిగేడు.

''ఆ సీమసుద్ద గోడనుంచి వూడిపోకుండానూ.''

ఆఖరికి వో వారం తర్వాత కయ్యల్లోని సీమసుద్ద తయారయాక, కప్పుదాకా పరంజా నిలబెట్టాక, నికొదీమ్ మరోసారి వాళ్ల పాపాల్ని స్నానాలగదిలో కడిగేసుకొమ్మని వాళ్లని ఆజ్ఞాపించేడు. చర్చికి పరిశుద్ధులై రమ్మని చెప్పేడు.


ఉదయం అందరూ చర్చి దగ్గర చేరాక నికొదీమ్ ప్రార్థన చేశాడు. ''యిప్పుడు, దేవుడి దయవల్ల సీమసుద్ద పూయడం మొదలుపెట్టండి. మొదటగా గోడని నీటితో తడపండి లేకపోతే అంటుకోదు. మర్చిపోవద్దు.'' అని గంభీరంగా వాళ్లతో చెప్పేడు.

అప్పుడు వాళ్లు గోడని పైనుంచి కడవలతో నీళ్లు పోసి తడపడం మొదలుపెట్టేరు. మందంగా సీమసుద్దని పూయడం మొదలుపెట్టారు. ఇనప తాపీలతో పామేరు. మొదటి పూత ఆరగానే రంగులు కలపమని నికొదీమ్ పురమాయించేడు.

పొడి రంగుల్ని నీళ్లతోనూ, గుడ్డు పచ్చసొనతోనూ వెడల్పాటి నున్నటి రాళ్లమీద కలిపారు. చాలా సేపు మిశ్రితం చేస్తూ కలిపారు.

మూడవ రోజున నికొదీమ్ కప్పు పైకంటా యెక్కాడు. ''మూడు తొట్టెల సీమసుద్దని యిక్కడికి తెండి. జాగ్రత్తగా యెక్కండి. మిరోన్ కట్టిన పరంజా అంత గట్టిగా లేదు'' అని అరిచాడు.

 ''బాగానే వుంది'' అని మిరోన్ అరిచాడు.





''జీను వేసిన ఆవులాగా. వ్వూ, మీ వీపులు జాగ్రత్త'' అని లుకా గొణిగి, అరిచాడు. భారమైన తొట్టెల్ని పైకి తీసికెళ్లారు.

''రెండవ పూత పల్చగా చెయ్యండి. నాకు రెండింతలు యెత్తు వుంటే చాలు యిక అక్కర్లేదు.''

''అంత తక్కువ యెందుకని?'' అని యెగోరి ఆశ్చర్యపోయి అడిగాడు.

''యేమంటే యింకా తడిగా వుండగానే రంగు వెయ్యగలం. రంగు సున్నంతో కలిసి యిక యెప్పటికీ మాయకుండా వుంటుంది. అంచేత వొక్క పట్టులో యెంత మేరకి బొమ్మ వెయ్యగలిగితే అంతమేరకే సీమసుద్ద వెయ్యండి. యెండిపోయిన సీమసుద్దమీద రంగు వేస్తే వూడొచ్చేస్తుంది.''

కప్పుమీద ఆ సీమసుద్దని పూసి మెరిసేదాకా దాన్ని గొ్రెతోలుతో మెరుగుపెట్టారు. అప్పుడు నికొదీమ్ గీయడం మొదలుపెట్టాడు. స్ఫుటంగా, గబగబా పల్చని యెర్ర రంగుతో వొక గీత గీసి క్రీస్తు తల స్థూలరేఖల్ని గీశాడు.

''స్థూలరేఖలమీద చాకుతో గియ్యి యెగోరి. గబగబా! దానిమీద గీస్తూ వుండు. లేకపోతే ఆరిపోతుంది. భోజనాల వేళకి రంగులు అయిపోవాలి'' అని నికొదీమ్ తొందర పెట్టాడు.

యెగోరి సీమసుద్దని పిండిని కోసినట్టుగా గీతలవారనే కోస్తూ పోయాడు. నికొదీమ్ బొమ్మ ముఖానికీ చేతులకీ ఆకుపచ్చ జేగురు రంగు కలిపాడు.

''ముఖం మరీ ముదురు రంగులో వున్నట్టవదూ?'' అని యెగోరి జాగ్రత్తగా అడిగాడు.

''తర్వాత పాటల వర్ణం, తెలుపు రంగులు వస్తాయి. గుర్తుంచుకో గోడలకి రంగులు వెయ్యడంలో ముదురు రంగునుంచి లేత రంగుకి వెడతావు. జీవితంలో కూడా అలా అయితే యెంత బాగుంటుంది!'' అన్నాడు నిట్టూర్చి. ''ముదురు పొరలు తక్కువ వుంటాయి, మరింత తేజోవంతమైనవి వుంటాయి. జార్ నోవ్‌గొరొద్‌ని ధ్వంసం చేసిన విషయం మర్చిపో లేకుండా వున్నాను. అనాగరిక తండాలు కూడా అలా నిర్ధామధూమం చేసేట్టు ప్రవర్తించవు. చూడు, రాక్షసుడా, ప్రభువు నిన్ను శపిస్తాడు. సైతాన్ వలలో చిక్కుకుని విలవిల్లాడ తావు'' అన్నాడు.

కడ సారిగా వర్తికని వూపేడు. తనన్న మాట కింద గీత గీస్తున్నట్టు. తర్వాత పక్కకి తొలిగేడు. గోడ పైనుంచి వో జత కళ్లు యేగోరికేసి చూశాయి. భయంకరంగా వున్నాయా

కళ్లు, శపిస్తూ ఉగ్రంగా వున్నాయి. యెగోరి నిశ్చేష్టుడైపోయాడు. బెదిరాడు.

''ప్రభువు నాకేసే అలా చూస్తూ వుంటే, హంతకుడైన జార్ యిక్కడికి రాకుండా వుండడమే మెరుగు. దెబ్బకి హతుడై పోతాడు'' అనుకున్నాడు యెగోరి, శిలువ గీసుకుంటూ.

ఆ వేసవి కాలం అంతా వాళ్లు యెత్తైన చల్లని గోడలకి రంగులు వేస్తూనే వున్నారు. గుండ్రంగా వున్న గోపురాలకి, కమాన్లకి, గుమ్మటం కోణాల్లో త్రిభుజాలకి రంగులు వేస్తూనే వున్నారు.

ఆనాటి రాత్రి నికొదీమ్ కొవ్వొత్తితో తనకి మాత్రమే గోచరమయే కుడ్య చిత్రాలు గీసిన చోట లేత రంగుల అంబరాలు ధరించిన దేవతలు ప్రత్యక్షమయ్యారు. వాళ్లు గిరి గీసుకుని దూరంగా వుండలేదు. నేలని దున్ని, విత్తులు చల్లి, తమ చల్లని ఆశీర్వచనంతో ఆమని పండుగ జరుపుకునే రైతాంగంతో కలిసిపోయారు.

గర్భ గుడికి యెదురుగ్గా వుంది గోడ విశాలమైన భాగం. ఆ రాత్రి ఆగ్రహంతో కొవ్వొత్తి తీసుకుని నికొదీమ్ యెవళ్లనో కొట్టింది అక్కడనే. ఆ గోడమీద తుదితీర్పు అరుణ జ్వాలతో మండింది.



ఆ గోడకేసి చూడడం భయంకరంగా వుంది. క్రీస్తు శాపగ్రస్తమైన పాపాత్ములు నరకలోకపు అంతఃగర్భంనుంచి యెగిసి యెగిసి వచ్చే మంటల్లో పడిపోతూ వుండడం చూస్తే వెన్నులో వొణుకు పుడుతుంది. పాపాత్ముల్ని నల్లని దెయ్యాలూ ఇనపకొక్కేలూ సైతాన్ దగ్గరికి లాక్కుపోతూ వుంటే భయంతో బాధతో చేసే హృదయ విదారక రోదనలు వింటే వెన్నులో వొణుకు పుడుతుంది. వాళ్లని వాడిగా వుండే గోళ్లతో పట్టుకుని రక్తసిక్తమైన పాశవిక నేత్రాలతో చూస్తూ సైతాన్ కుదిపేస్తాడు.

యెగోరిని మాస్కోకి తీసుకువచ్చిన వీధి వర్తకుడు వొక రోజున చర్చికి వచ్చేడు. ''కీడు ముంచుకు రాక ముందే ఉత్తరాదికి వెళ్లిపోతాను. క్రైమియానుంచి తాతార్లు మళ్లీ మాస్కోమీదకి దండు వస్తున్నారు. వాళ్లని యెన్నో సార్లు తరిమేశాం అయినా మళ్లీ వొస్తున్నారు'' అన్నాడు.

వాళ్ల దగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోదామని అటు తిరిగాడు. అతని కళ్లు తుదితీర్పు మీద పడ్డాయి. అంతే కుప్పకూలిపోయాడు.

''ప్రభూ! కరుణించు. పశ్చాత్తాప పడుతున్నాను. నిర్భాగ్య పాపాత్ముణ్ని'' అంటూ

చర్చి బయటికి పాకుకుంటూ తల పైకి యెత్తకుండా వెళ్లిపోయాడు.

''విన్నారా నాయనలారా! యెంత గబగబా అయితే అంత గబగబా పూర్తి చెయ్యాలి. పాషండులు యిట్టే వచ్చి పడతారు. అప్పుడు కుంచెలు తిప్పం, గొడ్డళ్లు తిప్పుతాం'' అన్నాడు నికొదీమ్ విచారంగా.

యిక మిగిలిందల్లా పరివేషాలకి బంగారు పూత పెట్టడం, బొమ్మలకింద సూక్తులు రాయడం.



''యెగోరీ'' అని నికొదీమ్ పరంజా మీదనుంచి కేక వేశాడు. ''మెరుగునూనెని వెచ్చ జేసి ఎరుపు రంగుతో కలుపు. బంగారం పూద్దాం'' అన్నాడు.

వాళ్లు నాణేలనుంచి బంగారు రేకుల్ని తీశారు. ఒకో నాణెంనుంచి వందేసి చిన్న రేకులు వచ్చాయి.

సాయంత్రం దాకా పరివేషాలమీద వేడి మెరుగునూనె పైన బంగారపు రేకుల్ని మొత్తం బృందం అంతా అతికిస్తూనే వుంది. గోడలనుంచి వందలాది చిన్న చిన్న సూర్యుళ్లు ప్రకాశించడం మొదలుపెట్టారు. చర్చి నిజంగా దివ్యంగా శోభిల్లింది. గంభీరంగా, రాజసంగా వుంది. అయినా గర్విష్టి యువరాజులాగా లేదు. అలాంటివాణ్ణి యెవరూ దరి చేరరు. కాని రష్యన్ గ్రామీణ ప్రాంతంలాగా వుంది. గ్రామీణ ప్రాంతం యెవర్నీ తరిమెయ్యదు. రష్యన్ గ్రామీణ ప్రాంతం ప్రతి వొక్కళ్లకీ వూరటనిస్తుంది. ఉత్సాహం కలిగిస్తుంది.

''యిప్పుడు సాయం సంధ్య అయింది. పని చాలించి కిందికి దిగండి'' అని నికొదీమ్ అలిసిపోయి అన్నాడు.

''మీరో?'' అని లుకా అడిగాడు.

''గుమ్మటం పైనుంచి వొకసారి చూస్తాను.''

నికొదీమ్ పైకి యెక్కలేదు, చప్పుడు లేకుండా తలుపు తెరుచుకుంది. జార్ రాయసగాడు ఇవాన్ విస్కోవాతీ చర్చిలోకి వచ్చేడు.

''యిప్పుడు నల్లని చీకటే వొచ్చింది'' అని లుకా పళ్ళు పట పట కొరికాడు. ''యీ గుడ్లగూబ పంకర ముక్కుతో దేశద్రోహాన్ని పసికడుతుంది'' అన్నాడు.

రాయసగాడు వొక్క మాటా అనలేదు. అక్కడ యెవరూ లేనట్టే దొంగగా, జాగ్రత్తగా అన్నిట్నీ పరిశీలించడం మొదలుపెట్టాడు. ముంగిలాగా కుడ్య చిత్రాల్లోకి తేరిపార చూశాడు. గోడనుంచి గోడకి పరిగెత్తాడు. వాసనలనిబట్టి వెళ్లే కుక్కలాగా, ఆహా అనుకుంటూ, శిలువ గీసుకుంటూ పరిగెత్తేడు.

''ఓహో యిదా మీరు చేసిన పని. దైవదూషణ చేసేవాళ్ల గూడు యిది నిజంగా. సైతానే మీ కుంచెలని నడిపించి వుంటాడు'' అని అంటూనే వున్నాడు.

''యేం మతి పోయిందేమయ్యా?'' అంటూ నికొదీమ్ పైనుంచి అరిచాడు. యెంత భయంకరంగా అరిచాడంటే బెదిరిపోయి విస్కొవాతీ తల వాలిపోయింది. ''యిక్కడ ద్రోహం యేం వుంది? నీ కళ్లు నులుముకో. నిందలతో అవి బైర్లు కమ్ముకుపోయాయి'' అన్నాడు.

''యెటు చూసినా దేశద్రోహమే కనిపిస్తోంది'' అనిగీ పెట్టాడా రాయసగాడు, ఆగ్రహంగా వేళ్లతో గోడల్ని తడుతూ. ''యిదిగో! యిక్కడ! యిక్కడానూ! దేవతలు సాదా మనుషుల పక్కన నుంచున్నారు. ప్రార్థించడానికి బదులుగా మనుషులు పనిచేస్తున్నారు. యిదిగో చూడండి! పంట కోస్తూ యీ ఆడమనిషి గౌను చేతులు పైకి ముడుచుకుంది. యిది అవమానకరం. మీకు ధర్మ సూత్రాలంటే గౌరవం లేదు'' అన్నాడు.

''నీకు సిగ్గు యెక్కువే లేవయ్యా! ఆడమనిషి మోచేతులు చూడ్డానికే సిగ్గుపడి పోతావ్'' అంటూ నికొదీమ్ పైనుంచి ఉరిమాడు. ''నీలాంటి ధర్మసూత్ర ప్రియులైన వాళ్ల బారినుంచే మా గురువులు డయోనీసియస్ ఉత్తరానికి థెరాపాంట్ ఆశ్రమానికి పారిపోయారు. మీరాయన చేతులకి సంకెళ్లు వెయ్యకుండా వుండేందుకుగాను'' అన్నాడు.

కాని ఆ రాయసగాడు వినలేదు. యింకా పిచ్చిగా అరుస్తూ తాండవం చేశాడు.

''సైతాన్ బిడ్డలు! పాషండులు! మిమ్మల్నందర్నీ రాజధాని ప్రాడ్వివాకుల ముందు పెడతా.''


అనుకోకుండా వెనక్కి తిరిగేటప్పటికి అతనికి తుదితీర్పు చిత్రం కనిపించింది. తాచుపాముమీద అడుగు వేసినట్టుగా వొక్కసారి వెనక్కి జంకేడు. అతని కళ్లు ఉబ్బేయి. చేతులు చచ్చుబడి పోయాయి. నోరు వెళ్లబెట్టేడు. మాట పెగల్లేదు.

''సైతాన్ కోరల్లోకి యెవళ్లని మీరు తోసింది తుంటరులారా! స్వయంగా జార్‌నే! జార్‌నే! దేశద్రోహం!'' అని అరిచాడు.

కుంచెలు వున్న బల్ల దగ్గరికి రాయసగాడు పరిగెత్తేడు. పెద్ద కుంచెని లాగి నల్లని మసి వున్న వొ కుండలో ముంచి కత్తిలాగా దాన్ని వూపుతూ తుదితీర్పు చిత్రం కేసి పరిగెత్తాడు.

యిక రెండు అడుగులు వెయ్యాలి. కుంచెని బెదిరిస్తున్నట్టు వూపేడు.

''ఆగు!'' అని వొక గొంతుక పైనుంచి గర్జించింది. ''అడుగు ముందుకు వేశావా జాగ్రత్త!'' ఆ సమయంలో గుమ్మటం పైనుంచి యేదో ఫెళఫెళా విరుచుకు పడుతున్న



శబ్దం వినిపించింది. విరిగిన పలక ముక్కలు కింద పడ్డాయి. నికొదీమ్ రాతినేలమీద ధనా మని పడ్డాడు.

అంతా రెప్పపాటు వ్యవధిలో జరిగిపోయింది. ఆ రాయసగాని చేతిని పట్టుకున్న యెగోరి యేం జరిగిందో గ్రహించలేక పోయాడు. నికొదీమ్ నోట్లోనుంచి రక్తం కారుతూ వుండడం, ఆయన నిశ్చేష్టంగా నిస్సహాయంగా కనిపించడం చూశాకనే యెంత ఘోర ప్రమాదం జరిగిందో అతనికి అర్థం అయింది.

"అదునులోనే కిందికి దూకానా? గోడ పాడవలేదు కదా?" అంటూ నికొదీమ్ మృత్యుగ్రస్త అధరాలు గొణిగాయి.

"ఆc, ఆc, నికొదీమ్ బాబా!" అని యెగోరి గాద్గదికంగా అన్నాడు. ఆ ముసలాయనని లేవనెత్తబోయాడు.

"నన్ను తాకద్దు, నాయనా! వదిలెయ్యి. నేను యింక యెక్కువ కాలం వుండను..." అని నికొదీమ్ బాధతో మూల్గాడు.

"కాని యెలా జరిగిందిది బాబా" అని యెగోరి కళ్లనీళ్లు అదుముకుంటూ అడిగేడు.

"బద్దీలమీద అనుకున్నాను... మిరోన్ వాటిని గట్టిగా బిగించలేదు..."

"ఆగు! వుండాకోర్!" అని యెగోరి వొక్క ఉదుట్న గెంతాడు. "యెక్కడున్నావ్?" అంటూ మిరోన్ని గొంతు పట్టుకున్నాడు. మిరోన్ ముఖంలో కత్తివేటుకి నెత్తుటి చుక్కలేదు.

"వదిలెయ్యి నన్ను! చచ్చిపోతున్నాను" అని మిరోన్ అరిచాడు.

"అతన్ని వొదిలెయ్యి" అంటూ నికొదీమ్ గొణిగాడు. "అతనికి యెలాగా దౌర్భాగ్యం దాపురించింది... పనివాడు కాలేకపోతే మనిషి కూడా కాలేడు... రాయసగాడు యెక్కడ?" అని అడిగాడు.

"పలాయనం చిత్తగించాడు. నగర ప్రాడ్వివాకుల దగ్గరికి వెళ్లి వుంటాడు" అన్నాడు లుకా.


"దయామయుడైన ప్రభువు నా తలని జార్ వధ్యశిలమీద పెట్ట నివ్వలేదు... నేను నా మెడమీద తలతోనే ఆయన ముందు ప్రత్యక్షమవుతాను... నాకోసం విచారించవద్దు, నాయనలారా! చర్చిలో చచ్చిపోయే పుణ్యం యెవళ్లకోగాని లభ్యం కాదు. నేను మిమ్మల్నే దేనా కష్టపెడితే యేమీ అనుకోకండి..."

అక్కడున్నవాళ్లు తలలు వాల్చుకుని, చొక్కా చేతులతో కన్నీళ్లు తుడుచుకున్నారు.

"యిటు వంగండి" అంటూ నికొదీమ్ కంఠం నీరసంగా వినిపించింది. "యిదే

నేను మీకు చెప్పబోయే ఆఖరి మాట. భగవంతుడు మీకిచ్చిన ప్రతిభని దాచుకుని, యితరులకి అందివ్వకుండాపోతే మిమ్మల్ని క్రీస్తు అనంత యాతనలకి గురిచేస్తాడు... యెగోరి, నువ్వు నా స్థానం ఆక్రమించు'' అన్నాడు. అతని శరీరం కంపించింది. అతని ప్రాణజ్యోతి ఆరిపోయింది.

ఆ మర్నాడు అట్టహాసం యేమీ లేకుండా ఆ మృతునికి సంస్కారం జరిపారు. ఆ తర్వాత సన్నని శవపేటికలో తమ గురువు మృతకాయాన్ని పెట్టి ఖననం చేశారు. చర్చి పెరట్లో ఆ విధి నిర్వహించారు. తర్వాత యెవరి దారిన వారు వెళ్లిపోయారు. సార్వభౌముని అనుగ్రహంనుంచి యెంత దూరం పోగలిగితే అంత దూరం వెళ్లిపోయారు.



మూడవ ప్రకరణం

ఆకాశంలో ప్రకాశమానంగా వున్న చంద్రుడు తెల్లవారే వెలుతురులో మసక బారుతున్నాడు. మాస్కో వదిలి యెగోరి బయల్దేరేడు. నడుముకి పట్టీ బిగించి తేలిగ్గా బట్టలు వేసుకున్నాడు. కుక్కలు, దొంగలు బెదిరించకుండా వుండేదుగ్గాను కర్రనొక దాన్ని తీసుకెళ్లాడు. వీపుకి నాపసా తగిలించుకున్నాడు. అందులో రెండు పంచదార చిలకలు వున్నాయి. తెల్లని గుడ్డ వాటికి చుట్టబెట్టేడు. అవి దాషా, ఆన్యాలకి. యెర్ర గుర్రం బొమ్మ వొకటుంది.

అది బుజ్జి వాన్యకి. తను వచ్చేసాక కొడుకే పుట్టాడని అతని నమ్మకం. అకులీనా అమ్మమ్మ కోసం వో రుమాలు కూడా వుంది. మరీ డాబుగా లేదది. మాషా కోసం వెండి ఉంగరం. దానికి కణకణ మండే నిప్పు కణికలాంటి యెర్ర రంగు రాయి పొదిగి వుంది. తనకోసం నికొదీవ్ బాబా వాడిన ఓ పది వర్తికలు తెచ్చుకున్నాడు, ఆయన స్మృత్యర్థం.

అంతే. యెంత చేసినా గొర్రెతోక బెత్తెడేనన్నట్టుంది, అఫనాసీ తాత చెప్పినట్టు. కాని యెగోరి తనతో వో పెద్ద నిధిని తీసుకెడుతున్నాడు. అతని చేతులకి కొత్త నైపుణ్యం వొచ్చింది. అతని దృక్కు మరింత నిశితం అయింది. మరింత ఆకట్టుకుంటున్నది. అతని గుండె మరింత ధైర్యంగా, ఆత్మ విశ్వాస భరితంగా అయింది. తను దేనిమీద దృష్టి లగ్నం చేసినా దాన్నల్లా చెయ్యగలనని అతనికి అనిపించింది.

తన చుట్టూతా వున్న పల్లెటి ప్రాంతం యెంతో స్వేచ్ఛాయుతంగా, విశాలంగా వుంది. మాస్కోలో యేదో సర్వదా అడ్డం వొస్తున్నట్టే వుంది. రాతి గోడలు, కొయ్య గుంజల దళ్లు, బోయర్ల వీపులు, కుంటి భిక్షకులు. యీ బయలులో దిఙ్మండలం అంచుదాకా కనిపిస్తుంది.

యెగోరి గబగబా నడిచేడు. నాట్లు అయిపోయి వుంటాయి, ఆలస్యంగా వెడుతున్నాడు తను. కోతల వేళకేనా వెళ్లగలిగి వుండాలి. ఒకో అప్పుడు రాత్రిళ్లు కూడా ప్రయాణం చేశాడు. ఓనాటి రాత్రి దురదృష్టకరమైన సంఘటన జరిగింది. అతన్ని బాగా మర్దించారు. మగాళ్లు కాదు యింతా చేసి! ఆడవాళ్లు!


జరిగింది యిది.



వెచ్చగా వున్న వో వేసవినాటి అర్ధరాత్రి వేళకి అతను వో గ్రామం శివారులకి చేరేడు. అక్కడ శ్మశానంలా నిశ్శబ్దంగా వుంది. వున్నట్టుండి ధనామని చప్పుడు వినిపించింది. అరుపులు యేడుపులు వినిపించాయి.

‘‘యేమిటై వుంటుంది? పిశాచాలు పండగ చేసుకుంటున్నాయా యేమిటి?’’ అని భయపడుతూ అనుకున్నాడు యెగోరి.

అప్పుడు ఆడవాళ్లు గుంపుగా చివరి యింట్లోనుంచి యివతలకి వచ్చేరు. వాళ్ల తెల్ల గౌన్లు చీకట్లో బాగా కనిపిస్తున్నాయి. చెప్పుల్లేకుండా దిసపాదాలతో వున్నారు. వాళ్ల జుట్టు కిందికి వేలాడుతోంది. ఎదర వొక పడుచు పిల్ల వో దేవతా చిత్రం మోసుకువస్తోంది. ఆమె వెనకాల వో ఆడమనిషి మంత్రకత్తెలాగా చీపురు కట్టమీద స్వారీ చేసుకువస్తోంది. ఆమె వెనకాల యింకా బోలెడుమంది ఆడాళ్లు వస్తున్నారు. వాళ్లు అరుస్తున్నారు. గోల చేస్తున్నారు. పెనాలనీ, కుంపట్లనీ, కొడవళ్లనీ, సలాకలనీ అట్లకాడలనీ బలం అంతా ఉపయోగ





పెట్టి మోదుతున్నారు. సరిగ్గా వెనక్కాల వో ముసలమ్మ బరువైన మేడి లాగుతూ వస్తోంది. నేలమీద చాళ్లు దున్నుతోంది.

‘‘యీ సిగ్గులేని యిల్లాళ్లు యేమిటి చేస్తున్నారు?’’ అని యెగోరి ముఖం చిట్లించుకున్నాడు.

సరిగ్గా ఆ సమయంలో ఆ ఆడవాళ్లు అతన్ని చూశారు. అందరూ వొక్క ఉదుట్న ‘‘అదుగో మన ఆవులపాలిటి దూము! కొట్టండి, అమ్మాయిలూ, చావగొట్టండి! మళ్లీ మన దూళ్ల జోలికి రాకుండా!’’ అని అరిచారు. కొంతమంది పాపం దిక్కుతోచని యెగోరి మీదకి లంఘించారు. అట్ల పుల్లలతో, పెనాలతో, కర్రలతో అతనిమీద పడ్డారు. మిగిలిన వాళ్లు అతని జుట్టు పీకారు.

‘‘యేమిటిది? మీకేమన్నా పిచ్చి పట్టిందా? మీకు ఆవుల దూము చూపిస్తా! పాండి’’ అంటూ యెగోరి అరిచాడు.

నాపసాని శిరస్త్రాణంలా అడ్డం పెట్టుకుని కాసుకుంటూ గుంపులోనుంచి బయటకి చొచ్చుకురావడానికి ప్రయత్నించాడు. రెండో చేత్తో ఆడవాళ్లని తోసేస్తూ, కాలికి బుద్ధి చెప్పాడు. లేకపోతే చేసేదేముంది? ఆడవాళ్లూ దెయ్యాలూ ఒకే మచ్చు. ఉట్టిపుణ్యానికి చావచితక గొట్టేస్తారు.

అతను పారిపోతూ వుంటే ఆడవాళ్లు పాటలు పాడ్డం మొదలుపెట్టారు.

దూముని దున్ని పారేశాం, పారేశాం
నిలువు లోతున పాతేశాం, పాతేశాం
అశ్వాలూ, ఆవులూ, కుక్కుటాలూ, సూకరాలూ
మేషాలూ మనును హాయిగా పీడలేక.

వాళ్లు యింకోసారి అరుస్తూ, గోలచేస్తూ, చప్పుడుచేస్తూ పాటలు పాడుతూ వూళ్లో వూరేగారు. మూడు సార్లు వూరేగారు. మూడు చాళ్లు దున్నేరు. యిప్పుడు ‘‘దూళ్ల దూము’’ వూళ్లోకి రావాలంటే భయపడుతుంది.

వూళ్లో మగాళ్లకీ చాళ్లు దున్నడం వ్యవహారం తెలిసే వుండాలి. అందుకనే యెవళ్లూ పక్కలు దిగలేదు. చాళ్లు దున్నే సమయంలో ఆడవాళ్లకి యెవళ్లేనా తటస్థపడితే వాళ్లనే దూళ్ల దూము అనుకొని వాళ్లు జాలీనాలీ లేకుండా చావచితక గొడతారని వాళ్లకి తెలుసు.

కాని పాపం యెగోరికి యీ ఆచారం సంగతి యేమీ తెలీదు. అంచేత అతను అడివికి

అనుకుని వున్న గడ్డిమేటులో దాంకున్నాడు. వాచిపోయిన కంటిమీద తమలపాకు పెట్టుకుని, తలమీద తగిలిన దెబ్బలకి మర్దనా చేసుకున్నాడు.

మళ్ళీ చుట్టు పక్కల అంతా నిశ్శబ్దంగా, ప్రశాంతంగా అయింది.

యెగోరి తల బయటికి పెట్టి నక్షత్రాలకేసి చూస్తూ గడ్డిమేటు లోపల పడుకున్నాడు. ఆకాశంలో నక్షత్రాలు నిండుగా మిణుకుమంటున్నాయి. నల్లని చాందినీకి ముత్యాలు పొదిగినట్టు వున్నాయి.

''యెక్కణ్ణుంచి వస్తాయి యివి? అల్లరి దండులు చంద్రుణ్ణి చుక్కలకింద ముక్కలు చేస్తారట, నిజమేనేమో?''

అంతట్లోకీ వొక నక్షత్రం హఠాత్తుగా నల్లని ఆకాశం మధ్యగా దూసుకుపోయింది. దాని వెనక వెలుగు జాడ మెరిసింది. నక్షత్రం రాలిపోతే యుద్ధాలు వస్తాయని అకులీనా అమ్మమ్మ చెప్తూ వుండేది.

''ఆ జోస్యం నిజమేరా బాబూ! ఆ ఆడాళ్ళ బాగా దాంకునేట్టు చేశారు'' అనుకొని యెగోరి ఆశ్చర్యపోయాడు.

సువాసన లీనే వెచ్చని గడ్డిలో పడుకుని నిద్రపోయాడు. మర్నాడు తెల్లవారింది. నేలమీద మంచు బిందువులు పడ్డాయి. తొలిసంజె పొగమంచు సూర్యుడినుంచి తప్పించుకుని చరియలో దాంకుంది. దుశ్శకున సూచక శబ్దాలతో అతనికి మెలుకువ వచ్చింది.

''ఆ ఆడాళ్ళ యింకా దూళ్ళదూముని పాతేస్తున్నారా యేమిటి?'' అనుకున్నాడు.



వూరికేసి చూశాడు యెగోరి. యేముంది! యిళ్ళన్నీ దగ్ధం అయిపోతున్నాయి. సాయం చెయ్యడానికని యెగోరి పొలాలకి అడ్డంబడి పరిగెత్తుకు వెళ్ళేడు. మొదటి యిల్లు చేరేటప్పటికే అర్థమైంది. పొయ్యి రాజేసుకుంటూ వుంటే రవ్వలు లేచి రగులుకున్న మంటలు కావు అవి. కాగడాలు వూపుతూ వుండే అశ్వికులు రగిలించిన జ్వాలలు! కటువుగా అరుస్తూ వాళ్ళు పిచ్చిపిచ్చిగా పరుగులు తీస్తున్నారు. గొర్రెలమీద తోడేళ్ళు వురికినట్టుగా వురుకుతున్నారు. పాపం జనం యిళ్ళల్లోనుంచి పారిపోతున్నారు. అప్పుడు వంపులు తిరిగిన కత్తులతో అమాయిక జనాలని చెండుతున్నారు.

యెగోరి రక్తం ఉడికిపోయింది. ''ఛీ! తుచ్ఛుల్లారా! మా అమ్మకీ నాన్నకీ మీ రక్తంతో తర్పణం యిస్తాను.'' పక్కన దూసుకుపోయే గుర్రంమీదకి చిరుతపులిలా గెంతేడు. యీటెని లాక్కున్నాడు. శత్రువుమీదకి సరాసరి గురిపెట్టేడు. ఎలకని పొడిచినట్టు ఒకణ్ణి పొడిచేడు.

‘‘రండి, రండి! అక్కడ అలా తేభ్యాల్లా నిలబడద్దు! గంద్ర గొడ్డళ్ళ తెండి! నరకండి! యీ తుచ్ఛుల్ని’’ అంటూ అరిచాడు.

తమ ముందు వొక వీరుడు వున్నాడని చూసి మగాళ్ళ ధైర్యం తెచ్చుకున్నారు. గుర్రాలమీద కూర్చున్న దుండగీళ్ళని కొడవళ్ళతో, బల్లేలతో మోదడం మొదలుపెట్టారు. ప్రాణాలకి తెగించి పోరాడేరు. ఆ దుండగీళ్ళని సగం మందిని హతం చేశారు. మిగిలినవాళ్ళ గుర్రాలని అదిలించి బ్రతుకు జీవుడా అని వూళ్ళోనుంచి పారిపోయారు.

పోరుచేస్తున్న వేడిలో యెగోరి, మరో యిద్దరు ఆ వూరి కుర్రాళ్ళా ఆ దుండగీళ్ళని తరుముకుంటూ వూరుదాటిపోయారు. అడివి చేరేటప్పటికి ఆ ఆశ్వికులు చీలిపోయి వీళ్ళని చుట్టు ముట్టేరు.

‘‘హాఁ! హాఁ! రష్యన్లూ! మీరే తెలివైన వాళ్ళనుకున్నారేం?’’ అంటూ యెత్తిపొడిచాడు వాళ్ళ నాయకుడు. మిగిలినవాళ్ళ యెగోరి ఛాతీకేసి బాణాలు యెక్కుపెట్టారు.

‘‘దైవప్రార్థన చేసుకో! త్వరలోనే ఆయన సన్నిధానంలోకి వెడతావు.’’

యెగోరి కోపంతో కుతకుత లాడిపోయాడు.



‘‘యిల్లలకగానే పండగ్గాదు, పురుగా! ప్రతి యెలుగుకీ బాణముంది!’’ అని యీటె ఝుళిపిస్తూ అరిచాడు. కాని అది గురితప్పి దుండగీడు తలమీద వున్న నక్క తోక టోపీని కింద పడేసింది. అతని బోడి గుండు బయటపడింది.

ఆ దళవాయి ఆగ్రహంతో పళ్ళ కొరికాడు.

‘‘అయితే రష్యన్ ధైర్యం వున్న యెలుగుబంటి అన్నమాట, ఆఁ?’’

వాళ్ళ భాషలో యేదో మొరిగాడు. అన్ని వేపులనుంచీ యెగోరిమీదకీ, అతని మిత్రుల మీదకీ ఉచ్చుతాళ్ళ వచ్చి పడ్డాయి. అవి జీనుల మీదనుంచి కిందకి లాగేశాయి వాళ్ళని. కంకర రాళ్ళమీదనుంచి, యెగుడుదిగుడు బండలమీదనుంచి అడివి అవవలివేపు వాళ్ళని బందీలుగా తీసుకుపోయాయి.

రక్తసిక్తమైన బందీలని చెమటలు కక్కే గుర్రాలు యీడ్చుకుంటూ పోయాయి, శత్రువు శిబిరం చేరేదాకా. అది సుమారు రెండున్నర కోసులు వుంటుంది. అప్పుడు ఉచ్చు తాళ్ళ విప్పేసి వాళ్ళని నేలమీదకి విసిరారు. అక్కడ అప్పటికే పరిసర గ్రామాల వాళ్ళ యింకో డెబ్భైమంది బందీలుగా వున్నారు. యెగోరి చుట్టూ చూసి కంపించి పోయాడు.

 ఆ పచ్చిక మైదానం తాతార్లతో నల్లగా వుంది, మిడతల దండులాగా. కను చూపు

మేర నెగళ్లు రగుల్తూనే వున్నాయి. కొల్లగొట్టిన సంపదలతో పూటుగా వున్న బళ్ళు కనిపిస్తున్నాయి. బెదిరిపోయిన ఆవుల మందలు, గొర్రెల మందలు కూడా యెటు చూసినా కనిపిస్తున్నాయి. వాటిని హతమారుస్తారు ఆ దుండగులు. వీళ్లు కొల్లగొట్టినవాటిమీద జీవిస్తారు. వాళ్లవల్ల మాస్కోకి ముప్పు రావచ్చని ఆ అమ్మేవాడు చెప్పిన మాట నిజమే.

ఉక్కగా కాకయెత్తిపోయిన ఆ పగలూ, ఆ రాత్రీ అంతా యెగోరి నేలమీద పడే వున్నాడు. రక్తం ఆరిపోయిన అతని చొక్కా అట్టలా వుంది. అది గుచ్చుకుని గాయాలు నొప్పి పెడుతున్నాయి. బాధకి కళ్లు తిరిగిపోతున్నాయి. యెర్రటి వృత్తాలు కళ్ల ముందు లేస్తున్నట్టు వుంది. బాధతో మూలుగుతూ, శాపనార్థాలు పెడుతూ వున్న జనం అతని పక్కన పడి వున్నారు.

''మరేం ఫర్లేదు, నాయనలారా! ధైర్యం తెచ్చుకోండి. మనిషి నరకంనుంచి కూడా బయటపడగలడు'' అని యెగోరి వాళ్లని వూరడించాడు, వాచిపోయిన తన పెదాలని తనే సరిగ్గా కదల్చలేకపోయినా.

యెగోరిని బందీగా పట్టుకున్న దళవాయి వున్నట్టుండి దౌడు తీసుకుంటూ వొచ్చి ఆటవికంగా అరవడం మొదలెట్టేడు.

''హేయ్, నక్కల్లారా! మా ప్రభువు కొలువు చెయ్యడానికి యిష్టపడ్డవాళ్లు నాతో రండి. మిగతావాళ్ల తలకాయలు తీసేసి గుంజలమీద ఆరేస్తాం'' అన్నాడు.

అక్కడున్న మనుషులు చిరిచిరలాడుతూ చూసి యేమీ అనలేదు. అతని వెంట వెళ్లడం కంటే చావడమే మేలు అనుకున్నారు వాళ్లు. కాని యెగోరి లేచి నుంచున్నాడు.

''నన్ను మీ ప్రభువు దగ్గరికి తీసికెళ్లు. నేను ఆయన కొలువు చేస్తాను'' అన్నాడు.

అక్కడున్న మనుషులు ఆఁ అని నోళ్లు వెళ్లబెట్టేరు. దళవాయి యెగోరి కేసి యేవగింపుగా చూసేడు. అతన్ని తీసుకుని వెళ్లేడు.

శిబిరంలోనుంచి వెడుతూ వుంటే యెగోరి యెక్కడెక్కడ యేమేమి వున్నాయో అన్నిట్నీ శ్రద్ధగా పరిశీలించి చూశాడు. స్థితిమంతంగా కనిపించే పటకుటీరం చేరే లోపునే వో పథకం ఆలోచించేడు.

దాని ముందు వో దివ్యమైన పర్షియన్ తివాసీ పరిచి వుంది. దానిమీద ''విశ్వసార్వభౌముడే'' కూర్చున్నాడు. వో మేక కాలు భోంచేస్తున్నాడు. అతను కొవ్వు పర్వతంలాగా వున్నాడు. ముఖం యెర్రగా, గాలితో ఉబ్బరించినట్టు వుంది.

''వూఁ, సాహసంగల రష్యనూ! నా పక్షంలో చేరిపోతావా?''

''నా పుళ్ళు తగ్గనివ్వండి. అప్పుడు చూద్దాం'' అన్నాడు యెగోరి.


''అయితే యెందుకు వచ్చావు? మొదటగా నువ్వే చస్తావా?''

''అసలు చనిపోకూడదనే కదా మీ దగ్గరికి వొచ్చింది. నన్ను బతకనిస్తే మీకు ప్రపంచంలో యే యేలికకీలేని కానుక యిస్తాను.''

ఆ ఖాన్ పగలబడి నవ్వేడు. అతని బానకడుపు వూగిపోయింది.

''యేమిటది, ఆవుపేడా? నీ గడ్డం యిస్తావా? నాకు యిక మిగిలిన అన్నీ వున్నాయి.''

''ఆకాశ వీధినుంచి మీ యేలుబడిలో వున్న ప్రాంతాల నన్నిట్నీ పక్షిలాగా చూడాలన్న కోరిక లేదా మీకు?''



''అయిదు నెలల నాడు సజీవ సైనికుల గుట్టని పోగు పెట్టమని మా మనుషులకి ఆజ్ఞ చేశాను. ఆ గుట్టమీదకి గుర్రం యెక్కి వెళ్లాను. ఆకాశం నా తలకి తగిలింది. కాని అప్పుడు కూడా నా యేలుబడిలో వున్న భూములన్నిట్నీ చూడలేకపోయాను.''

''నేను మిమ్మల్ని యింకా పైకి తీసికెడతాను, నక్షత్రమండలానికే.''

''యెలా చేస్తావ్, గొర్రె తలకాయ వాడా?''

''వెయ్యి గొర్రె తోళ్లు తెమ్మని పురమాయించండి. మా మిత్రులూ నేనూ వో పెద్ద గుమ్మటం చేసి వేడి గాలి నింపుతాం. అది మిమ్మల్ని యింతవరకూ యే మానవుడూ వెళ్లని యెత్తుకు తీసికెడుతుంది.''

''ఓరి! ఓరి! రష్యనూ! నీ గొర్రె తలకాయ బాగానే వూహ చేసిందే. యిస్తాను ఆ తోళ్లని. యేడు రోజుల్లో నన్ను ఆకాశంలోకి యెత్తలేకపోతే నిన్నే అక్కడికి నల్లని పొగలాగా పంపేస్తాను. నిన్నూ, నీతోటి రష్యన్లనీ కాల్చిపారేస్తాను.''

యెగోరి అతని ముందు మోకరిల్లి నమస్కారం చేశాడు. వెళ్లిపోతూ తనలో తను తిట్టుకున్నాడు. ''నిన్ను తగలెయ్య పెద్దమ్మోరు నిన్ను కరకర నమిలేస్తుందిలే! బాన బొజ్జ రాజా!'' అనుకున్నాడు.

పళ్లు పటపట కొరుకుతూ అతను అక్కడ పోగయిన తన జనంలోనుంచి నడిచి వెళ్లాడు. వాళ్లు యీలలు వేస్తూ, యెత్తి పొడుపుగా నవ్వుతూ, కశాఘాతంలాంటి మాటలు అంటున్నారు తనని. వాళ్లల్లో వొకడు కోపంగా అరుస్తున్నాడు.

''యెంగిలి మెతుకులకి అమ్ముడుపోయావూ జూడాస్? నా చేతులు కట్టేసి వున్నాయి కాబట్టి బతికిపోయావు బాబూ! అయినా యేమిలే, పళ్లతో కొరికి చంపేస్తాను రాత్రి.''

 ''చాల్లే చవటా, నోర్ముయ్!'' అని యెగోరి నిదానంగా అన్నాడు. ''వినండయ్యా

అందరూ'' అని మెల్లిగా అన్నాడు పహారా వాళ్లకి వినిపించకుండా. ''నేనో పథకం ఆలోచించాను. అది నెగ్గిందా మనం బతుకుతాం, యేమిటీ అని అడక్కండి. చెప్పినట్టు చెయ్యండి.''

వాళ్లు యేమీ అనలేదు. అప్పుడు యెగోరితో బాటుగా బందీగా పట్టుబడ్డ వొకతను మాట్లాడేడు:

''యితన్ని యుద్ధం చేస్తూ వుండగా చూశాను. మనల్ని యితను ముంచడు. వూఁ చెప్పవయ్యా, యేం చెయ్యమంటావో మమ్మల్ని.''

ఆ మర్నాడు తెల్లవారింది. సూర్యుడు బెరుగ్గా దిఙ్మండలం వెనకనుంచి తొంగి చూస్తున్నాడు. ఆ వేళకి రౌతులు బందీలున్న చోటికి వో పెద్దగుట్ట గొర్రెతోళ్లని పట్టుకొచ్చారు.

''సోదరులారా! పని ప్రారంభించండి. మనకి యేడ్రోజులే వ్యవధి వుంది. ఆరెకి బదులు గట్టి యెముకలని తీసుకోండి. మైనం దారం బదులు నరాల్ని తీసుకోండి. యీ చర్మాల్ని కలిపి కుట్టండి. అయిదు అడ్డంగా, వంద కిందుగా వో పెద్ద తివాసీలాగా'' అన్నాడు యెగోరి.

పహారా వాళ్లు వాళ్ల చేతులకి కట్టిన తాళ్లని కోశారు. వాళ్లు ఆ తోళ్లని కుట్టడం మొదలుపెట్టారు. వొట్టినే పడి వుండటంకంటే యేదన్నా మెరుగే కదా. కారణం యేమో తెలీదుగాని యెగోరి ఆవు అస్థిపంజరాన్ని ఆ తోళ్లతో కలిపి కుట్టేడు.

వాళ్లు పనిలో వుండగానే ఆర్రోజులు యిట్టే గిర్రున తిరిగిపోయాయి. దెబ్బల గాయాలకి పదిమంది చనిపోయారు. కాని మిగిలిన వాళ్లు వొళ్లు దాచుకోకుండా కుట్టేరు.

సాయంత్రం వేళకి ''విశ్వసార్వభౌముడే'' గుర్రంమీద దౌడు తీసుకుంటూ వచ్చేడు. పంచకళ్యాణి గుర్రంమీద వచ్చేడు. అతని కూడా రక్షక భటులు వచ్చేరు.

''హేయ్! రష్యనూ! పూర్తయిందా?''

''అన్నమాట ప్రకారం రేపు పూర్తి చేస్తాం'' అన్నాడు యెగోరి.

''వూఁ, చెయ్యకపోతే వుండనే వుంది, భోగిమంట'' అని అతను గుర్రాన్ని కమ్చీకోలతో కొట్టి వెళ్లిపోయాడు.

ఆకాశంలో తొలి తారక పిరిగ్గా మిణుకుమంది. తర్వాత యింకో నక్షత్రం వచ్చింది. వాళ్లకి ఆఖరి రాత్రి అది, ఆ రాత్రి వచ్చేసింది.

''చాల్లెండి. కుట్టడం ఆపండి. యిప్పుడు గొర్రెల పుర్రెల్నీ, యెముకల్నీ తోళ్లకి కట్టెయ్యండి'' అన్నాడు యెగోరి.

''యెందుకీ చెత్తంతా?'' అని వాళ్లు అడిగారు.

''ఓపిక పట్టండి, మీకే తెలుస్తుంది.''

మైదానంమీద పడి వున్న పుర్రెల్నీ యెముకల్నీ యేరడం మొదలుపెట్టారు. అక్కడ యెక్కడ చూసినా అవే. యేమంటే దిమ్మరి తండా సైనికులు పొట్ట పూజ బాగా చేసుకునేవాళ్లు. యీ లోపున యెగోరి వాళ్ల వైద్య శిఖామణి బండి దగ్గరికి రహస్యంగా వెళ్లి కొంత గంధకాన్నీ, వనమూలికల్నీ కొట్టేశాడు. తర్వాత పెద్ద కంచు కూజాతో మంటమీద నీళ్లు మరగబెట్టి అందులో వనమూలికల్ని పడేశాడు. కొంచెం గంజాయి మొక్క విత్తనాలు వేశాడు. కూజా మరుగుతూ వుంటే తల దిమ్మెత్తిపోయే వాసన వొచ్చింది. ఆ వాసనకి గుర్రాలు సకిలించాయి. కాపలావాళ్లు యెగిరారు. హుషారెక్కిపోయి అరుపులు లంకించుకున్నారు.



''హేయ్! రష్యనూ! సారా కాస్తున్నావా?'' అని అరిచారు.

''అబ్బే! మా కుర్రాళ్లకి కొంచెం వెచ్చదనం యివ్వడానికి ఘాటైన చాయ్ పెడుతున్నా'' అన్నాడు యెగోరి.

''యిలా పడెయ్యి! చలికి గడ్డకట్టి చస్తున్నాం. మీ కుర్రాళ్లు రేపు నెగడులో పడి వెచ్చబడతారులే'' అంటూ వాళ్లు కూజా లాక్కుని వొక్క బొట్టు మిగల్చకుండా ఖాళీ చేసేశారు. గంజాయి తన పని మొదలెట్టింది. వాళ్లు బల్లేలు జారవిడిచి నేలమీద స్పృహ తప్పి పడిపోయారు.

యెగోరి ఠకామని నుంచున్నాడు. అతని కళ్లు మెరిశాయి.

''రండి, రండి, జారుకునే వేళ యిదే. గుర్రాల్ని పట్టుకోండి. జోడు జోడుగా వాటిని బారు తీర్చండి. గొర్రె తోలు తివాసీని తీసుకుని గుర్రాలమీద కప్పండి. బొచ్చు భాగం యివతలకి వుండేటట్టు కప్పండి.

''యింతకీ యిదంతా దేనికోసం యెగోరి?''

''నిప్పులుగక్కే భయంకర మహాకాళం అవుతుంది అది, మనల్ని కాపాడుతుంది.''

వాళ్లు చూశారు. నిజమే. బొచ్చు పైకి తిరగేసి కట్టిన గొర్రె తోలు కోటు తివాసీ నేలబారుగా వుంది. వందలాది కాళ్లున్న మహాకాళంలాగానే వుంది అది నిజానికి!

''అబ్బ! చూడ్డానికి యెంత భయంకరంగా వుంది'' అని వాళ్లు శిలువ గీసుకున్నారు. ''కాని దాని తల యేది?'' అని అడిగారు.

యెగోరి కొంచెం యెండుగడ్డిని పక్కకి తొలగించాడు. దానికింద పెద్ద మహాకాళ శిరస్సు నోరు ఆమ్మని తెరిచి వుంది. అక్కడున్నవాళ్లు భయపడిపోయి వెనక్కి అడుగేశారు.

మరింత పరకాయించి చూసేసరికి తెరుచుకున్న దవడల కింద నుంచి ముందుకు చొచ్చుకు వచ్చిన దంతాలు గొర్రె తోలుపైన వున్న ఆవు అస్థిపంజరపు ముడుసులు అని తెలిసింది.

‘‘తల పైకి యెత్తండి, భయపడద్దు’’ అంటూ యెగోరి వాళ్లని వేగిరపెట్టాడు. ‘‘యిప్పుడు దాన్ని మొదటి గుర్రాల జోడుకి కట్టండి. ఆ తర్వాత తోళ్లకిందికి పాకండి. నేను యీల వెయ్యగానే గుర్రాలని కొరడాలతో కొట్టండి, బలంకొద్దీ కొట్టండి. మీకు వోపిక వున్నంత మేరకి అరవండి.’’

వాళ్లు తోళ్లకిందికి జారివెళ్లాక, గుర్రాల జతలని పట్టుకున్నాక యెగోరి మంటలో కాగడా వెలిగించాడు. మహాకాళం తలపైకి యెక్కాడు.

‘‘రండి, రండి! తాత్సారం చెయ్యొద్దు’’ అని యెగోరి యెంతో గట్టిగా యీల వేశాడు. ఆ యీలకి గుర్రాలు భయంతో బెదిరాయి. వాళ్లు గుర్రాల్ని కొరడాలతో కొట్టేరు. అడివి జంతువుల్లా అరిచారు.

వేగంగా దౌడు తీయించి వెళ్లిపోయారు.

శత్రు సైనికులకి యీ గోలకి మెలుకువ వచ్చింది. చుట్టూతా కటిక చీకటి. యేమీ కనిపించలేదు. యేం జరిగిందో తెలియలేదు. భయంకరమైన చప్పుడు వినిపించింది. యేదో నేలమీద ధనధన కొట్టుకుంటోంది. దగ్గరవుతోంది. ఆ చప్పుడికి నేల అరిచింది. యింతట్లోకీ వున్నట్టుండి గుప్పున మంటరేగింది. నిప్పులుకక్కే భయంకరమైన మహాకాళం కనిపించింది. పెద్దగా బొచ్చు ఆవరించి వున్న ఆ మహాకాళం యెకాయెకీ వాళ్లకేసే వస్తోంది. భయంకరమైన దాని నోట్లోంచి జ్వాలలు యెగిసివస్తున్నాయి, పసుపుపచ్చని పొగలు చిమ్ముకుంటూ వస్తున్నాయి. దాని కళ్లు యెర్రగా మండేయి. తెల్లని యెముకలు, పుర్రెలు పక్క భాగాల్లో ఒరుసుకుని చప్పుడు చేస్తున్నాయి. రక్తం గడ్డకట్టేటట్టు అది అరుస్తోంది.



రావణా గోల! గుర్రాలు పట్టుదప్పిపోయాయి, శిబిరం చుట్టూ దౌడు తీయడం మొదలుపెట్టాయి. పిచ్చిగా సకిలించాయి. అరుపులతో, కేకలతో పరుగులతో కకావికలైపోయిన శత్రుమూకల్ని కసాపిసా తొక్కేశాయి. యెటో ఒకటు పారిపోవాలని పిచ్చిగా ప్రయత్నిస్తూ వున్న వాళ్లని మడ తొక్కేశాయి.

‘‘పట్టుకోండి, పట్టుకోండి’’ అని యెగోరి దద్దరిల్లిపోయేటట్టు అరిచాడు. కాగడా మీదకి మరికొంత గంధకం వేశాడు. మంటలు నిప్పురవ్వలు, పసుపుపచ్చ పొగ మహాకాళం నోట్లోనుంచి వచ్చింది గంధకం వల్లనే.



నిప్పులుగక్కే మహాకాళం కూలిపోయిన గుడారాలపైన దౌడు తీసింది. దిమ్మరి తండావి మడతొక్కింది. అరుచుకుంటూ చీకట్లో మాయమైపోయింది.

చెమటలుగక్కే గుర్రాలు మెల్లిగా నడక తగ్గించాయి. ఆఖరికి ఆగేయి. ఉక్కగా వున్న గొర్రె తోళ్ల కిందనుంచి లోపలున్న మనుషులు నేలమీదకి వురికేరు. సంతోషం పట్టలేక తుళ్లుతూ వొకళ్లనొకళ్లు కౌగలించుకున్నారు, కొందరైతే యేడ్చేశారు.

''కాని యెగోరి యేడి?''

వాళ్లు పరిగెత్తి వెళ్లి మహాకాళం తల కింద పడేశారు. యెగోరి అక్కడ ముణగ లాక్కుపోయి కూచున్నాడు. తల చేతులతో పట్టుకున్నాడు.

''యేమిటి? యేమిటి?'' అని వాళ్లు అడిగారు భయపడిపోయి. ''యేం జరిగింది?'' అతని ముఖం మీదనుంచి చేతుల్ని తీసి చూసారు. ఒక్కసారి కెవ్వున ఆః అన్నారు. అతని ముఖం కళ్లు కనిపించకుండా వుండేంతలా కాలిపోయింది.

''పవిత్ర కన్యా!'' అని వాళ్లు శిలువ గీసుకున్నారు. ''యెంత దారుణం! గంధకం అతని కళ్లల్లో పడి వుంటుంది. కళ్లు లేకుండా బతుకేమిటి నాయనా!'' అని విలపించారు.

''నాకేమీ తోచడం లేదు!'' అని యెగోరి సన్నగా జవాబు చెప్పేడు. ''మీరు యిళ్లకి వెళ్లిపొండి. మీరు గబగబా వెళ్లకపోతే వాళ్లు తరుముతారు'' అన్నాడు.

''కాని నీకు తోడెవరు? నీకు దారి యెలా తెలుస్తుంది? నిన్ను యిక్కడ వదిలివెళ్లిపోవడం ధర్మం కాదు.''

దారి చూపించేందుకు యెవళ్లనో తోడు వుంచుదామని వాళ్లు యెంత బలవంతం చేసినాగానీ అతను ససేమిరా వినలేదు. దాంతోటి వాళ్లు తమ రక్షకుడికి వొంగి వందనం చేసి కృతజ్ఞతలు చెప్పారు. అతని ముఖం చూడకుండా వుండే ప్రయత్నం చేశారు. భారమైన హృదయాలతో గుర్రాల్ని దౌడు తీయించుకుంటూ వెళ్లిపోయారు.

యెగోరి మెల్లిగా కళ్లేల్ని అదిలించి పరిగెత్తించాడు. బాధతో మూల్గుతో, గుర్రం జీనుమీద వూగుతో పోతున్నది యెక్కడికో అతనికే తెలియలేదు.

''వుహుఁ, యింటికి పోయి రోజంతా నెగడు పక్క కూర్చోడం వద్దు, అందరికీ భారం. నన్నీ రూపంలో చూస్తే మాష, పిల్లలు దడుసుకుంటారు. యెందుకు భూదేవికి భారం? తోడేళ్లకీ, యెలుగుబంట్లకీ ఆహారం అవడం మేలు. ఆ మేరకేనా నా జన్మ సార్థకమవుతుంది'' అనుకున్నాడు కటువుగా.

గుర్రం మెల్లిగా సకిలించి ఆగింది. యెగోరికి చల్లని గాలి హాయిగా తగిలింది. దగ్గర్లో 95

నది యేదో వున్న శబ్దం వినిపించింది. అతను గుర్రం దిగి గుర్రం డొక్కలు నిమిరేడు.

''వెళ్ళిపోమరి! లేకపోతే అడివి జంతువులతో ప్రమాదం'' అన్నాడు. తర్వాత అక్కడున్న తడి గడ్డిలో ముఖం బోర్లా పెట్టి వాలేడు.

అక్కడ మాషకి వొకటే ఆందోళనగా వుంది. గూట్లో పిట్టలాగా యిల్లంతా కలదిరిగేసింది. పని చేసుకోలేదు, నిద్రపోలేదు. యెగోరికి యేదో జరిగిందని ఆమె మనసుకి అనుమానం తోస్తోంది. యే అదృశ్య శక్తో ఆమెని యింటినుంచి బయటికి లాగేస్తోంది. ఆ రాత్రి ఆమె బయటికి వాకిలి దగ్గరికి వెళ్ళింది. ఆమె కాళ్ళు నది దాకా లాక్కుపోయాయి. ఒడ్డుకి పరిగెత్తింది. ఆమె గుండె దడదడ కొట్టుకుంటోంది. చుట్టూ చూసింది. ఆమెకి వొక నల్లని గుర్రం నది అవతలి వొడ్డున కనిపించింది. అది మాష కేసి చూసింది. మెల్లిగా సకిలించింది. రమ్మని పిలుస్తున్నట్టుగా తల ఆడించింది.



మాషకి యేదో అపశృతి కటుక్కున వినిపించింది. ఆ గుర్రం శుభశకునంగా గోచరించలేదు. యెందుకనో తెలియకుండానే పొగమంచు ఆవరించుకున్న నదిలోకి దూకింది. అవతలి తీరానికి యీదుకు పోయింది. నీళ్ళల్లోనుంచి బయటికి అడుగు పెట్టిందో లేదో యెంతకాలంగా యెవరి వియోగం అనుభవిస్తోందో ఆ యెగోరి కనిపించేడు. చిత్రం! గుర్రం అతన్ని సొంత నదీ తీరానికి తీసుకువచ్చింది.

మాషె కెవ్వున కేకవేసి భర్త పక్కన మోకరిల్లింది.

''యెవరు?'' అంటూ యెగోరి గడ్డిలోనుంచి తల పైకి యెత్తాడు.

ఆమె భయంతో వెనక్కి గెంతింది. దిక్కులు పిక్కటిల్లే కేక నోట్లోంచి రాకుండా అడ్డుకుంటున్నట్టు చేతిని నోటికి అడ్డం పెట్టుకుంది.

''నేను! నేను!'' అని మూలిగింది. కళ్ళల్లోనుంచి యేకధారగా నీళ్ళు కారుతున్నాయి, వొక్క మాటకూడా అన్లేకపోయింది.

యెగోరి అటు వేపు తిరిగిపోయాడు. ''నన్నొదిలి పెట్టు. యీ రూపంలో నా అవసరం నీకు వుండదు'' అన్నాడు.

మాష కన్నీళ్ళు తృటిలో యిగిరిపోయాయి.

''యేమిటా ముక్క? నాకు కాకపోతే నీ అవసరం యెవరికి వుంది? అకులీనా అమ్మమ్మా నేనూ కలిసి నీకు వసంతకాలం నాటికి నయం చేస్తాం. ఆమెకి కొన్ని మంత్రాలు, వన మూలికలు తెలుసు. అందం యెవరికి కావాలి? కావాల్సింది కళ్ళు, చిన్న ఆడపిల్లలు నిన్ను చూడక

పోవచ్చు, కాని నిన్ను నేను యింకా యెక్కువ ప్రేమిస్తాను. లే, గుర్రం యెక్కేస్తా. హోయ్ ద, ద, వెడదాం'' అంటూ గుర్రాన్ని పిలిచింది.

''దానికి రష్యన్ తెలియదు.''

''తెలియకపోవచ్చు. మనిషిలాగా అనుకోగలదు. నిన్ను యిక్కడికి తీసుకువచ్చింది చూడు'' అంది మాష. మెల్లిగా గుర్రాన్ని నిమిరి ముట్టె ముద్దుపెట్టుకుంది.

వాళ్లు నది దాటి ఇళ్ల ఆయకట్టు పర్రు వేపు బయల్దేరేటప్పటికి వెలుతురు పరుచు కుంటోంది. తడిసిపోయిన గుర్రం ఆవిర్లు కక్కుతోంది. చలికి వొణుకుతోంది. మాష దాని పక్కనే నడిచింది. ఆమె బట్టలనుంచి నీళ్లు వోడుతున్నాయి, కాని ఆమె గమనించ లేదు. భర్త కాలికి అదుముకుని వుంది. అతని కేసి చూసింది. అతను మునగలాక్కుపోయి కూచున్నాడు. ఆమె కళ్లు పడుచు పెళ్లికూతురిగా వున్నప్పటికంటే యెక్కువ ఆనందంతో ప్రకాశించాయి.



చక్కని విభాత వేళ గాని, మంచి యెండకాసే రోజు గాని యెగోరికి చిమ్మ చీకటి రాత్రిలాగానే వున్నాయి. నెలకిపైగా పొయ్యి పక్క బల్లమీద కూర్చునే వున్నాడు. పనిలేని చేతులు తెగిన రెక్కల్లా అతని మోకాళ్లమీద ఆని వున్నాయి. అతని తల వాలేసి వుంది. నిశ్శబ్దంగా కూర్చున్నాడు. భారమైన ఆలోచనలు రేగుతున్నాయి.

నిజమే మరి తుప్పు యినుముని తినేసినట్టుగా వుంది. ''చింతాసమం నాస్తి శరీర శోషణం.''

యింట్లో నిశ్శబ్దంగా, నిరుత్సాహంగా వుంటుంది. యెప్పుడేనా సాయంత్రం పూట మాష అతనికి యేదేనా చెప్పేది. తనూ పిల్లలూ గడ్డని పోగుచేసి మేటు వేస్తున్నారట. యెక్కణ్ణుంచి వచ్చిందో కొయ్య కాళ్లల్లోనుంచి వో కుందేలు బూడిద రంగు దెయ్యంలా వచ్చిందట. వాళ్లకి భయం వేసేసిందట. దాష యేమో పారిపోయిందట, ఆన్యా వొణికిపోతూ కూర్చుండి పోయిందట. వొంటిమీద వున్న గుడ్డలతో తల కప్పేసుకుందట. మాష అయితే వెనక్కి గెంతి ఆటగొర్రుమీద పడిందట. చూస్కోండి బాబూ ఆటగొర్రుమీద పడగానే వీపు గీరుకుపోయింది!

అందరూ నవ్వేవాళ్లు, యెగోరి తప్ప. చలనంలేని రాయిలాగా అతను అలానే కూర్చుని వుండేవాడు. అప్పుడు మాష వాళ్లకి యింకో సరదా అయిన కథ చెప్పేది. నడవలోకి దూసుకు

పోయి, వెక్కి వెక్కి విలపించేది. కాని లోపల్లోపలే యేడ్చేది, యెగోరికి తెలియకూడదని. అప్పుడు మళ్లీ యేమీ జరగనట్టే యువతలకి వచ్చేది.

అకులీనా అమ్మమ్మ కళ్ల నీళ్లు పెట్టేది కాదు. అందుకావిడకి వ్యవధి లేదు. ప్రతి రోజూ గరికలేరుకు రావడానికి అడివికి వెళ్లేది. ఆ సువాసన వనమూలికలతో యెగోరికి నయం చెయ్యడానికి ప్రయత్నించేది. తన మంత్రాలు కూడా వాడేది.

తూర్పు తెలతెలవారుతూ వుండగానే ఆమె చల్లని చన్నీళ్లు తెద్దామని నదికి వెళ్లింది. దిష్టి కళ్లు పడకుండా వుండాలని అంత పెందరాళే వెళ్లేది. నీళ్లు కొయ్య కుండలో పోసి గొణిగేది: ''తూర్పునుంచి ఉరుములు ఉరుముతూ మేఘం వచ్చింది. ఆ మేఘంలోనుంచి నిప్పులు చిమ్మే బాణం వచ్చింది. అది దేవుని సేవకుడైన యెగోరి అందమైన ముఖంమీద పడ్డ మచ్చల్నీ, ధైర్యంగల అతని హృదయంలోనూ, అతని నిశితమైన నేత్రాల్లోనూ, నల్లని కనుబొమలలోనూ ప్రవేశించిన దోషాలనీ, అతని ఉడుకు రక్తంలో, దూరిన మకిలినీ హతం చేస్తుంది. తథాస్తు!''

అప్పుడు ఆమె కుండ అడుగున ఓ చాకుతో శిలువ గీసేది. ఆ నీళ్లని యెగోరి ముఖం మీద చిమ్మేది.

''ఉఫ్! అమ్మమ్మా! మళ్లీ సోదంతా మొదలెట్టావా? నాకు అంధత్వం రాసిపెట్టి వుంది, జీవితాంతం వరకూ'' అని యెగోరి కంపించేవాడు.

''లేదు నాయనా! దుంపల్ని మేకలు వదలనట్టుగా నిన్ను వదలను. నీ యిష్టం వచ్చినట్టు కొట్టు, తిట్టు. కాని ఆశ మాత్రం చంపుకోవద్దు. నీ మొహంపైన మచ్చలన్నీ దాదాపు మానిపోయాయి. నీ కళ్లకి త్వరలోనే చూపు వస్తుంది, నమ్మితే నమ్మి నన్ను'' అనేది.



పొలాల్లో పనిచేసి పనిచేసి గరుకెక్కి, శుష్కించిపోయిన చేతులతో ఆమె తడి ఆకుల్నీ, చేదైన వనమూలికల్నీ అతని కళ్లమీద పెట్టేది. జాగ్రత్తగా తెల్లని గుడ్డ పట్టీ కట్టేది.

ఆ రకంగా ప్రతిరోజూ అకులీనా అమ్మమ్మ యెగోరి దోషాన్ని వాడి చాకులకీ, లోతైన సముద్రానికీ, బంగారు చేపకీ యెరగా పంపేది. ఆ బంగారు చేప బంగారు శిలమీదగాని చిలికిన దుంగమీద గాని కూర్చుంటుంది. అందులో ఆహారం, తీర్థం వుంటాయి. చీకటి అడివిలో అలాంటి దోషాలకోసం అని వుంటాయి యివి. యెగోరికి నయం అవుతుందని ఆమెకి నమ్మకం వుంది. తన నమ్మకంతో అతని చెడ్డ ఆలోచనలని తరిమెయ్యాలని ప్రయత్నించింది.

ఆకురాలు కాలంలో వో రోజున ఆకాశం విచారంగా కన్నీళ్లు కారుస్తూ భూమిని తడుపు

తోంది. యెగోరి బుజ్జి వాన్యతో వొక్కడూ వున్నాడు. అతను అనుకున్నట్టే కొడుకు పుట్టేడు. యథాప్రకారం యెగోరి బల్లమీద కూర్చున్నాడు. వాన్య నేలమీద పాకుతున్నాడు. తెరేంతీ పిల్లిని పట్టుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. పిల్లి వాడికి అందకుండా పారిపోతోంది. వాడి చిన్న చేతుల్లో చిక్కకుండా జారిపోతోంది. తోక పట్టుకు లాగితే వూరుకుంటుందా యేదైనా? వాన్య గది మధ్యలో కూలబడి విదారకంగా యేడుపు లంకించుకున్నాడు.

''వూ, యేమిటీ అల్లరి, యేడుపుగొట్టు వాడా? యిటు రా నా దగ్గరికి చూడు నా దగ్గర యేం వుందో'' అన్నాడు యెగోరి. వో చెంచాయో మరోటో పిల్లాడికి ఆటవస్తువుగా దొరుకుతుందేమోనని మేజామీద తడిమాడు. అక్కడ యేమీ లేవు. ఓ రై రొట్టె ముక్క తువ్వాలు చుట్టి వుంది. చిన్న తునకని పెచ్చు యేమీ లేకుండా తుంపాడు, బుజ్జి వాన్య పెచ్చుని నమలలేడు కదా.

''యిదుగో యింద, కొంచెం రొట్టె ముక్క తిను.''

కాని వాన్య యింకా గట్టిగా గీ పెట్టి ''నాకు పిల్లి కావాలి'' అని యేడ్చాడు.

''చూడు చిన్ని పక్షి పిల్ల గెంతుతోంది యిక్కడ'' అని యెగోరి రొట్టెని చిన్న ముక్కు, పెద్ద తోక వున్న పక్షికింద చేస్తూ అన్నాడు.

వాన్య యేడుపు మానేశాడు. తండ్రి మోకాళ్ల దగ్గరికి పాకి వెళ్లేడు. పిట్టకేసి చూశాడు.

''యీ పిట్ట కొన్ని గుడ్లు పెట్టిందొరే'' అంటూ యెగోరి రొట్టె ముక్కతో చేసిన అయిదు వుండల్ని మేజామీద విసిరాడు. ''యేం, అవి బుజ్జి బుజ్జి పకులని పొదిగాయి.'' ఓ తృటిలో బొద్దుగా వుండే అయిదు పిట్ట పిల్లలు బుద్ధిగా తల్లి దగ్గర కూర్చుని ప్రత్యక్షం అయాయి. వాన్య కూడా బుద్ధిగా కూర్చున్నాడు.

తర్వాత యెగోరి రొట్టె అప్పచ్చిని మేజామీదకి విసిరాడు.

''యేం తల్లి పిట్ట పిల్లల భోజనం కోసమన్చెప్పి ముచ్చటైన పొడుగాటి పురుగుని తెచ్చింది.''

''చెంచావో మరి?''

''వాటన్నిటికీ చెంచాలు వస్తాయి, వాటికోసం మేజా సర్ది కూర్చోడానికి బల్ల లేద్దాం'' ఆ రకంగా వాళ్ల అమ్మమ్మా, అమ్మాయిలూ వచ్చేదాకా ఆడుకున్నారు. మనవరాళ్లతో వచ్చి పిట్ట కుటుంబం హాయిగా కుండలతో, పెనాలతో, వస్తువులతో అమిరి వుండడం చూసింది. అవి రై రొట్టె ముక్కతో చేసిన మేజా దగ్గర కూచున్నాయి. ఆ మేజాపైప రొట్టెతో చేసిన దోసకాయలు, ఆపిల్ పళ్లు కూడా వున్నాయి.

''బాప్‌రే! యెగోరి! వీటన్నిట్నీ నువ్వే చేశావా? కళ్లు కనిపించకుండా యెలా చేశావ్?'' అని అమ్మమ్మ ఆశ్చర్యపోయింది.

''యేం చెయ్యాలో నా వేళ్లు చూసినట్టే వుంది. బోలెడు రొట్టె పాడుచేసేశాను, అమ్మమ్మా నాకు బాధగా వుంది'' అన్నాడు, సిగ్గుపడుతూ యెగోరి.

''దాన్ని గురించి యిదవకు నాయనా. యింకో రొట్టె కాలుస్తాలే. దీన్ని మాత్రం పారేస్తానా యేమిటి!'' అంది.

''మేమేమో రోజంతా తోటలో తవ్వుతూనే వుంటిమాయిరి. అయినా నాయన మాకేం చేసి పెట్టలేదు, బొడ్డూడని వాన్యగాడికి మాత్రం చేసి పెట్టాడు'' అని దాష, ఆన్యాలు ఉడుకుమోత్తనంగా అన్నారు.

''అలా యేడుపుగొట్టు మొహం పెట్టేబదులు మీరిద్దరూ వెళ్లి నాన్నకి బంకమన్ను తెచ్చి పెట్టకూడదూ, మీక్కూడా యేదన్నా చేసిపెడతాడు.''

''యేమిటమ్మమ్మా? మట్టి పిసుక్కోవడం మగాడి పనా యేమిటి?'' అన్నాడు యెగోరి.

''యెంత చచ్చు పనైనా అప్పనంగా కొట్టెయ్యడం కంటే మెరుగే కదా. యేదో వొకటి చెయ్యి. వొట్టినే కూచుంటే చేతుల్లో వున్న విద్య కాస్తా యిగిరిపోతుంది.''

యీ లోపున ఆన్యా నల్ల రేగడిమన్ను తెద్దామని నది వొడ్డుకి పరిగెత్తివెళ్లి తీసుకొచ్చింది. దాష వో కనుమనుంచి ఎర్రమట్టిని తెచ్చింది. అది పొడారిపోకుండా వుండేందుకని తడి గుడ్డలో చుట్టబెట్టి తెచ్చారు. మర్నాడు పొద్దుట తండ్రి పక్కన వో బల్లా, బల్లమీద రేగడిమన్నూ తయారుగా వున్నాయి.

''నాన్నా యెర్రమట్టి నీ యెడం చేతి వేపు వుంది, నల్ల మట్టి కుడి చేతి వేపు వుంది. చేతులు కడుక్కోవడానికి దాబరా గిన్నె నీళ్లు పక్కనే వున్నాయి. జాగ్రత్త వొలకబోసేవు. యెర్రబొమ్మని నల్ల జడలతో చేసెయ్యి సాయంత్రానికి'' అంది ఆన్యా.

''నాక్కూడా వో బొమ్మని చేసెయ్యి. గుర్రం, ఆవు'' అంది దాష గబగబా.

''నాకు పిల్లిపిల్ల కావాలి'' అని వాన్య యేడ్చాడు.

''వూఁ, యిక పోటీ లేదు బాబూ! నీకు యేవేం కావాలో పురమాయింపులు వచ్చేశాయి, యిక పని మొదలుపెట్టు'' అని నవ్వుతూ అంది అకులీనా అమ్మమ్మ.

అంతా తోటలోకి వెళ్లిపోయారు.

యెగోరి యింత యెర్రమట్టి ముద్దని చేత్తో తీసుకుని ఆలోచించేడు: అది వెచ్చగా వుంది. బరువుగా వుంది. వాసన లేదు.

''సరే అయితే. బొమ్మ అవుతుంది యిది. వాన్య, నా పక్కన కూర్చుని నాకు సాయం చెయ్యి. నాకు కనిపించదు కదా. బొమ్మకి చేతులు తప్పుగా పెడతానేమో'' అన్నాడు యెగోరి.

వాన్య దేక్కుంటూ తండ్రి దగ్గరికి వెళ్లాడు. ఉగ్గబట్టుకు తండ్రి కేసి చూశాడు. తండ్రి చేతుల్లో మట్టి ఆడమనిషి బొమ్మగా రూపు తీసుకుంటోంది.

''లావాటి యీ వర్తకుడి భార్యకి పెద్ద గౌను తొడుగుదాం'' అన్నాడు యెగోరి ఆ బొమ్మ చుట్టూ యింత మట్టి ముద్దని పెడుతూ. ''దానిమీద కొంత అల్లికం పని చేద్దాం'' అన్నాడు.

గౌను అంచుల్ని నొక్కాడు. చక్కని కుచ్చెళ్లు వచ్చాయి.

''చేతులకి మరి? చొక్కా చేతులు పెడదాం. వర్తకుడి పెళ్లానికి పని పడదు. చట్టలమీద చేతులు పెట్టుకు నుంచుంటుంది, అవీ యివీ చెయ్యమని పురమాయిస్తూ.''

అతను చేతులు నీళ్లల్లో ముంచి బొమ్మని సాపు చేశాడు. అది గొప్పగా మెరిసింది.

''కళ్లు యేవీ?'' అని వాన్య చిరాగ్గా అడిగేడు.

''పుల్ల ముక్క తెచ్చి ముఖంమీద రెండు చుక్కలు పెట్టు.''

వాన్య అలానే చేశాడు.

''యిప్పుడామెకి కనిపిస్తుందా?'' అని యెగోరి విచారంగా అడిగేడు. ''యెవళ్లేనా మంత్రదండం తిప్పి నాకు కనిపించేటట్టు చెయ్యగలిగితే...'' అన్నాడు.

''నాకు పిల్లిపిల్ల కావాలి'' అంటూ వాన్య యెగోరిని యెక్కువసేపు నిలవనియ్యలేదు.

''వూ, అయితే నల్ల మట్టి యియ్యి'' అన్నాడు యెగోరి. దాన్ని లావాటి దోసకాయలాగా తయారుచేశాడు. ''మంచి లావుపాటి తెరేంతీని తయారుచేద్దాం. తల, చెవులూ యెర్ర మట్టితో పెడదాం. నువ్వు దానికి కళ్లు పెట్టు, వాన్య. దాని పంజాలు, తోక కూడా యెర్ర మట్టితో పెడదాం. తోక లోపల కర్రతో బెజ్జం చేస్తే యీలలాగా వూదచ్చు. తెరేంతీ యీల వేస్తే ఎలకలన్నీ పారిపోతాయి. దాన్ని ఆరనీ. యీ లోపున దాషకి మంచి బొమ్మ చేద్దాం.''



''అమ్మకో?''

''అమ్మకి నల్లని గుర్రాన్ని చేద్దాం. పొడుగాటి తోకతో. మన గుర్రం 'నక్షత్రాని'కి వుండే అలాగ. దానిమీద గడ్డం వున్న మనిషొకడు కూర్చుంటాడు. కొమ్ములున్న మేకని చేద్దాం. మువ్వలు కట్టిన ఆవుని చేద్దాం. బుజ్జి బుజ్జి పిల్లలున్న పందిని చేద్దాం. ఆ పిల్లలు తల్లి చుట్టూ చేరి పాలు తాగుతూ గుర్రుమంటాయి.''

ఆ రకంగా పనిచేస్తూ వాళ్లు సాయంత్రందాకా అలానే గడిపారు. బల్ల తీర్థాల్లో

బొమ్మల కొట్టు మాదిరీ తయారైంది. గడ్డం వున్న మనుషులు, బాల్చీలనీ, పిల్లల్నీ మోసుకెడుతూ వుండే ఆడవాళ్లు, రిక్కించిన చెవులతో గుర్రాలు, పెద్ద పెద్ద కొమ్ములతో ఆవులు, కలిసి నాట్యం చేస్తూ వున్న పిల్లీ కుక్కా, రెక్కలున్న కొన్ని వింత జంతువులు. యీ జంతువులన్నీ అరుస్తూ, కూస్తూ, తోసుకుంటూ పాటలు పాడుకుంటూ వుండటం — అక్కడికి అవన్నీ ప్రాణంతో వున్నట్టుగా. అలాంటి బొమ్మలన్నీ చేరాయి.

అందరూ యిళ్లకి చేరే వేళకి యేం సరంభంగా వుందని!

''చూడండి చూడండి, ఆ తమాషా మేక బూరా వూదడం!'' అని మాష నవ్వింది.

''అరె గడ్డం వున్న ఆ ముసలి మనిషే! అచ్చం అఫనాసీ తాత ముద్ర!'' అని అకులీనా అమ్మమ్మ విరగబడి నవ్వింది.

యెగోరి కూడా తొలి సారిగా నవ్వేడు. తను యెంత అలిసిపోయాడో యెవళ్లకీ చెప్పలేదు. రోజంతా యెవరితోనో కుస్తీపట్టి ఆఖరికి గెల్చినట్టు వుంది అతనికి. బల్లమీద వాలి ఆదమరిచి నిద్రపోయాడు. యెందుకతను చిరునవ్వు నవ్వేడో యెవళ్లూ చెప్పలేకపోయారు.



ఆ గడ్డు శీతకట్టు అంతా యెగోరి పొద్దుటినుంచి సాయంత్రం దాకా బొమ్మలు చేస్తూనే వున్నాడు. రెండు పీపాల మట్టి తెప్పించాడు. కష్టపడి పని చెయ్యడంద్వారా తన దౌర్భాగ్య స్థితిని దాటేడు.

యింట్లో కూచునే చోటు లేకుండా పోయింది. అన్ని బల్లలూ, అల్మారాలూ, పొయ్యి తీనెలూ, సొరుగులూ బొమ్మలతో నిండిపోయాయి. యెక్కడ చూసినా బొమ్మలు, బొమ్మలు. మాష, అమ్మాయిలు కలిసి వాటికి రంగులు వెయ్యడం నేర్చుకున్నారు. తండ్రి చేసిన బొమ్మల్ని పాడు చేస్తామేమోనని వాళ్లు మొదట్లో భయపడ్డారు. కాని తర్వాత ఒడుపు పట్టుకుని, సంతోషంగా రంగులు వేశారు.

వాళ్లు కుంచె వాడలేదు. బాతు యీకని వాడేరు. అదయితే తడి మట్టికి అతుక్కుపోదు. మూడు రంగులు యెంచుకున్నారు: యెర్రటి యెరుపు, పొద్దుతిరుగుడు పువ్వు యెరుపు, మరకతం పచ్చ. యీ ఆకుపచ్చ రంగు వానకి తడిసి మెరిసే గడ్డి పచ్చదనంతో వుండేది. బొమ్మలకి రంగులు వెయ్యడం అదీ పూర్తయాక చూస్తే వుండేది! ఓర్వలేని వాళ్ల కళ్లు కుట్టేవి!

సాయంత్రాలప్పుడు చల్లని వెన్నెలలో మంచు నీలం రంగుగా కనిపించేటప్పుడు,



కొరికేసే చలి నదిని గడ్డ కట్టించినప్పుడు జిగురు కొయ్యని కాగడాలాగా వెలిగించేవాళ్ళు, నిరసంగా వుండే దాని వెచ్చని వెలుతురులో యీ మనుషుల సుఖమయ ప్రపంచాన్ని దీప్తం చేసేది. మట్టి బొమ్మలూ, నవ్వే జంతువులూ సంతోషంగా కలిసి కాపరం చేసేవి.

యెగోరి చేతులు దుష్ట రాక్షసిని గాని, చెడ్డ వ్యక్తిని గాని యెన్నడూ చెయ్యలేదు. మంచి వాళ్లని మాత్రమే చేశాయి. రష్యా అంతటా కూడా, ప్రజలకి జీవితం యెంత గడ్డుగా వున్నా కూడా, కళాకారులు యెప్పుడూ మంచి వాటినీ ఆనందదాయకమైన వాటినీ మాత్రమే నిర్మించారు; వాటి గురించే రాశారు; వాటినే మలిచారు; చెక్కారు. జనం దౌష్ట్యాన్ని చూసీ, మృత్యువుని చూసీ నవ్వేరు. మంచి నవ్వే యేనాటినుంచో సకల దురదృష్టాలకీ విరుగుడు.



పనిలో పడిపోవడంతోటి దీర్ఘ శీతాకాలం యిట్టే గడిచిపోయింది. యేం చేస్తున్నారో, యెలా వున్నారో చూసుకునే లోపలే అకులీనా అమ్మమ్మ వసంత రుతువుకి స్వాగతం చెప్తోంది.

యెగిరి రండి భరత పక్షుల్లారా
యెండా కాలం తెండీ!
శీతకట్టుతో సతమతమైతిమి.
మా గాదులన్నియూ నిండుకొన్నవి
ఆకలితో మా కడుపులు కాలెను
నెగడుకి కట్టెలు కరువే ఆయెను
బాధా దుఃఖం యెక్కువ మిగిలెను.

వసంత రుతువు వింది. వచ్చింది. విల్లో చెట్టు లేత కొమ్మలతో స్వాగతం చెప్పింది. అది ధైర్యంగల చెట్టు. దానికి రాత్రి మంచు అంటే భయంలేదు. పల్లెటూరి జనం విల్లో కొమ్మలు విరిచి వాటితో వొకళ్లనొకళ్లు తట్టుకున్నారు. దూళ్ల వీపులనీ తట్టేరు. ''ముచ్చటైన విల్లో, గట్టిగ కొడుదుము, సంపద తెత్తుము నీకు'' అంటూ పాడేరు. వసంతరుతు విల్లోనుంచి వాళ్లకి ఆరోగ్యం, బలం చేకూరాయి.

వసంత రుతువు నాట్లు అయిపోయాక యోధుడు గియోర్గి పండగరోజు వొచ్చింది.

 పశువుల్ని కొట్లాల్లోనుంచి పచ్చికబీళ్లమీదకి తోలేరు. అమ్మమ్మ ఆవుకీ, గుర్రం ''వక్ష

త్రాని’’కీ మళ్లీ కొన్ని ‘‘శంకువు’’లు తయారుచేసింది. ‘‘నక్షత్రమే’’ యెగోరిని బందిఖానానుంచి తప్పించి తీసుకువచ్చింది. పొద్దుట ఆమె వాటి దగ్గర కొన్ని మంత్రాలు చదివింది. అందరూ కలిసి పశువులతో బాటు పొలాల్లోకి వెళ్లారు. వాన్యని కూడా తమతో తీసికెళ్లారు.

యెగోరి వొక్కడూ వుండిపోయాడు. ఓ చిన్న భరద్వాజ పిట్టని చెయ్యడానికి సరిపడా మట్టి పీపాల్లో మిగిలి వుంది. వున్నట్టుండి నడవలో తలుపు ధనామని తెరుచుకుంది. యెవళ్లో లోపలికి దూసుకువచ్చేరు.

‘‘యెవరది? మాషా?’’ అని యెగోరి అడిగాడు.

‘‘కాదు, మాష కాదు’’ అని ఆ ఆగంతక కంఠం జవాబిచ్చింది. స్పష్టంగా, బింకంగా వున్న కంఠం అది. ‘‘యింటి దగ్గర కూర్చున్నావేం, పొలాల్లోకి వెళ్లాల్సివుంటే?’’ అని ప్రశ్న.



యెగోరి పాలిపోయాడు.

‘‘నాకా యోగం లేదు, నేస్తం, యిక పొలాల్లో నాకు చెయ్యాల్సింది యేమీ లేదు.’’

‘‘వుంది. యివాళ యేదో వుంది. నాతో రా’’ అని ఆ కంఠం అంది.

‘‘సంతోషంగా వద్దును. కాని రాలేను’’ అన్నాడు యెగోరి నీరసంగా. ‘‘నేను అంధుణ్ణి కనిపించడంలేదా? అక్కడికి చేరలేను’’ అన్నాడు.

‘‘నేను తీసికెడతా’’ అని ఆ ఆగంతకుడు ధైర్యం చెప్పాడు. యెగోరి చెయ్యి పట్టుకుని, అతన్ని నిశ్శబ్దంగా గుమ్మం దాటించి, తర్వాత కంచెవాకిలి దాటించి వూళ్లో నడిపించుకుంటూ పెద్ద మైదానంమీదకి తీసికెళ్లాడు.

‘‘యిక్కడికి వొచ్చేవు’’ అన్నాడతను. తర్వాత గడ్డిమీదకి వొంగి ముత్యాల్లాంటి మంచుని రెండు దోసిళ్లనిండా తీసుకుని యెగోరి ముఖంమీద చిలకరించేడు.

చల్లని మంచు యెగోరిని జ్వాలలాగా మండించింది. అతను చేతులతో కళ్లు పట్టుకున్నాడు.

‘‘భయం లేదులే’’ అని ఆ మనిషి నిదానంగా అన్నాడు. ‘‘నీ చేతులు తేసెయ్యి. యిప్పుడు కనిపిస్తోందా?’’ యెగోరి జాగ్రత్తగా చేతులు తీసేశాడు. అతని కళ్లముందు మెరుపు దూసుకుపోయినట్టైంది.

‘‘నాకు కనిపిస్తోంది, నాకు కనిపిస్తోంది’’ అని మెల్లిగా అన్నాడు. నవ్వేడు. సంతోషంతో, ఆవేశంతో వణుకు వొచ్చింది. యేడ్చేశాడు. అతనిముందు బంగారుజుట్టు వున్న

యువకుడు నుంచున్నాడు. తళతళ మెరిసే కవచం తొడుక్కున్నాడు. మెరుస్తూ వుండే కత్తిమీద అనుకున్నాడు.

''యోదుడైన గియోర్గి! యిది కలా! మాయా? యెందుకు నాకు మళ్ళీ కన్పిచ్చావు?'' అని యెగోరి వెనక్కి అడుగేసి అడిగాడు.

''యెందుకంటే నువ్వు ధైర్యం పోగొట్టుకోలేదు. ప్రతి మనిషికీ జీవితంలో యేదో వొక దశలో చీకటి, అంధత్వం కలిగే దశలు వుంటాయి. కాని అందరూ మళ్ళీ వెలుతురుని చూడలేరు. నువ్వు చిక్కబట్టుకున్నావు. అందుకని నీ చూపు నీకు మళ్ళీ యిచ్చేను. శుభం.''

బంగారు రవ్వల రాశిని చిమ్మించేడు. అవి యింకా యింకా తేజోవంతంగా వెలిగాయి. ఆ యువ యోధుడు అదృశ్యం అయిపోయాడు. తెల్లని మేఘం వొకటి మాత్రం మైదానం మీద తేలి అదృశ్యం అయిపోయింది.

యేమిటది? అద్భుతమా? అందమైన కలా లేకపోతే అమ్మమ్మ వనమూలికలా యెగోరిని నయం చేసినవి? యెవళ్ళూ యివాళ్టికి కూడా చెప్పలేకపోయారు.



రోజులు గడిచాయి, కురిసేవానలాగా. వారాలు గడిచాయి, వసంత రుతువునాటి పచ్చికలాగా. యేళ్ళు గడిచాయి, నదీ ప్రవాహంలాగా.

యెగోరికి అద్భుతంగా దృష్టి వచ్చిన నాటినుంచీ చాలా యేళ్ళు గడిచిపోయాయి. వాన్య కూడా తల్లిదండ్రుల సందిట వుండడం లేదు. వాడి తాతకిలాగా గంటలంటే వాడికి యిష్టం కలిగింది. యిప్పుడు మాస్కోలో గంటలని పోత పోస్తున్నాడు. యెంతో శ్రావ్యంగా వుండే గంటలు. వాటి కీర్తి ఇళ్ల ఆయకట్టు పర్రు దాకా పాకింది. యెగోరి కూతుళ్ళ అతని విద్యార్థులైన మంచి కుర్రాళ్లని పెళ్లాడేరు.

యెగోరి నికొదీమ్ బాబా సలహా పాటించాడు. తన ప్రతిభా విశేషాలని దాచుకోలేదు. ఉదారంగా శిష్యులకి అందించాడు. అతనికి బోలెడు మంది శిష్యులు పోగయారు. మూడు బృందాలకి సరిపడా వుంటారు.

మిలమిలలాడే కళ్లున్న కుర్రాళ్ళు, యెన్నిటోనో నేర్చుకోవాలన్న ఆసక్తి వున్నవాళ్ళు, దూరదూర ప్రాంతాలనుంచి వచ్చేరు. కొంతమంది వుండిపోయారు. కొంతమంది వెళ్లిపోయారు. వాళ్ళ యీ విద్య తమకి కాదని గ్రహించి వెళ్లిపోయారు. యెగోరి యెప్పుడూ బలవంతం చెయ్యలేదు. మరో మిరోన్ తయారవడం అతనికి యిష్టం లేదు. లోకంలో

బోలెడు వృత్తులు వున్నాయి, సరియైన దాన్ని యెంచుకొమ్మనండి, యెంత తొందరగా అయితే అంత తొందరగా. వాళ్లకీ హాయి, మిగిలినవాళ్లకీ హాయి నికొదీమ్ చెప్పినట్టు.

ఆచారం ప్రకారం అతని శిష్యులందరూ అతని యింట్లోనే వొకే కుటుంబంగా వుండే వాళ్లు. పని, పండగలు, కష్టసుఖాలు — అన్నీ అందరికీ కలిసే వుండేవి. వాళ్లు కలిసే నైపుణ్యం, జీవితానుభవం, ఉదారత్వం నేర్చుకున్నారు. మంచి మనసు కాకపోతే కళ కూడా మంచిది అవదు.

బోధించడానికి బదులుగా యెగోరి అప్పుడప్పుడు తన అల్లరికోళ్ల గుంపుని "ప్రకృతితో పరిచయానికి" తీసుకెళ్లేవాడు. శీతాకాలంలో నిగూఢ శ్వేత నిశ్శబ్దాన్ని ఆలకించే వాళ్లు, మంచుమీద మెరిసే నీలినీడలని చూసి ఆశ్చర్య చకితులయేవాళ్లు, మంచు కప్పిన కొమ్మలని చూసి 'ఆహా' అనుకునేవాళ్లు.

వసంత రుతువులో వెచ్చబడే నేలమీదనుంచి లేచే ఆవిరిని చూసేవాళ్లు. మంచు కరిగి యేర్పడ్డ మొదటి నల్లని మచ్చలని చూసేవాళ్లు, తేజోవంతమైన వినీలాకాశ నేపథ్యంలో చెక్కినట్టున్న శ్యామల వృక్షతతిపై యెక్కి కూసే పక్షుల కూతలని వినేవాళ్లు.

నార మొక్కలు వికసించి పూసే సరస్సుల్ని వేసవిలో చూసి ఓహో అనుకునేవాళ్లు. మంచుకి తడిసిన పసిరికలో దిసపాదాలతో ఉషాకన్య ఆకాశంలో అరుణ కాంతులు విరజిమ్మడం కోసం యెదురు చూస్తూ వుండేవాళ్లు. సంభ్రమ ఆశ్చర్యాలతో, చూరుకింద నుంచి చూసే పిచికల్లాగా, వాళ్లు గడ్డి అటకలమీదనుంచి ఆకాశం ఫెళఫెళార్భటులతో ఉరమడం వినేవాళ్లు, నీలి మెరుములతో తటిల్లు మనడం చూసేవాళ్లు. ఆ మెరుపులూ, ఉరుములూ నల్లని పయోధరాల పంక్తిలో అదృశ్యం అయిపోయేవి. కుండపోతగా వానకురిసి వెలిశాక వాళ్లు పెరళ్లలోకి పరిగెత్తేవాళ్లు. బూడిద రంగు నీళ్ల కుంటల్లో నుంచునే వాళ్లు, ఆకాశంలో ఆ అంచునుంచి యీ అంచుకి శోభాయమానంగా విరిసిన రంగు రంగుల బంగారు హరివిల్లుని చూసేవాళ్లు.

ఆకురాలు కాలంలో అలసిన అవని చిత్రవర్ణ శోభితమైన ఉడుపులు ధరించేది. వేలాడే సాలెగూళ్లమీద పడ్డ హిమ బిందువులు కన్య శిరోవేష్టనమీద వుండే విలువైన ముత్యాల్లా మెరిసేవి. అప్పుడా శిష్యులు ఆశ్చర్య చకితులై తమ మాతృదేశంకంటే ప్రియమైంది లేదని అనుకునేవాళ్లు.

ఆ సంవత్సరాలలో చాలా జరిగాయి. కరువు, అంటు జాడ్యాలు, అగ్నిప్రమాదాలు, యుద్ధాలు సంప్రాప్తించాయి. యెంతోమంది అయిన వాళ్లు మట్టి కలిసిపోయారు. యెగోరి

జుట్టు వెండి ఉంగరాలు చుట్టుకుంది. మట్టిలో పుట్టిన గోధుమ మరలో పడి పరిశుద్ధమైనట్టుగా మనిషి దుఃఖాలని కడతేరి పరిణతుడవుతాడు. కష్ట కాలంలో అతను యెల్ల వేళలా అమ్మమ్మకిష్టమైన పాటని గుర్తుచేసుకునేవాడు.

నల్లని మబ్బుల వెనక మిలమిల తారలు మెరయును
మిలమిల తారల వెనక చక్కని చంద్రుడు వుండును
మెరిసే చంద్రుని వెనక కెంపుల ప్రభాత ముండును
కెంపుల ప్రభాతం వెనక బంగరు సూర్యుడు వుండును

అంచేత అతని రంగులు నలుపువి కావు, బూడిద రంగువి కావు. వాటికి శుద్ధ వ్యతిరేకం! అతని వయస్సు పెరిగేకొద్దీ అవి మరింత తేజోవంతంగా, మరింత సంతోషకరంగా తయారయాయి.

అతను తన యావజ్జీవితం దేన్ని చిత్రించాలనుకున్నాడో దాన్ని చిత్రించే రోజు రానేవచ్చింది.

యోధుడైన గియోర్గిని చిత్రించి రంగులు వెయ్యాలని అనుకున్నాడు. యోధుడు గియోర్గి దుష్ట శిక్షణ చెయ్యడం యెన్నడూ మానడు; దుష్టత్వం యెంత యెక్కువగా వున్నాగానీ యెప్పుడూ దాన్ని వోడిస్తాడు.

యోధుడు గియోర్గిని పెద్ద అట్టమీద గీశాడు.

భయమెరగని ఆ యోధుడు బంగారు కవచంతో చక్కని తేజీమీద స్వారీ చేస్తున్నాడు. అతని యెర్ర అంగీ గాలిలో తేలి రెపరెప లాడుతోంది. బంగారు కరవాలం యెండలో మెరుస్తోంది. అతని గుర్రం నల్లని మహాకాళాన్ని తొక్కుతోంది. పొడుగాటి సన్నని బల్లెం ఆ మహాకాళం కాయంలో గుచ్చుకుంది.

రష్యా యావత్తూ యీ అద్భుత, సువర్ణ శిరసు శోభిత యువకుడిలా వుంది. రష్యా యావత్తూ రెపరెపలాడే అరుణ చేలాంచలంలో వుంది. కాల శ్వేతాశ్వంమీద నిర్భయంగా దౌడు తీస్తోంది. చెడుని యే రూపంలో వున్నా, యే ఆకారంలో వున్నా తాడిస్తోంది.

యెగోరి ''క్షణశః కణశశ్చైవ'' సాధించిన జ్ఞానం అతను చిత్రించిన యోధుడు గియోర్గిలో యౌవనోత్సాహంతో, శక్తితో శోభిల్లింది.

''వూఁ యిదీ! నేను పేరు చెడగొట్టే పని చెయ్యలేదు. ఆఁ'' అని నెరిసిన గడ్డం లోపల నుంచి గొణిగాడు.



కుంచెలని జాగ్రత్తగా కడిగేడు. యింట్లోనుంచి బయటికి వెళ్ళేడు. అడివిలో రాలి పడిన కారాకులమీద మెల్లిగా తిరిగాడు. హఠాత్తుగా మేఘపంక్తినుంచి వినీలాకాశంలో గంగా ఝరిలాగా శబ్దం చేస్తూ శబ్దం వినిపించింది. సరిగ్గా మాస్కోలో వినిపించినలాంటిది. ఆ వింత సంగీతం మరింత దగ్గరవుతోంది. ఆ పాడేవి తెల్లని హంసలు. నీలాకాశంలోనుంచి అవి ప్రత్యక్షమయాయి. మెల్లిగా స్వప్నంలో ద్యోతకం అయినట్టుగా, అవి వాటి పెద్ద రెక్కల్ని అతనిమీద ఆడించాయి. కాని యెగరడం మానేశాయి.

''యెక్కడికి నన్ను రమ్మని పిలుస్తున్నారు మిత్రులారా?''

తర్వాత తన శరీరం తేలిక అవుతున్నట్టుగా అతనికి అనిపించింది. మెల్లిగా భూమి మీదనుంచి యెగిరి నిశ్శబ్దంగా పైకి, యింకా పైకి తెల్లని హంసలాగా యెగిరాడు. అదృశ్య పక్షాలని అలవోకగా ఆడిస్తూ తనలాంటి అజ్ఞాత, మహత్తర రష్యన్ కళాకారుల అంతంలేని వూరేగింపులాగా అమరత్వానికి....



పాఠకులకు మనవి

ఈ పుస్తకం గురించీ, దీని అనువాదం గురించీ మీ అభిప్రాయాలను "రాదుగ" ప్రచురణాలయానికి దయచేసి తెలుపండి.

మీ అభిప్రాయాలను ఈకింది చిరునామాకు పంపండి:

Raduga Publishers

17, Zubovsky Boulevard

Moscow, USSR







ISBN 5-05-001445-x